brown book

UNIVERSAL
LIBRARY
OU_204102
UNIVERSAL
LIBRARY

రాజసూయరహస్యము

గ్రంథకర్త

వెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

పిఠాపురము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1938

సర్వస్వామ్య సంకలితము.

వెల ఒకరూపాయి.
(రూ 1-0-0)

PREFACE.

to

The Secret of Rajasuya

By

Pendyala Venkata Subrahmanya Sastry

Mr. Pendyala Venkata Subrahmanya Sastry needs no introduction to the scholarly public of the Andhra Desa. His deep and extensive knowledge of the entire range of our ancient literature-Vedas, Brahmanas, Upanishads, Itihasas and Puranas—, his critical acumen and fearless spirit of enquiry, have already been illustrated by one of the best books on the higher criticism of the Mahabharata ever published, whether in the European or the Indian languages. It is a mark of the frank and truthful nature of Mr. Subrahmanya Sastry that he does not claim originality of conception for his great book. The following translation of the first paragraph of a letter which he addressed to me on the 10th April 1937 is highly illustrative of the generosity of the Sastry:

"Arya! The lecture you delivered on the Mahabharata in the Gokhale Hall some time ago has been the seed which entered the field of my heart and grew into the *Mahabharata Charitra*. In the same way, the points you mentioned to me during a visit of mine which I paid to you has instigated me to go once again into Vedic literature and to write a similar book of interpretation, *the Secret of Rajasuya*. Your suggestions were only guid-

ing threads; naturally they could not be expected to be fully explorative of the whole field"

Such an appraising of a fellow-worker's contribution is a rare and refreshing feature in literature and only an author sure of his own well-founded greatness could be so ungrudingly generous.

It was about the year 1922 that the hypothesis, developed into a theory in this book, first crossed my mind. It so happened that a great grammarian, Mr. Vajjhula China Sitaramaswami Sastrulu, a profound and eminent scholar in Sanskrit as well, paid me the honour of a visit while I was staying at Nellore. I discussed the theory with him and told him that I was sure that there would be texts in the Brahmanas and in the literature earlier than the Brahmanas bearing on my theory, which would in all probability confirm the rather daring and unorthodox interpretation that alone appeared to fit the facts. Mr. China Sitaramaswami Sastry was kind enough to look up the texts and sent me a few confirmatory extracts, but owing to various causes, which need not be expressed here, there the matter stopped.

During my retirement from public life, Mr. Pendyala Venkata Subrhmanya Sastry honoured me with a visit at Chittoor 1936 January. Knowing from a careful and diligent study of his epoch-making *Mahabharata Charitra* what a supremely competent higher critic, comparable to Dr. Syama Sastry of Mysore, we had in Mr. Subrahmanya Sastry, I discussed my theory

of Rajasuya with him. Mr. Sastry is very old. But I know of no one who catches intellectual fire so quickly and blazes forth so abundantly. Hardly had I finished stating my general view, when he was there accepting it and developing it much farther than I ever imagined it could go, and fortifying it with texts, quotations, analogies and further illustrations, at which I was completely astounded. In the result, this book, which now goes out to the world, both as illumination and challenge, has been produced.

We had a certain amount of correspondence on this subject and the following extract from a letter which I wrote to him on the 15th Apil 1937 summarises my position completely.

"As regards what you say about Rajasuya, I have already, as mentioned in your letter, initiated you into my theory, which evidently you are going to uphold, as a result of the scholarly and critical researches you are pursuing.

I may summarise my general views as follows:

(1) There were human sacrifices in ancient times. But all human sacrifices were not Rajasuya sacrifices. Rajasuya is a special variety of human sacrifice. In the Santi Parva is mentioned the case of a King who had one hundred wives and an only son. This one son was sacrificed, and he got in exchange one hundred sons, one by each wife. This is a variety of Putrakameshti. Jarasandha used to sacrifice kings to the gods. The ancient Greeks also were good at this game, though not so lavish.

In the Sanskrit Maha Bharata are mentioned many kinds of sacrifices, and, apparently, they ate the flesh of the animals sacrificed. Later as you find in the Asvamedha Parva, they inhaled the smell of the flesh flung into the sacred fire and this I take to be a reform effected under Buddhist, Jain or other later influences. In the Asvamedha Parva, curiously enough, there is a beautiful episode decrying the cruel Vedic sacrifices and eulogising the virtue of self-sacrifice in the modern Ahimsa sense of the term, obviously inspired by Buddhism.

(2) Rajasuya is a special variety of human sacrifice in which, I think, the killing of a king was the essential ritual. Its intention was to proclaim the suzerainty or Chakravarthithva of the king performing it. It was a symbolic way — a very gruesome and effective symbol - of declaring that the Emperor was Pasupathi and that the other kings were Pasus – sacrificial or other animals-relatively to the Suzerain,

Now a king must be brought there either as a prisoner or you must catch hold of one of the kings present as an invited guest, provided he was a Samanta or a defeated or a petty monarch, and finish him off nicely. It is one of the blots of our ancient civilisation that no prisoners of war were ever taken, but they were all slaughtered mercilessly or left to die in the battlefield like Duryodhana. In this respect also the Aryans were like the ancient Greeks and perhaps like most Primitive tribes. Even Jarasandha had captured many

kings, only to kill them. Sisupala seems to have been a victim thus cornered or captured. Had he known previously that he would be a victim, he would perhaps have kept away.

I do not think Sisupala was killed in a sudden fit of anger by Krishna, or because they wrangled in open Assembly. I think it was all pre-arranged and Krishna was chosen and given the Arghya Pooja (or Agratambulam, as we should now say) to be the slaughterer on the occasion. And in all probability, Sisupala was selected as the victim, because he was a very minor king, whose death would not, they thought, create a big commotion. And it did not create much. His army was too small. The private family quarrels existing between Sisupala and Krishna, may have acted as a motive for the latter to accept the function. Perhaps, also, Yudhisthira, with his usual desire to have the benefit of both the worlds, felt that his own guilt would be lessened by the act being attributed to Krishna's personal hatred of Sisupala. Anyhow, the samskara of Sisupala's body was performed by the Pandavas, the Yajamanas of the Yagna! (though Sisupala had a son, whom they placed on the throne of Chedi thus rendered vacant. I wonder if this Samskara meant cutting him up and flinging the flesh into the sacred fire.)

(3) But apparently, Rajasuya was not a popular sacrifice, but a hatefule xpression of power. According to Uuttara Ramayana (I do not think Valmiki is the author of this) Rama proposes to

celebrate a Rajasuya. Bharata opposes and asks his elder brother, what evil genius it was that suggested the idea to him, since one of the consequences of a Rajasuya was a general war, in which all kings would perish. Why should Rajasuya lead to general war unless a revolting act, humiliating to the whole order of kings, had been perpetrated by main force and violently?

In the Mahabharata it is frequently mentioned that the Rajasuya of Yudhistira was one of the root causes of the Great War.

In the last pages of Harivamsa, Janamejaya asks Vyasa why, knowing the direful consequences to Kshatriyas of Rajasuya, he did not prevent the Rajasuya being performed by Yudhisthira; and the reply of Vyasa is — "It is Fate; the calamity was pre-ordained, and we could not prevent the sacrifice."

(4) This Rajasuya was in later times replaced by Asvamedha, the killing of horses-as being less cruel and provocative of a general war than the killing of kings, while the symbolic significance remained the same.

(5) You think that the sacrifice of Sunasyepa, mentioned in the first Attaka of Rig Veda, is a case of Rajasuya by Harischandra. I have not gone so deeply into the matter as your learned self, though I have read that Attaka. In fact, I am no scholar, but perhaps just a man of occasional intuitions into truths, which I hand over to the judgment of deep scholars like yourself for verification or refutal. As Sunasyepa is describe

as the son of Ajeegarta — I doubt if Ajeegarta was a Kshatriya — I wonder if the sacrifice of Sunasyepa is Rajasuya proper. But perhaps you have looked up more texts on this subject than I shall ever be able to do and could prove that Sunasyepa was a Raja or of Royal origin. I am not on this subject prepared to say more than this—that his appears to be more of a human sacrifice than specific Rajasuya; and the intention too was not to proclaim the Emperorship of Harischandra, as there was no assembly of Kings and conquered Rulers to witness the ritual.

(6) As regards the murder of Jarasandha — and murder it was and no War in the true sense of the term — that I do not think was Rajasuya proper or a Pre-Rajasuya ritual Rituals are performed with Mantra, Homa, etc. Jarasandha was a very powerful king, apparently more powerful than the Pandavas and Krishna. They could not manage their Digvijaya — conquest of the Continent — without first getting rid of Jarasandha and there could be no Emperorship without such conquest and its symbol, Rajasuya. And as they could not overcome him by open war, they took to means less honourable. Probably also there was a family or dynastic trouble in Magadha; for Sahadeva, the eldest son of Jarasandha, who succeeds on the throne of Rajagriha, becomes the ally of the Pandavas, the murderers of his father. The utmost that I am prepared to say, on my present knowledge, about the killing of Jarasandha, is that it was a preliminary of Digvijaya, which in its turn was the preliminary of Rajasuya, but not a sacrificial rite, main or introductory."

It will be seen that there are a few minor differences between the scholarly Sastry and myself. And in all these differences, I think he is entitled to full credit and authority, and my views may be dismissed as the hazards of a lay man and superficial student.

Though European scholars, for instance, like Hopkins, have written learned treaties embodying what might be called the higher criticism of the Mahabharata, the number of Indian scholars who independently have pursued similar lines of investigation and interpretation, has been small. I can recall only a few names, myself not being widely read in the subject, Dr. R. Syama sastry of Mysore, and Seeta Nath Tatva Bhushan of Calcutta. My Gokhale Hall speech is perhaps more comprehensive and covers a wider field but only in meagre suggestive fashion - more hints than expositions. I think I can say without exaggeration that Mr. Pendyala Venkata Subrahmanya Sastry heads the list of Indian scholars in this line. And there is hardly any one comparable to him in courage and competence and the spirit to advance fearlessly to whatever lengths reason may lead. Of course, higher criticism may not be popular in the sense of being acclaimed by one and all as orthodoxy and the light that leads to Heaven But it certainly is the light that leads to Truth and it is a pity that some times the way to Truth and the way to Heaven divergeso widely.

C. R. Reddy,

Andhra University,
WALTAIR,
8th March 1938.

Vice-Chancellor,
Andhra University,
WALTAIR.

ఉపోద్ఘాతము.

నేను మైసూరున జరిగిన (1935 డిశంబరు) 'ప్రాచ్యవిజ్ఞానమహాసభ'కు (Oriental Confrence) వెళ్లి తిరిగివచ్చుచు 'చిత్తూరు'ననాఁగి (ది 2-1-1936) శ్రీ డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి M. A, D. LT. గారిని జూడనేఁగినపు డీ 'రాజసూయ' విషయక ప్రశంసకలిగినది. ఆయుంశ మిపుడీ గ్రంథమునకు శ్రీ రామలింగారెడ్డిగారు వ్రాసిన తొలిపలుకు వలనను, 'కృతిసమర్పణము—స్వచరిత్రము' అని దీనిలో నేనువ్రాసిన 'ద్విపద' భాగమువలనను దెలియఁగలదు. కాని నేను వాల్తేరున శ్రీ రెడ్డిగారిని మరల జూచినపుడు వారు తిరిగి పైదానినిగూర్చి ప్రశంసించినతరువాతనే (ది 9-3-37) దీనిని వ్రాయఁబ్రయత్నించితిని.

మహాభారతమునకు 'పంచమవేద'మను సంజ్ఞకలదు. కాని యేకారణములచే నదిపంచమవేదమైనదియు నింతవఱ కెవరును వివరించినట్లులఁ గాన్పింపదు. నేను నామహాభారతచరిత్రముయొక్క ద్వితీయముద్రణమున నాకప్పటికి మహాభారతమునఁ దోఁచిన పంచమవేదాంశముల నందువ్రాసితిని. ఇంకను శోధింపఁగాఁ దోఁచిన మరికొన్నిటి నీ 'రాజసూయరహస్యము'న వివరించియున్నాను. ఎవరేని యింకను నాలుగువేదములతో మహాభారతములోని యంశములఁ బరిశీలించినయెడల నెన్నియో భారతమున వేదవిశేషములు కాన్పింపఁగలవు.

మఱియు మహాభారతములోని యితిహాసవిషయాదులఁ గూర్చి పెక్కండ్రు పెక్కుగ్రంథములను వ్రాసియున్నారు. నాకుఁ దెలిసిన కొన్నిటి 'మహాభారతచరిత్రము' అను గ్రంథరూపకముగా వ్రాసిప్రకటించిన యంశమును నాసోదరాంధ్రదేశీయులకుఁ బెక్కండ్రకుఁ దెలిసియేయున్నది.

మహాభారతాంతర్గతమగు 'మోక్ష' శాస్త్రాంశములను 'భగవద్గీతాభాష్య'రూపకముగా మతత్రయ ప్రవర్తకులును జగద్విదితగ్రంథములను రచించియున్నారు. అందపరశంకరులగు శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు భగవద్గీతలకేగాక 'సనత్సుజాతీయము'నకుఁగూడ భాష్యమును రచించియున్నారు.

ఇంకను మహాభారతమునందలి 'ధర్మశాస్త్ర, అర్థశాస్త్ర, పురాణ, కావ్యా'ద్యంశములఁగూర్చి విశేష పరిశోధనములు చేయవలసియున్నది.

ఇపుడు నాచేవ్రాయబడిన 'రాజసూయరహస్యమున' మహాభారతేతిహాసమున నెట్లు వైదిక కర్మాంశములిమిడియున్నవో వానిని దిఙ్మాత్రమే చూపితినని చదువరులు తలంతురుగాక. అశ్వమేధాది మహాయజ్ఞాంశములఁగూడ శోధించివ్రాయు నావశ్యకత కలదు.

ఆంధ్రదేశమున విశేషప్రచారమునందుండిన 'తైత్తిరీయసంహిత'లో బ్రస్తుతమగు 'రాజసూయయాగప్రశంస' మూఁడు చోటులనుమాత్రమె (అగ్నిచయన సంబంధమున) పేర్కొనఁబడినది. ఆస్థలములలో నొక్కెడ శ్రీసాయణాచార్యులవారు తమ

భాష్యమున, రాజసూయయాగాంశములు శాఖాంతరమునఁ గలవనిరి. అయిన నింకెచ్చటనైనఁ దైత్తిరీయశాఖలోఁ గల వేమోయని, పిఠాపుర సంస్థానపండితులై 'ఆమ్నాయార్థవాచస్పతి' బిరుదునొందిన బ్ర. శ్రీ. వడలి లక్ష్మీనారాయణశాస్త్రి గారి నడిగి, వారి వ్రాయిదాల ననుసరించి మూఁడుసారులు దర్శింప నేనంతకుఁబూర్వమే చూచుకొనియున్న యంశములు తప్ప వేఱుస్థలములలో లేవనియుఁ దమకంతకంటెఁ దెలియవనియుఁ జెప్పియున్నారు.

మాపట్టణమునని పండితులును బహుపురాణ ద్రష్టలు నగు బ్ర. శ్రీ. వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని భారతవ్యతిరిక్త పురాణములలో నెచటనైన రాజసూయయాగముఁగూర్చి చదివియున్నారా యనియడుగఁ దమకెచటను గాన్పింపలేదనిరి. పిమ్మట నాకుఁ బరిశోధనావిషయమున మార్గదర్శకులై గురువులైన, మ. రా. దగ్గిరాల వేంకటసూర్యప్రకాశరావు, బి. యే. గారితో (కాకినాడ) నీవిషయముఁ బ్రస్తావింప వారు 'రాజేంద్రలాల్ మిత్రా' పండితుఁడు ప్రచురించిన 'ఓరియంటల్ సీరీస్' నందు రాజసూయయాగముఁగూర్చి వ్రాసెననియు, ఆయంశములను, కీ. శే. గోటేటి కనకరాజుగారును దామును నాంధ్రీకరించి కొన్నివ్యాసములుగా (1905 సంః ప్రాంతమున) 'సత్యవాదిని' పత్రికయందు (కందుకూరి వీరేశలింగముపంతులుగారిది) ప్రకటించితిమనియుఁ జెప్పి పై పత్రికయొక్క సంచికలకును 'మిత్రా'గారి సంపుటములకును బ్రయత్నించిరిగాని యవి లభిం

పలేదు. కాని ప్రకాశరావుగారె 'అధర్వసంహితలో' రాజసూయ యాగకర్తఁగూర్చి చెప్పినయంశములను (గ్రిఫిత్తుగారి యాంగ్లీకరణము నాంధ్రీకరించి) పిమ్మట పంపియున్నారు. 'ఛాందోగ్యోపనిషత్తు'లో నొక్కడ రాజసూయయాగకర్తఁగూర్చిన యంశమున్నదని చెప్పిరి. నాకును జదివినజ్ఞాపకమున్నదిగాని, అందంత విశేషములు కాన్పింపనందునను, తిరిగి చదువుటకు వీలుకలుగనందునను దానికై ప్రయత్నింపలేదు. శ్రీప్రకాశరావుగారు నాకొనర్చిన పై సహాయమునకు వారికిఁ గృతజ్ఞుఁడనగుచున్నాను.

పిమ్మట భాషాంతరీకరణమగు 'మెగ్డొనల్' పండితుని వైదికవాఙ్మయచరిత్రముఁ జదువగా' శుక్లయజుస్సంహితలోను, ఐతరేయబ్రాహ్మణము'నను, రాజసూయయాగాంశములుకలవని యాతఁడు వ్రాయుటచేఁ బై రెండుగ్రంథములను సభాష్యకముగాఁజదివి యీగ్రంథమును వ్రాయఁగలిగితిని. ఐతరేయ బ్రాహ్మణమున సూచింపఁబడిన 'శునశ్శేపు'ని గాథలతో సంబంధించిన తొంబదియేడు ఋక్కులను బెక్కేండ్లకుఁ బూర్వమె 'బందరు' పట్టణమున నుండినపుడు 'సాయణభాష్యముఁ' జూచి చదివియు 'గ్రిఫిత్తు'గారి యాంగ్లీకరణముతో సరి చూపించుకొనియు 'మన్నవ బుచ్చయ్య'పంతులుగారి యాంధ్రీకరణముఁ జదివియుండుటచే నీగ్రంథమునకుఁ గావలసినంతవఱకె యాగాథాంశములఁ జేర్చియున్నాను.

మహాభారతాంశము లన్న, నవి నాకు బహుకాలమునుండి తెలిసినవియే. కాని, యీరాజసూయ యాగముఁ గూర్చిన

యంశములు 'ఐతరేయబ్రాహ్మణ, వాజసనేయ సంహితల'లో రాజసూయమునకుఁ బూర్వకాలికములై యాగాంగములుగా, దలఁపఁబడు 'ఇష్టాపూర్త'కర్మములకును, యాగమధ్యమున నగు 'క్షత్రియపశువిశసనము'నకును, యాగాంతముననగు 'సురాపాన, సుహృద్ద్యూతా'దులకును, సరిపడినటుల భారతేతిహాసమున గాథలు కూర్పబడుటమాత్రము క్రొత్తగాఁ గాన్పించినది. సభాపర్వమునఁగల పాండవదిగ్విజయ విషయము లెట్లు మూలభారత వ్యతిరేకముగాఁ జేర్పఁబడెనో, పాండవదిగ్విజయమునం దెంతవఱకు సత్యముకలదో, నానిని, వివరింపఁ బ్రయత్నించితిని. చదువరులకు నాఁటి భరతఖండస్థ రాజ్యపరిస్థితులఁ దెలుపు పటమును గూడ నాసందర్భమున జేర్చియున్నాను. ఇంకనుగల విశేషములను నాపుస్తకముఁజదివినఁ గాన్పింపఁగలవు.

నేనీపుస్తకమును వ్రాయునపుడె హైస్కూలు పండితపదవినివదలినపిమ్మట నానిర్ధనత్వమునుగ్రహించి,నాకు దైనందిన వ్యయమునకు లోటులేకుండఁగ నర్థసాహాయ్యమొనరించుచున్న నాపరమమిత్రునకు సాంసారికసంబంధమగు చిక్కులచే విశేష మానసికవ్యథయు ధనవ్యయము కలుగుట, నాప్రియతయిల్లు పడిపోవఁదటస్థింప నప్పుచేసి యోపికలేకుండినను దానిని దిరిగి నిర్మించుకొనుట, చిన్నతనముననె మాతృవియోగమొందిన నా కుమార్తెల నిరువురను మాతృనిర్విశేషమై తనకడకుఁగొనిపోయి యాదరించుచుండెడి నాతమ్మునిభార్య యకాలమృతినొందుట, మొదలగు మానసికవ్యథలకు, ఆర్థికపు చిక్కులకు లోనైతిని. ఇట్లుండినను, అపుడపుడు శ్రీ రామలింగారెడ్డిగారు రాజసూయ

ముఁగూర్చి వ్రాయుచుండు నుత్తరములు నా 'కార్పణ్యదోషో పహతస్వభావము'ను దొలఁగించుచుండుటచే (ది 20-3-37సం॥) ప్రారంభించిన యీగ్రంథము నెట్టులో (ది 15–10–37 సం॥) ముగించి వ్రాఁతప్రతినే శ్రీ రామలింగారెడ్డిగారి కంపితిని. వారును బహుళకార్య నిమగ్నులయ్యు వ్రాఁతప్రతినే చదివి (ది 15—11—37 సం॥) నాజన్మదినము (ఇంగ్లీషుతేదీ ననుసరించి) నాఁటికంపిరి. ఆనాటికె యీగ్రంథము పూర్తియైనట్లు తలఁచి 'జన్మ స్థితి లయ' కారకుఁడగు పరమేశ్వరునకె యీగ్రంథము నంకితమిచ్చితిని.

వ్రాఁతప్రతినిజదివి దానిపై శ్రీరామలింగారెడ్డిగారిచ్చిన యభిప్రాయమునిందుఁ జూపుచున్నాను.

Andhra University,
WALTAIR,
14th November, 1937.

Dear friend,

Many thanks for your Manuscript.

Though I am most heavily busy just now and will be till the middle of January, I managed to go through it and found it a masterpiece in its way. You have collected a lot of interesting material which throws quite a new light on Aryan civilisation and you will be enhancing your reputation as an independent and fearless critic and researcher.

With best regards.

Yours sincerely,
(Sd.) C. R. REDDY.

గ్రంథమును వ్రాసితినిగాని ముద్రింపించుటయెట్లు? దైనందినకృత్యములె కడచుట కష్టముగానున్నదని తలంపుచుండ నొకమిత్రుఁడు ముద్రణమునకగు కాగితమునకుఁదగిన ద్రవ్యము నిచ్చుటయు, మాపట్టణమందలి వి యం. ఆర్. ముద్రాక్షర శాలాధిపతులు ముద్రణవ్యయము నాఱుమాసములకుఁ బిమ్మటఁ దమకిచ్చుట కంగీకరించుటయుఁ, గలిగినందున దీనిని ముద్రింపించితిని. అందులకుఁ బై మిత్రులకుఁ గృతజ్ఞుఁడను.

సర్వవిధముల దీనికిఁ దొలిపలుకు వ్రాయఁదగినవారు శ్రీ రామలింగారెడ్డిగారేయనితలంచి, వారిని గోరఁగా బహుళకార్య నిమగ్నులయ్యు వారు నాకోరికను నిరాకరింపక శ్రమకోర్చి దీనికిఁ దొలిపలుకును వ్రాసి పంపియున్నారు. అందులకు వారికి సదా కృతజ్ఞుఁడను. కాని వారు వ్రాసినతొలిపలుకులో నేనెపుడు ననుకొననట్టి విశేషములను నాయందారోపించుట నాకాశ్చర్యమును గలిగించుచున్నది. మహాపండితుఁడై ప్రఖ్యాతినొందిన డాక్టర్ శ్యామశాస్త్రిగారెక్కడ? నేనెక్కడ? వారితో నేవిధమున నే నీడగుదును? కాని పాండిత్యమునందును, బ్రఖ్యాతియందును, ఉద్యోగాతిశయమునందును గాక, 'వృద్ధుఁడై, భార్యావియుక్తుఁడై, నిర్ధనుఁడై, అంధుఁడై' బాధలనొందిన ఆంగ్లేయులలో మొకటి సంస్కృతపండితుఁడగు 'హెన్రి,థామస్,కోల్బ్రూకు' గారియొక్క ఉపమానము నాకారోపించిన నిప్పటి నాస్థితికిఁ గొంతయుక్తముగా నుండునేమొ? శ్రీరామలింగారెడ్డిగారికి నా

యందుగల యవ్యాజప్రేమయే శ్యామశాస్త్రిగారితో నన్ను బోల్చుటకు హేతువైనదని తలంతును.

ఇంకనొక్కటిమాత్రము నాయందు వారుచూపినదానిలో యథార్థముకలదు. అది నామనస్సునకు నిజమని తోఁచినదానిని దాఁచక వ్రాసితిననుట. ఈకారణముచే నాకుచాలబాధలుకలిగినవి. కలుగుచున్నవి. కలుగఁగలవు. సత్యమే సనాతనధర్మములలోఁ బ్రధానమైనది. దానినే నేను నమ్మితిని. "సత్యాన్నాస్తి పరోధర్మః" యనునది సనాతనధర్మములలో బ్రధానము కాదా? అసత్తునుండి సత్తునొందింపుము. "అసతోమాసద్గమయ" అని వేదశిఖ చెప్పినది. వేయునేల పరమేశ్వరస్వరూపము 'సత్యంజ్ఞాన మనంతంబ్రహ్మ' యనియే యుపనిషత్తు చెప్పలేదా? కాన నట్టి యుత్కృష్టసత్యమును జెప్పుటకేల జంకవలయునని యెయట్లువ్రాయుచుందును.

(I) తే. సత్యమెఱిఁగినవారలు - చాలఁగొలఁది।
మహితుఁడ! యితరులందఱు - మచ్చరించి।
తెగడుదురు నవ్వుదురునిన్ను - ద్వేషమునను।
సరకుఁగొనకట్టి చిలిపిచే - ష్టలనొకింత॥

అని శ్రీవివేకానందస్వాములవారు చెప్పిన 'యతిగీతము'నఁ గలదు. ఆవాక్యము ప్రమాణభూతముకాదా?

(I) పై యతిగీతములను మ. రా. శ్రీ కూచి నరసింహముపంతులుగా రాంధ్రీకరించియున్నారు.

నాకును శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారికిని జరిగిన యభియోగములలో మేజస్ట్రీటుగారు నేనుదాఁచక నిష్పక్షపాతముగా సత్యమునే నాసాక్ష్యములోఁ జెప్పితినని తీర్పు వ్రాయుటచేతను, ఇపుడు, విద్యాధికులును, విద్యాధిరాజులు నగు శ్రీరామలింగారెడ్డిగారు నిర్భీతిగఁ దోఁచిన సత్యమునే వ్రాయువాఁడనని యీపుస్తకపుఁ బీఠికలో వ్రాయుటచేతను నేను ధన్యుఁడనని తలంచుచున్నాను. ఇంకను గొన్నియెడల నాబుద్ధిపొరఁబడి సత్యమును దాఁచి వ్రాసినయెడలఁ బరమేశ్వరుఁడు క్షమించుఁగాక.

చదువరులకొక్కమనవి.

ఈరాజసూయరహస్యమున "హరిశ్చంద్రుఁడు పాకులఁ గల్పించి యబద్ధమాడెననియు, వసిష్ఠవిశ్వామిత్రులు కలహింపక హరిశ్చంద్రుచే యజ్ఞముఁ జేయించిరనియు, ఖాండవవనదహనము, కృష్ణదేవరాయల కళింగదండయాత్ర, నేఁటియబిసీనియా, చైనా యుద్ధములకుఁ దక్కువకాదనియు, మొదలగు నా వ్రాఁతలకుఁ జదువరులు తాత్కాలికావేశమునొంది, నన్నునిందింపక గ్రంథ విమర్శనములతో వ్రాసితినిగాన పరిశీలింపవేఁడెదను.

ఈపుస్తకము నెవ్వరైన విమర్శించునపుడు నాభారతచరిత్రను విమర్శింపుచు వ్యక్తిదూషణములతో నారంభించి నన్ను చిక్కులఁబెట్టి తాముచిక్కులొందిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి వలెఁగాక విషయవిమర్శనమునే చేసి తప్పులను జూపినయెడల న్యాయముగుతప్పుల నుదిద్దికొనఁగలనని విన్నవించుకొనుచున్నాను.

ఇట్లు గ్రంథకర్త,

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి.

ఓమ్.

కృతిసమర్పణము—స్వచరిత్రము.

(ద్వి ప ద)

ఓంకారవాచ్యుఁడై - యొప్పి నిర్వచిత
సంకల్పములచేతఁ - జరియించువాని.
బ్రహ్మాండమండలిఁ - బ్రభవింపఁజేసి
బ్రహ్మాండతతిఁ బొట్టఁ - భరియించువాని,
జీవులసృష్టించి - జీవులలోన
జీవస్వరూపుఁడై - చెలఁగెడువాని.
జీవులన్నియుఁగూడ - శేషులై యగుచు
దేవత్వములఁబొంది - ధీశాలురగుచు.
వివిధశాస్త్రంబుల - విద్వాంసులగుచుఁ
గవులౌచు వర్ణింపఁ - గలకాలమునను
నెవనిమహత్తులో - నేకాంశమైన
వివరింపలేరో యా - విశ్వస్వరూపు.
ఎవనిబ్రహ్మత్వంబు - సృష్టినేర్పఱచు
నెవని విష్ణుత్వంబు - సృష్టిఁబోషించు
నెవని రుద్రత్వంబు - సృష్టిహరియించు
నెవనిగుణంబుల - సృష్టలౌసురులు.
ఆవేదవేద్యుని - నా విరాట్పురుషుఁ
గావవేయనుచును - గడుభక్తి మ్రొక్కి.
నాజన్మము తరింప - నాజన్మతిథిని
రాజసూయారహస్య - రమ్యచరిత్ర, (10)

నాగోత్రనామాల - నాస్థితిఁ జెప్పి
యాగస్వరూపున - కర్పింతుఁ గృతిగ.
కౌండిన్యగోత్రుండ - గౌతమీతీర
పండిత పెండ్యాల - వంశసంభవుఁడఁ
పులి పా
జెలుదు నాపస్తంబ - సూత్రమందిమల
తెలగాణ్యశాఖను - నీరుపై దికిని.
వేంకటబుధునకు - వినుతరామాంబ
కంకురించినవాఁడ - నాద్యుండనగుచు
నిలగలబుధులకు - నెరఁగెడుబుద్ధి
నలరు వేంకటసుబ్ర - హ్మణ్య నాముఁడను.
గురువులఁ బెక్కండ్రఁ - గొలిచి సంస్కృతముఁ
బరగునాంధ్రంబును - బఠియించినాఁడఁ
బండితోపాధ్యాయ - పదవి వహించి
పండితుండను పేరు - పడసినవాఁడ.
వ్యవసాయచరితంబు - భారతచరిత
మవల పరిక్షిత్తు - నట మాంసభుక్తి,
రమణ వేంకటసుబ్బ - రాయ చరిత్రఁ
బ్రముఖులు మెచ్చంగ - రచియించినాఁడ.
ఆంధ్రభాషకుఁ దగు - నాధారుఁ డగుచు
నాంధ్రభోజఖ్యాతి - నలరుచు మిగులఁ (20)
బాఠకలోకంపుఁ - బారిజాతమనఁ
బిఠికాపురినేలి - విఖ్యాతిఁగనెడు

రావు శ్రీసూర్యరా - ట్ప్రభుపాలనమునఁ
ప్రావీణ్యులుండెడు - పాఠశాలలను
బండితుండనునాఁటఁ - బరగు కబ్బములు
నిండుశక్తి నిజేయు - నేరుపుగలిగె
తనశక్తి కంటెను - స్థానంపుశక్తి
మనుజునకెక్కుడై - మరితోడుపడదె.
ఇట్టి నేనొకసారి యేఁగి చిత్తూరిఁ
గట్టమంచి కులాబ్ధిఁ - గలువలరేనిఁ
బట్టభద్రులతలఁ - బండితప్రియుని
దిట్టయై వాదించు - తీర్పుగలాని
శాసనకరసభ - సభ్యుఁడౌవాని
'వైసుఛాన్సిలు'రను - పదవిగలాని
నలరు డాక్టరుబిరు - దందినవానిఁ
గల దేశభక్తిఁబ్రి - కాశించువాని
సారస్వతపుసేవ - సల్పెడువాని
భారత శోధనా - ప్రౌఢిగలాని
రామలింగారెడ్డి - రసికవరేణ్యు
ధీమాన్యుఁజూడంగఁ - దీరుగా నతఁడు. (30)
గౌరవించుచు నను - గరమొప్పనిట్లు
భారతప్రస్తావ - నశమునఁ బలికె.
శిశుపాలవధమెట్లు - చేయంగఁబడియెఁ?
బశువుగాఁ బంధింపఁ - బడెనేమొ? యతఁడు.

రాజసూయంబున - రాజుబంధింప
నా జన్మ మగువిధి - యగునేమొ! యనియె.
అన నేను నా నన - నలరి యాతండుఁ
బనిచెను గ్రంథమ్ము - వ్రాయ నద్దానిఁ
బనుచుటయేకాదు - పలుమరుమిగులఁ
జనువునఁజోదనల్ - చక్కఁగాఁ జేసె
షష్టితమశరత్తు - చనుదెంచునాఁడె
తుష్టిగాగ్రంథపు - తుదిశ్లోఁచెఁనాకు.
ఆనాఁడుపరమేశు - నంతరంగమున
ధ్యానంబుఁజేయుచుఁ - దగజెప్పితిట్లు
బహుధాన్యవత్సర - బాహుళమాన
బహుళషష్టినినేను - పరిభవించినాఁడ.
అరిగె నేఁబదిశ్లోమ్ము - దవ యేఁడునాకు
నరుదెంచెనేఁడు నా - కఱువదొయేఁడు.
సోదరులిర్వురు - సుతలునిర్వురును
నాదరింపుచునుందు - రల్లురిర్వురును (40)
మనుమలునలువురు - మనుమరాలొకతె
మనమునకానంద - మయ్యెడి మఱియు
దౌహిత్రుఁడొక్కఁడు - దశవార్షినాకు
సాహాయ్యమొనరించుఁ - జదువుచు నైన
దండియౌమెయిశక్తి - తగ్గినదగుట
దండంబులేకుండఁ - దరలంగలేను.

ఆర్యులౌ తలిదండ్రు - లరిగిరి దివికి
భార్యాద్వయంబును - బరగతిఁగనియె.
సంధిల్లె వృద్ధత - సంధిల్లె లేమి
సంధిల్లె నంధత - సంధిల్లె నష్టి.
సంధిల్లె నేకత - సంధిల్లెఁ జింత
సంధిల్లె దీనత - సంధిల్లె భీతి.
సంధిల్లకున్నది - సత్కర్మఫలము
సంధిల్లకున్నది - సంతుష్టిసుంత
సిద్ధింపకున్నది - చిత్తసంశుద్ధి
సిద్ధింపకున్నది - శ్రీశ ! నీసేవ.
ఉద్యోగకాలాన - నొడఁగూడుధనము
తద్యోగవిరతిని - దగెఁ గొంతదనుక.
పిదప మిత్రుఁడొకఁడు - ప్రీతిఁబోషింప
సదయుఁడౌ వానికి - సమకూరెఁ జిక్కు (50)
ఇల్లుతాకట్టుంచి - యిపుడు కాలమును
మెల్లగాఁ గడపుదు - మెరమెరతోడ.
మడిమాన్యములు లేవు - మనువెట్లుగడచు?
కడదశలోనని - కళవలపడుదు.
యాచనకై పోయి - యాచించువృత్తి
ప్రాచీనపండిత - పద్ధతిఁ గలదు.
ఐన నాకంధత - యధికమౌచుండఁ
బోనెట్లు సమకూరు ? - పొరుగూరి కకట !

ముందెట్లు జరుగును ? - ముప్పున నెట్లు?
సందేహభయములు - సమకూరె దేవ!
అందుచే నీసేవ - నలరుచుం జేయ
సందు లేకున్నది - సర్వేశ ! నాకు.
అటుకులనే యీయ - నర్థి కర్థంబుఁ
దటుకున నిచ్చిన - దాత వీవనుచు
నర్థవాదంబొందు - హవణెల్ల భువిని
సార్థకంబుగఁజేయ - సమకట్టి దాని
శ్రుతిధర్మమెంతయుఁ - జెప్పెడు నట్టి
మతిమంతులందఱు - మన్నించునట్టి
సత్యవాదంబును - సలిపెడునట్టి
నిత్యధర్మంబును - నెఱిఁ జెప్పునట్టి (60)
ప్రాకృతభాషల - భయపడనట్టి
యాకృతిఁగొని నాకు - నీశ్వరా ! నీవు.
కానక కని చేయు - కలుషములార్పి
జ్ఞానులొందెడునట్టి - సద్గతినిమ్ము.
నిత్యుండవగునీవు - నెఱిఁగొనుకతన
నిత్యంబుగా దీని - నిలుపుము జగతి.
ఒండేని నీవునా - కొందుజన్మంబు
దండనంబుగనీయఁ - దలఁచెదవేని
న్యూనతలేకుండ - నొనరజీవించు
మానవజన్మమే - మరినాకునిమ్ము.

మఱియును ధార్మికు - ల్మాన్యులుగలిగి
సిరియును సంపద - చెన్నారఁ గలిగి
సూరులు ధీరులు - శూరులు గలిగి
వీరలు సతులునా - వెలదులు గలిగి
కారియపడనట్టి - కర్మిష్ఠుల్గలిగి
సారస్వతపువృద్ధి - జనవృద్ధి కలిగి
కరువు దరిద్రంబు - కలనైనలేక
పరపీడనంబును - వ్యాధులు లేక.
పరగు స్వతంత్రపు - భరతఖండమున
నరుదు సంపదగల - యాంధ్రదేశమున (70)
వరగౌతమీతీర - పావనభూమి
పరమ ధర్మంబునఁ - బరగు వంశమున
పురుషుండగాఁ బుట్టి - పుణ్యము ల్సేసి
పరులకుపకృతితో - భక్తితో మసలి
కరమొప్ప నినుఁజేరఁ - గాంక్షించినాఁడ
వరమిమ్ము నాకిట్లు - వరద ! విశ్వేశ !
సత్తునొందింపుము - సత్తున నుండి
మ త్తమంబును బాచి - మలుపు తేజముకు
మృత్యువునుండి య - మృతము నొందింపు
నిత్యపదంబున - నెగడగ దేవ !
శాంతియూ శాశ్వత - శాంతియూ గాక
ఓంతత్సదోంతత్స - దోం సోహ మస్మి.

ఓమ్!

రాజసూయరహస్యము.

ప్రథమ భాగము.

మహాభారతము భారతీయవాఙ్మయమునం దగ్రగణ్యమైనది. కారణమేమనఁగా, అది భారతీయుల ధర్మశాస్త్ర గ్రంథములలో ధర్మశాస్త్రగ్రంథమై తచ్ఛాస్త్రజ్ఞులకుఁ బ్రమాణభూతమైనది. ఐతిహాసికుల కితిహాసమై తదంతర్గతముగాఁ బరిగణింపఁబడు [1]అర్థశాస్త్రాంశములు కలిగి యుత్కృష్టేతిహాసమై భరతవంశస్థుల గాథలతోఁ బ్రకాశించినది. పౌరాణికులకుఁ బురాణమై తదంశములతోఁ గూడి శోభించినది. కావ్యరసజ్ఞులకు వీరరస ప్రధానమై యొప్పుచు, భారతీయవీరులలో నగ్రగణ్యులగు భీమార్జునాది మహావీరుల గాథలతోఁ గూడినది. వేదాంతవేత్తలకుఁ గర్మజ్ఞానాదులను బోధించునట్టులు కల దగుటచేఁ బ్రఖ్యాత మోక్షశాస్త్రమైనది. అన్నిటికిని మించి, భారతీయుల కేకైక ప్రమాణమగు వేదాంశములు నిందుగ నుండుటచే నైదవ వేదమైనది. ఆవేదత్వము నందును నితరవేదములవలెఁగాక, స్త్రీ, శూద్ర ద్విజబంధువులు వేదములు వినరాదు,

(1) అర్థశాస్త్రము ఇతిహాసాంతర్గత మని 'కౌటిల్యుఁడు' (చాణక్యుఁడు) తన యర్థశాస్త్రమునఁ జెప్పియున్నాఁడు.

తత్ప్రతిపాదిత కర్మముల నాచరింపరాదు, అను నిషేధముఁ దొలగించి, యితరవేదోదిత యజ్ఞములతోపాటు స్త్రీ శూద్రాదులాచరింపఁ దగిన పౌరాణిక యజ్ఞాదులు పెక్కులు కలదగుటచే నిది యందఱికిని బరమ ప్రమాణముగు పంచమవేదమై పరిఢవిల్లినది.

ఇంకను నిందొక్క వైచిత్ర్యము కలదు. ఇతర ధర్మశాస్త్రములకుంబలె, ఇతిహాసములకు వలె, పురాణములకుఁ బోలె, వేదాంత గ్రంథములరీతి, కావ్యములపోల్కి, వేదముల మాడ్కి నొక్కరీతినే ధర్మములఁగాని, ఇతిహాసములనుగాని, పురాణాంశములంగాని, వేదాంతాంశములంగాని, కావ్యఫక్కికఁగాని, వేదోదిత విధానములఁ గాని, చెప్పక తొలుదొల్త నేనిమిత్తముగ నారంభింపఁబడెనో అట్టి 'జయ' మను ప్రధానేతిహాసము నాధారపఱచుకొని, సందర్భానుసారముగ నాయితిహాసమున కెడనెడఁ బై ధర్మశాస్త్రాద్యంశముల నిమిడ్చి యింపుగుల్క రచింపఁబడుటచే, పాఠకులకును శ్రోతలకును, విసుగును గల్గింపక యత్యానందముఁగూర్చుచు, షడ్రసోపేతమై వివిధ భక్ష్య భోజ్యములఁ గూడిన విందుభోజనమువలె, వివిధపరిమళయుక్తమగు పుష్పదామమువలె, తౌర్యత్రికయుక్తమగు సంగీతకమువలె, సర్వవర్ణచిత్రితమై భావోపేతమగు చిత్రపటమువలె, నాతిశీతోష్ణమగు మలయమారుతమువలె సర్వహృదయాహ్లాదియై మహాభారతము విలసిల్లినది.

పై యంశములలో నిపుడు వ్రాయఁబోవు 'రాజసూయము' అను నంశము పంచమవేదము నం దంతర్గతమై విధ్యర్థవాదాదులఁ గూడిన యితిహాసముగా, లేక, అర్థవాదముగాఁ బరిగణింపఁబడును గాన, శ్రీలలిత మహాభారతమునఁ గల వేదాంశములను క్లుప్తముగాఁ జెప్పి కపిమ్మట రాజసూయాంశములు వివరింతును.

మహాభారతము నందలి వేదాంశములు

వేదము విధ్యర్థవాద మంత్రాత్మకము. విధు లన, ఐహికాముష్మిక సుఖములఁ బొందుటకై చేయఁబడు యజ్ఞాదిక్రతువిధానములు. యజ్ఞములు 'దేవ, మనుష్య, పితృ, దేవతాకములు'గా నుండును. గోమేధ అశ్వమేధ రాజసూయాదులు దైవిక యాగములు. తటాక ప్రతిష్ఠాదులు, వివిధ దాన విశేషములు, మానుషములగు యజ్ఞములు. శ్రాద్ధప్రకరణమునఁ జెప్పఁబడినవి పైతృకములగు యజ్ఞములు. అవి విధ్యర్థవాదాదులతో నీ పంచమ వేదమున నింపగు గాథలలో నిముడ్చి వర్ణింపఁబడినవి.

మఱియుఁ బౌరాణికములగు సర్పయాగ, వైష్ణవయాగాదులును, కొదవలేకుండఁగ నిందు వివరింపఁ బడినవి. యజుర్ధర్మములకుఁ బోలె నిది గద్యపద్యాత్మకమై సంహితాబ్రాహ్మణములతోఁ గూడినది. సంక్షిప్తముగ సంహితలోఁ జెప్పఁబడిన

దానిని విపులముగ బ్రాహ్మణించి యజురథర్వములలోఁ బ్రతి పాదింపఁబడినట్లు యిందును ప్రతిపాదింపఁబడుటచే వేదత్వమును రూఢి నొందించినది.

మఱియు నితర వేదముల కుండినట్లు వేదాంతాంశములఁ జెప్పు నుపనిషద్వాఙ్మయముగూడ నిందుఁ గలదు. ప్రసిద్ధికెక్కిన 'భగవద్గీత'లుపనిషత్తులే; వానిని మతత్రయభాష్యకర్తలు నుపనిషత్తులను గానె భావించిరి.[1]

'సనత్సుజాతీయ, అనుగీతాదులును' పంచమవేదమున కుపనిషత్తులే. ఇతర వేదములకుండినట్లు మంత్రద్రష్టలు, కాండద్రష్టలు, పృథక్సంహితలుగూడ నీపంచమవేదమునకును గలవు. యజురథర్వవేదములకువలె నేయేకాండల కేయేమంత్రముల కెవరెవరు ఋషులో ప్రత్యేకముగాఁ దెలియఁబడుటలేదుగాని, మహాభారతమునందలి యాయాఘట్టములలోని ప్రశంసలఁజూడ, 'వ్యాస, వైశంపాయన, నారద, మార్కండేయ, రోమశ, ఉపమన్యు, ఉదంక, సనత్సుజాత, శ్రీకృష్ణ, భీష్మ, విదురాదులు' కర్మజ్ఞానాదుల నుపదేశించు కాండములకును, కొన్నిమంత్రములకును నధిపతులని యితరవేదసాంప్రదాయానుసారముగాఁ జెప్పవలసి యున్నది.

---

(1) 'ఇతి శ్రీభగవద్గీతాసూపనిషత్సు' అని గీతలయొక్క ప్రతి యధ్యాయాంతమునందును వ్రాయఁబడుచుండును.

ఋగాదిసంహితలకుఁబలె నీ'కార్ష్ణి' వేదమనఁబడు 'వైయాసికీ' సంహితకును [1]'సుమంతు, జైమిని, పైల, శుక, వైశంపాయన' నామకములగు పృథక్సంహితలు కలవు. ఆపృథక్సంహితలు, కారణాంతరమున నితరవేదసంహితలోని కొన్నిటివలె ఖిలమైయుండును. మహాభారతసంహితయొక్క పృథగ్భాగమగు 'జైమిని' సంహితలోనిదే దృశ్యమాన జైమినిభారతభాగమగు నశ్వమేధపర్వము.

ఇతరవేదములకు ఖిలసంహితలుండినట్లే యీపంచమవేదమునకును ఖిలసంహిత కలదు. దృశ్యమానమగు హరివంశమును, దానికడపటనుండిన జనమేజయుని యశ్వమేధయాగగాథతోఁగూడిన భవిష్యద్గాథయు ఖిలసంహిత యనియే మహాభారతమున (ఆదిపర్వ 2 అధ్యా) కలదు. ఉపదేశరూపకముగ నాయాగాథలసందర్భమునఁ జెప్పఁబడిన 'అనుష్టుప్' ఛందోరూపమునఁ గలవిశేషార్థబోధకములగు మంత్రములు, సూక్తఘటితములుగ నిందుఁగలవు. అట్టివాని దిఙ్మాత్రముగఁ జూపుచున్నాను.

ఉదంకుఁడొనర్చిన 'నాగస్తుతి,' ఉపమన్యుఁడు చేసిన

---

(1) శ్లో॥ వేదానధ్యాపయామాస మహాభారతపంచమాన్ । సుమంతుం, జైమినిం, పైలం, శుకంచైవ స్వమాత్మజం । ప్రభుర్వరిష్ఠోవరదో వైశంపాయనమేవచ । సంహితాస్తైః పృథక్త్వేన భారతస్య ప్రకాశితాః॥ ఆదిపర్వ 93 అధ్యా.

'అశ్వినీస్తుతి' మందపాలపుత్రసహదేవు లొనర్చిన 'అగ్నిస్తుతి' కుంతీధర్మజు లొనర్చిన 'సూర్యస్తుతి,' అర్జున మరుత్తు లొనర్చిన 'రుద్రస్తుతి,' భీష్ముఁ డొనర్చిన 'శ్రీకృష్ణస్తుతి,' మొదలగునవి మంత్రవంశములును, ప్రపేర్కొనఁబడినవారిచే దృష్టము లైన సూక్తములేయై యున్నవి.

ఇంతమాత్రమె కాక యజురాదివేదము లాయాసందర్భములలో ఋగాదివేదములనుండి కొన్నిమంత్రములను స్వల్పభేదముతో గ్రహించి యున్నవి. మఱికొన్నిటియర్థమును ఛందోభేదముతో గ్రహించి యున్నవి. అట్టి సాంప్రదాయ మీభారతసంహితకును గలదు. చూడుఁడు—

మంత్రములను స్వల్పభేదముతో గ్రహించుటకు—

(1) మం॥ కస్విదే కాకీచరతి ? కస్విజ్జాయతే పునః ?
కిగ్ స్విద్ధిమస్య భేషజం? కింస్విదావపనం మహత్॥

(2) సూర్యఏకాకీచరతి చంద్రమాజాయతే పునః।
అగ్నిర్హిమస్యభేషజం భూమిరావపనంమహత్॥

కృష్ణయజుర్వేద. 7-4.

మహాభారతమునఁ బైమంత్రము లిట్లు గ్రహింపఁబడెను.

* శ్లో॥ కశ్చిదేకోవిచరతే ? జాతఃకోజాయతే పునః ?
కింస్విద్ధిమస్య భైషజ్యం? కింస్విదావపనంమహత్॥

---

* ఈమంత్రములకు వేదాంతార్థ ముండుటచేఁ బ్రస్తుతమున కనవసరమని వివరింపలేదు.

శ్లో॥ సూర్యఏకోవిచరతే, చంద్రమాజాయతే పునః।
అగ్నిర్హిమస్య భేషజ్యం భూమిరావపనం మహత్॥
ఆరణ్యపర్వ, అధ్యా 312 (యక్షప్రశ్న.)

అర్థమాత్ర గ్రహణము.

మం॥ తమశపద్ధియాధియా త్వావధయాను ।
రోవాచ యదితి తస్మాన్మత్స్యంధ యాఘ్నంతిశప్తః॥
కృష్ణయజుస్సంహిత. 7-5.

శ్లో॥ మత్స్యస్తస్య సమాచఖ్యుః క్రుద్ధస్తానగ్నిరబ్రవీత్।
భక్ష్యావై వివిధై ర్భావై ర్భవిష్యథశరీరిణాం॥
అరణ్యపర్వ. అధ్యా. 221.

తా॥ కారణాంతరమువలన నీరిలో దాఁగియుండిన యగ్ని యొక్క యునికిని మత్స్యములు దేవతల కెఱిఁగించుటచే నగ్ని, మత్స్యములపైఁ గోపించి, "మత్స్యములారా! మీ రితరశరీరులచే వివిధముగ భక్షింపఁబడుదురుగాక!" యని శపించెను.

పైరీతినే 'శతరుద్రియ' పురుషసూక్తాదులలోని ఋగ్యజుర్వేదమంత్రములు రూపభేదముతోను, భావమాత్రముతోను నీమహాభారతమునఁ బెక్కుచోటులఁ జెప్పఁబడినవి.

ఇంతమాత్రమే కాదు. దృశ్యమానమహాభారతము యొక్క ప్రారంభముకూడ 'శ్రౌతగృహ్య' సూత్రనిబద్ధమై, ఋగ్యజుర్వేదాద్యర్థప్రతిపాదితమగు 'శాంతిక, పౌష్టిక,' కర్మకలాపములతోఁ గూడినదై యున్నది. అది యెది?

జనమేజయుఁ డొనర్చు నొకయజ్ఞమునకు వచ్చిన 'సార మేయుని' (దేవశునియగు సరమాపుత్రుని) జనమేజయుని సోద రు లణఁచ నాదేవశుని యగు 'సరమ' జనమేజయుకడ మొఱ పెట్టుకొని యుంటచ్ఛ్రిత యగుటయు దానివలనఁ గలుగు ననిష్ట శాంతికై జనమేజయుఁడు 'శాంతిక, పౌష్టిక' క్రియ లొన ర్చుటయే. పై గాథాంశములు ఋగ్వేదము (10-107)నందును, యజుర్వేదము 'ఏకాగ్నికాండమంత్రపన్నము (2-2-17)నందు నుగల సరమ యను దేవశునిసంబంధమగు మంత్రాంశములనుండి యుల్లిఖింపఁబడినవియే. ఋగ్యజుశ్శాఖలకు సంబంధించిన శ్రౌత గృహ్యసూత్రకారులు 'సరమ, సారమేయాదులు' శ్వగ్రహ ము లనియు, అవి బాలురకు సోఁకు సోఁకుడురోగ మనియు, ఆ శ్వగ్రహనివృత్తికై శాంతిక, పౌష్టికక్రియలఁ జేయవలయు ననియుఁ గొన్నివిధులను నిర్వచించియున్నారు.[1]

మహాభారతగాథారంభముననే (ఆదిపర్వము 3. అధ్యా యము) సరమాసారమేయుల గాథ యుండుటయు సారమే యుని బాలురగు జనమేజయుని సోదరు లణఁచుటయుఁ గాన నగుచున్నది. పిమ్మట జనమేజయుఁడు పురోహితుని సంపాదిం చుట కలదు. అది వేదమునందలి ఋత్విగ్వరణవిధియే యై యున్నది.

కొన్ని యధ్యాయములైనపిమ్మట 'కద్రూ, వినతా'

(1) స్మార్తానుక్రమణిక, యాజుషప్రయోగచింతామణి.

సంవాదము కలదు. కద్రువ గుఱ్ఱపుతోఁకలో నలు పున్నదన, లేదని వినత వాదింపఁ గ్రౌత్రిమముచేఁ గద్రువ వినత నోడింప, వినత కద్రువకు దాసియై తద్విముక్తికై యమృతముఁ దెచ్చుటకు సుపర్ణుని నియోగింప నాతఁడు 'సోమము' అనుమాఱు పేరుగల 'అమృతముఁ' దెచ్చుట యను నితిహాస మింపుగ వర్ణింపఁబడినది.

ఈయితిహాసము 'తైత్తిరీయ' సంహిత(6-1)లో నిట్లు కలదు.

కద్రువయు, సౌపర్ణియుఁ దమలో నెవతె సౌందర్యవంతురాలను విషయమున వివాదపడి, మధ్యవర్తులచేఁ దగవుఁ దీర్పుఁ[1] జేయించుకొన సౌపర్ణి యోటుపడి, కద్రువకు దాసి యయ్యెను. ఆదాస్యమును 'త్రివిష్టపము' నందలి 'సోమలత' ను దీసికొని వచ్చి తనకిచ్చిన విముక్తి నొందర్తు నని కద్రువ సౌపర్ణికిఁ జెప్పెను. ఆయంశమును వినత తనబిడ్డలైన 'జగతీ, త్రిష్టుప్, గాయత్రీ' అనువారలతోఁ జెప్పఁ, దొలుత జగతియుఁ, బిమ్మటఁ ద్రిష్టుప్పును, బ్రయత్నించి విఫలత నొంది రాఁగాఁ దుదకు గాయత్రి త్రివిష్టపమున కేఁగి సోమరక్షకులగు 'కృశాన భ్రాజా'ములతోఁ బోరి వారి నోడించి సోమహరణ మొనర్చి

---

(1) స్త్రీలు సౌందర్యమును బరీక్ష చేయించుకొనుట నేఁడును బాశ్చాత్యదేశములలోఁ గలదు. ఇటలీదేశమున స్త్రీలు సౌందర్యమును బరీక్ష చేయించుకొనరా దని యిటీవల 'ముసులోనీ' గారు రాకశాసనముఁ జేయించిరి.

తెచ్చి కద్రువ కిచ్చి, సౌపర్ణిని దాస్యమునుండి విముక్తం జేసెను.

పై గాథయే 'ఐతరేయ' బ్రాహ్మణమున సోమాహరణ మను నామముతో ఒకవిధముగాఁ గలదు. అది యిది. "దేవతలు ఋషులు నొకప్పుడు జగతీ, త్రిష్టుప్, గాయత్రీ, ఛందస్సులఁ జూచి మీరు సోమము నపహరించి తెం డన నవి మూఁడును 'సుపర్ణ' రూపమును వహింప నందు మొదట రెండింటి యత్నముఁగాక గాయత్రియంశమే సోమాహరణ మొనర్చె"

మహాభారతమున (ఆదిపర్వమున) పై గాథ కొంత మార్పునొందియున్నది. ఆమార్పులో జగతి మొదలగు ఛందముల పేరు లేక ఛందోమయుఁడగు గరుత్మంతుఁడే 'సోమము' లేక అమృతము నపహరించి తెచ్చి 'సౌపర్ణి' (వినత) యొక్క దాస్యమును దొలఁగించినట్లు వర్ణింపఁబడియున్నది. ఆంధ్రమహా భారతపాఠకులకు, అమృత మన సోమ మనునంశము విరుద్ధము గాఁ గాన్పించును; కాని, సంస్కృతభారతమున అమృత శబ్దము సోమపర్యాయముగానె వాడఁ బడెను. చూడుఁడు—

శ్లో॥ కశ్యపస్య మునేః పుత్రో వినతానందవర్ధనః ।
హర్తుం 'సోమ' మభిప్రాప్తో బలవాన్ కామరూపధృత్ ॥
సమర్థో బలినాం శ్రేష్ఠో హర్తుం సోమం విహంగమః॥

ఆదిపర్వము 30వ అధ్యాయము.

తా॥ కశ్యపునకుఁ బుత్రుఁడును, వినతయొక్క యానందము నభివృద్ధి చేయువాఁడును, బలవంతుఁడును, కామరూపము ధరించువాఁడు నగు గరుత్మంతుఁడు సోమము నపహరింప నేతెంచి యున్నాఁడు, ఈ విహంగుఁడు బలవంతుఁడగుటచే సోమాహరణమునకు సమర్థుఁడు. ఇట సోమశబ్ద మమృతవాచిగాఁ జెప్పఁబడుట గమనార్హము. వేదములు యజ్ఞప్రవర్తకములు గదా! అట్టి యజ్ఞప్రవర్తకములగు వేదములలో సోమాహరణ విధి యుండు నవసరము కలదు. ఈపంచమ వేదమునందును సోమోపాఖ్యానమే గరుడోపాఖ్యానముగా మాఱియున్నది.[1] వేదములలో, గోమేధ ప్రశంస మెండుగ నుండును. ఈపంచమ వేదమందును, గోమేధప్రశంస, "వన, విరాట, ఉద్యోగ, ద్రోణ, శాంతి, ఆనుశాసనిక పర్వములలోఁ" బెక్కురీతులఁ జెప్పఁబడి యున్నది. గోమేధమునందలి గోప్రాక్షణమంత్రములు (గోవును వధించునపుడు చెప్పుమంత్రములు) పరిమాణములై

1 పై గరుడోపాఖ్యానము (సోమహరణము) అనుశాసనిక పర్వమునను గలదు. కాని యది ప్రక్షిప్త మనవలసియున్నది. వేదమున నొక్కెడఁ జెప్పఁబడిన కర్మము మఱియొకచోటున భిన్నముగాఁ జెప్పఁబడదు. అనుశాసనిక పర్వమునందలి గరుడోపాఖ్యానము ఆదిపర్వములోనిదానికి భిన్నముగా వర్ణింపఁబడెను. మఱియు ఉత్తరదేశపు భారతప్రతులలో అనుశాసనికములోని గరుడోపాఖ్యానము మృగ్యము. దక్షిణదేశపు ప్రతులలోఁ గలదు. తిక్కనసోమయాజి యాంధ్రీకరించెను. నన్నయ, తిక్కనల కవిత్వవిశేషములా గరుడోపాఖ్యానములవలనఁ దెలియఁగలవు.

నవి కావనుటచేతనే, నహుషుఁడు పదభ్రష్టుఁ డగుటకుఁ గారణముగా, ఉద్యోగపర్వమునఁ జెప్పఁబడెను. దీనిని అర్థవాదభేదముగా 'పూర్వమీమాంసా' శాస్త్రజ్ఞులు నుడువుదురు.

అశ్వమేధముఁగూర్చి, మహాభారతమునఁ బెక్కు చోట్లు లం జెప్పఁబడెను. ధర్మజాశ్వమేధము భారతగాథానుక్రమణిక (ఆదిపర్వ 61 అధ్యా) లోఁ దొలుత లేకుండినను, బిమ్మటఁ జేర్పఁబడెను. మహాభారతము పంచమవేద మగుటకే ధర్మజుని యశ్వమేధగాథ చేర్పఁబడినట్లు కాన్పించును. జనమేజయుఁ డశ్వమేధయాగ మొనర్చిన యంశము 'ఐతరేయబ్రాహ్మణమునఁ' గొప్పగాఁ జెప్పఁబడుటయేగాక, బృహదారణ్యకోపనిషత్తునందును, పరిక్షిత్తనయులగు జనమేజయాదులు అశ్వమేధ మొనర్చుటచే బ్రహ్మలోకప్రాప్తులై రని చెప్పఁబడెను.

కృష్ణయజుర్వేదములో నశ్వమేధముఁగూర్చి కొన్ని ముఖ్యవిధు లొకచోటను, పరిశిష్టము, మఱియొకచోటను గలదు. [1] మహాభారతమునను, పై రీతినే ధర్మజాశ్వమేధమునఁ గొన్నివిధులను, ఖిల సంహితగా నెన్నఁబడు భవిష్యద్గాథలోఁ (దృశ్యమానహరివంశముయొక్క తుదిభాగము భవిష్యద్గాథ యను పేరితో నున్నది. అదియే ఖిలసంహిత) గొన్నివిధులును గాథా

(1) చూ॥ తైత్తిరీయసంహిత 4, 5, కాండ.

సందర్భములలోఁ జెప్పఁబడియున్నవి. [1]

మఱియు నితరవేదముల గాథల నీమహాభారతము గ్రహించినట్లే, యీపంచమవేదమునందలి గాథలును మహాభారతము పుట్టినపిమ్మట నావిర్భవించిన వైదిక వాఙ్మయమునను జేరియున్నవి. ఇందులకు ‘అధర్వసంహిత, ఐతరేయ, బ్రాహ్మణములలోని పరిక్షిత్స్వరూపమగు ‘కుంతాప’ సూక్తమును, జనమేజయునియొక్కయు ‘ఉద్దాలక, యాజ్ఞవల్క్య, శ్వేతకేత్వాది’ మునులయొక్క ప్రశంసలలోఁ గూడిన ‘శతపథ, ఐతరేయ’ బ్రాహ్మణములలోని యంశములును ‘ఛాందోగ్య బృహదారణ్యకోపనిషత్తుల’లోని యంశములే నిదర్శనములు.

ఈ పంచమవేదమునందు ‘విధ్యర్థవాదు’లను జెప్పునప్పుడు, ఇతర వేదములలో విధ్యర్థవాదాదులు చెప్పఁబడునట్లు కాక, ఆయాకథలలు, తాము చెప్పు కథలలోను, వాక్యోప వాక్యములలోను సందర్భానుసారముగాఁ జేర్చి చెప్పినటుల రచింపఁ బడుట విచిత్రాంశమై యున్నది.

ఉదాహరణములు:—

---

(1) అశ్వమేధపర్వమున యజమానపత్ని యశ్వసేవఁ జేయునపుడు భిన్నరీతినివర్తించినఁ బ్రత్యవాయము కల్గుననుసంశము చెప్పఁబడలేదు. భవిష్యగాథలో జనమేజయపత్ని యశ్వసేవలోఁ దప్పుగా మెలఁగెనను నారోపణముఁ జేయఁబడెను. అందువలననే జనమేజయు నశ్వమేధమునకు విఘ్నము కల్గెనఁట !

అశ్వమేధము [1]బ్రహ్మహత్యా పాతకనివృత్తికిని, [2]తదితర మహాపాపనివృత్తికిని [3]అన్యరాష్ట్రమును దనరాజ్యములోఁ గలిపికొనునప్పుడును జేయవలయునను విధులుకలవు. పై మహాపాతకము లొనర్చిన 'ఇంద్ర, ఇంద్రోతుపార్థితులు,' అశ్వమేధ యాగము లొనర్చి పాపవిముక్తి నొందినట్లు 'శల్య భీష్ములు' ధర్మజునకుఁ జెప్పిన గాధలు ఉద్యోగ శాంతిపర్వములలో వర్ణింపఁబడియున్నవి. ♦ అన్యరాష్ట్రాక్రమణము చేయుటచే ధర్మజుఁడొక యశ్వమేధ యాగముఁ జేయవలసివచ్చుటయేగాక, గురువు-బ్రాహ్మణుఁడు నగుద్రోణు నబద్ధమాడి చంపించుటచే నగు మహాపాపనివృత్తికై మఱియొక యశ్వమేధమును, జ్ఞాతి

(1) "తరతి బ్రహ్మహత్యాంయోఽశ్వమేధేన యజతే.

(2) యోఽశ్వమేధేన యజతే సర్వ ఏవ భవతి సర్వస్యవా ఏషా ప్రాయశ్చిత్తిః.

(3) యోరాష్ట్రం క్రామతి సోఽశ్వమేధేన యజతే॥ (తైత్తిరీయసంహిత.)

♦ కురుక్షేత్ర యుద్ధానంతరము 'పాంచాల, బాహ్లిక, మద్రదేశముల నేలు రాజుల పంక్తులు నశించుటచే నవి కురురాజ్యమునఁ గలిసిపోయినట్లు కాన్పించుచున్నది. పాండవులకాలమున అనాగరికులై, చోరులై, ఖాండవ వనమునను, కురుక్షేత్రమునను సంచరించు 'తక్ష'కాది నాగులు బాహ్లిక దేశమునందు పరిక్షిత్ కాలమున తక్షశిలానగరమును నిర్మించి ప్రత్యేక రాజ్యమును స్థాపించిరి. ఆనాగులనాయకుఁడే పరిక్షిత్తును వధింప నాతని మనుమఁడగు జనమేజయుఁడు తక్షశిలపై దండెత్తి నాగులను మాడ్చిన గాధయే, సర్పయాగ మైనది.

వధ నిమిత్తక మహాదోష నివృత్తికై వేఱొండు, అశ్వమేధ మును, మొత్తము మూఁడశ్వమేధములు చేయవలసి వచ్చినది. పై మూఁడంశములఁ గూర్చియు, 'శాంతి, అశ్వమేధ' పర్వముల లో, కృష్ణద్వైపాయనుఁడు ధర్మజున కొసఁగిన యుపదేశముల లో స్పష్టీకరింపఁబడియున్నది. (ద్రోణవధనిమిత్తకాశ్వమేధము ను, కుమారిలభట్టు తంత్రవార్త్తికమహాభాష్యమునఁ బ్రశం సించియున్నాఁడు.) ప్రస్తుతమగు రాజసూయమునందును, రాజ సూయయాగాంగమై యొక్కదినములోనే ముగింపఁబడు 'సోమ యాగమైన మఱునాఁడును, పునరభిషేచన కర్మమునకుఁ బూ ర్వమున నొనర్పఁబడు "ఉదవసానీయము" అను ఇష్టిలోఁ బు రుషపశు(వు) క్షత్రియపశు విశసనము విహితమైనట్లు 'ఐతరేయ బ్రాహ్మణము'లోని, విధివాక్యములవలనను, ఆబ్రాహ్మణములో నిదే యగు, హరిశ్చంద్ర పుత్రుఁడగు రోహితు, శునశ్శేపుల, చరిత్రలతోఁగూడిన యితిహాసము వలనను స్పష్టమగుచున్నది. ఇందు క్షత్రియుని క్షత్రియుఁడు (స్వజాతీయుఁడు) యాగపశు వుగాఁ జేయవచ్చునా? అను సందేహ ముద్భవించినది. ఈయం శమును మహాభారతనిర్మాత, కృష్ణ, జరాసంధ సంభాషణము లలో వాక్యోపవాక్యములుగా (జరాసంధవాక్యములచే) క్షత్రి యుని దేవ ప్రీతికై విశసింపవచ్చు ననుటను స్థిరపఱచి యు న్నాఁడు. చూడుఁడు:—

శ్రీకృష్ణుఁడు జరాసంధునితో నిట్లను చున్నాఁడు, "ఓ

జరాసంధ రాజా! లోకమునందలి రాజుల నపహరించి కుటిలముతోఁ గూడిన క్రూరకార్యములొనర్చుచు, నేను లోకమున కపకారము చేయలేదని తలఁచుచున్నావా? ఓ రాజశ్రేష్ఠా! రాజు సాధువు లైన రాజుల నెట్లుహింసించును? నీ వట్టి సాధువులగు రాజులను నిగ్రహించి, రుద్రునకు బలి నిచ్చుచున్నావు............ మనుష్యులను బలినిచ్చుట యెచటను జూడఁబడలేదు. అట్టి దాని లో నీవు మనుష్యులను విశసించి శంకరునికై యజ్ఞముఁ జేయ నెంచుచున్నావు. వ్యర్థబుద్ధిగల యోజరాసంధా! నీవు నీ సవర్ణు లైన క్షత్రియులను బశువులనుగాఁ జేయుచున్నావు. నీవలె నెవఁడును ఇట్లు చేయువాఁడు లేఁడుసుమా * పై శ్రీకృష్ణ ప్రశ్న ములందు మూఁడు ముఖ్యాంశములు గలవు. (1) సాధువు లైన క్షత్రియులను చంపవచ్చునా? (2) మనుష్యులను విశసించి యజ్ఞము నొనర్పవచ్చునా? (3) సవర్ణుఁడు సవర్ణుని పశువునుగాఁ జేసి యజ్ఞము నొనర్పవచ్చునా?

శ్రీకృష్ణ.....శ్లో॥ త్వయాచోపహృతా రాజన్ క్షత్రియాలోకవాసినః। తదాగః క్రూరముత్పాద్య మన్యసే కిం మనాగసం॥

రాజా రాజ్ఞః కథం సాధూన్ హింస్యాన్నృపతి సత్తమః। తద్రాజ్ఞ స్సన్నిగృహ్యాత్వం రుద్రాయోపజిహీర్షసి॥ మనుష్యాణాం సమాలంభో నచ దృష్టః కదాచన। స కథం మానుషైర్దేవం యష్టుమిచ్ఛసి శంకరం॥—సవర్ణో హి సవర్ణానాం పశుసజ్ఞం కరిష్యసి, కోన్య ఏవం యథాహిత్వం జరాసంధ వృథామతిః॥—

పై మూఁడు ప్రశ్నములకును జరాసంధుఁడెట్లు సందేహని వృత్తిఁ జేసెనో చూడుఁడు—

[1]"కృష్ణా! నేను రాజుల నెవరినిగాని జయింపకుండఁగఁ దీసికొని రాలేదు. నాచే జయింపఁబడని శత్రు వెవఁడు కలఁడు? బంధితులైన రాజులలో నాచే జయింపఁబడనివాఁడెవఁడు? కృష్ణా! క్షత్రియునకుఁ బరాక్రమించి తెచ్చినవానిని పశువుగాఁ జేసి, ఇష్టమువచ్చినట్లు చేయుటయే (యజ్ఞములలో విశసించుటయే) ధర్మమని చెప్పుదురు. నేను రాజులను దేవప్రీతికై యీయఁదలఁచి తెచ్చి, యిపుడు భయమువలన నెట్లు క్షత్రియ ధర్మమును స్మరింపుచుఁగూడ విడువఁగలను?

పై జరాసంధ వాక్యములలోఁ గృష్ణుఁ డొసర్చిన ప్రశ్నాత్రయమునకును సమాధానము గలదు.

(1) సాధువులంగాక రణవీరులనే జయించి తేవచ్చును.
(2) దేవతలకొఱకు మనుష్యులను విశసింపవచ్చును.
(3) క్షత్రియుఁడు జయించి తెచ్చిన వారిని యజ్ఞపశువుగాఁ జేయవచ్చును.—అను సమాధానము లేర్పడుచున్నవి.

(1) జరాసంధ ఉవాచ॥ శ్లో॥ నాజిత్వాన్వై నరిపతన్ నాహమాదద్మి కాంశ్చన। అజితః పర్యవస్థాతా కోఽత్రయో న మయా జితః॥—క్షత్రియస్యైత దేవాహుర్ధర్మ్యం కృష్ణోపజీవనం। విక్రమ్యవశమానీయ కామతో యత్సమాచరేత్॥ దేవతార్థముపాహృత్య రాజ్ఞః కృష్ణకథం భయాత్। అహమద్య విముచ్యేయం క్షత్రం వ్రత మనుస్మరన్॥

సభాపర్వ.

ఇట్టివిశేషము లీపంచమ వేదమునం బెక్కులు కలవు. గ్రంథవిస్తరభీతిచే నాయంశములను మాని తొలుత రాజసూయాంశములం జెప్పి, పిమ్మట ధర్మజు రాజసూయ విశేషములను వివరింతును.

రాజసూయము.

(1) రాజు రాజసూయముం జేయవలయును. అను విధి వాక్యము ననుసరించి, యజ్ఞముం జేయుట కర్హతగల 'బ్రాహ్మణ, వైశ్యులకు' రాజసూయ యజ్ఞార్హత లేదని స్పష్టమగుచున్నది. మఱియు రాజసూయశబ్దమున కర్థమేమనగా, (2) రాజుచే (పునరభిషేకము ద్వారా) సిద్ధింపంజేయంబడునది. లేక, లతాత్మకసోమరాజు (సోమలత) ఖండింపం బడునది. అనువ్యుత్పత్తులను వైయాకరణులు చెప్పియున్నారు. రాజసూయ యాగమున సోమలతాఖండనమును, యాగాంతమునం బునరభిషేకము నొంది రాజు యాగసమాప్తి నొందించుచుండుటయుం గల్గుటయే కాక, పునరభిషేకమునకుం బూర్వమున నగు 'ఉదవసానీ

---

(1) "రాజా రాజసూయేన యజేత" శ్రుతిః॥

(2) సూ॥ రాజసూయ......(3—1—114) పాణినీయ॥

వృత్తిః॥ రాజ్ఞా సోతవ్యో అభిషవద్వారా నిష్పాదయితవ్యః.

యద్వా లతాత్మకస్సోమో రాజా స సూయతే ఖండ్యతే॥

యము' అనునొక యిష్టియం దొకక్షత్రియుఁడు పశువుగా బంధింపఁబడు సూచనలుండుటచే 'రాజు ఖండింపఁబడు యాగము' అను ధ్వని కూడ నగుచున్నది. రాజసూయ యాగముఁ గూర్చిన యంశములు 'శుక్లయజుర్వేదము'నందును, (11 అధ్యా.) ఋగ్వేద బ్రాహ్మణమగు 'ఐతరేయ' బ్రాహ్మణమునందును (7 పం, 3,4 అధ్యా.) విపులముగాఁ గలవు. కృష్ణయజుర్వేదశాఖాంతర్గతమగు తైత్తిరీయసంహితలో (5 కా. 6 ప్ర) అగ్నిచయనాంశములఁ దెల్పు సందర్భమున (సంభేష్టికోపధాన, భూతేష్టికోపధానములు) అగ్నిచిదభిషేచనమునకును, రాజసూయ యాగకర్త యొక్క పునరభిషేకమునకును, సమానధర్మములు కలవని మూఁడుమంత్రములలో; జెప్పబడియున్నది. అథర్వసంహిత యందు (శౌనకశాఖ) ఒకసూక్తము (4 కా. 9సూ.) రాజసూయ యాగకర్తను గూర్చి అధ్వర్యుఁడు దేవతల కొనర్చు ప్రార్థనము, రాజున కుపదేశించు నుపదేశములు కలదై యున్నది.

ఐతరేయబ్రాహ్మణమునందలి 'శునశ్శేపుని' గాథలతో ఋగ్వేదమునందలి (1 మం. 24 మొ, 30 సూక్తములవఱకు 97 మంత్రములు) సంబంధము కలదు. మఱియు నైతరేయ బ్రాహ్మణమునందు 'సామ, యజస్సు' అని చెప్పఁబడని రాజసూయయాగ సంబంధమంత్రములన్నియు ఋగ్వేదము (శాకల్యసంహిత) నుండి కైకొనఁబడినవియే. శుక్లయజుస్సంహితలోని

మంత్రములు చాలవఱకు స్వతంత్రోద్భవములుగానె యున్నవి.

ఇపుడు వ్రాయఁబోవు నంశములు సందర్భానుసారముగా 'శుక్లయజుస్సంహిత, ఐతరేయ బ్రాహ్మణముల'ను గ్రైకొనియే వ్రాయఁబడుచున్నవి.

శ్రౌతసూత్రములలో 'ఆశ్వలాయన, కాత్యాయన, హిరణ్యకేశి' సూత్రములు రాజసూయ విధానమును వివరించి యున్నవి.

రాజసూయ యాగకర్త చేయవలసిన విధులు.

రాజురాజ్యమునకు నభిషిక్తుఁడై [1] ఇష్టాపూర్త' కర్మములను దప్పక చేయవలయును.

ఇష్టాపూర్తము లనఁగా, వేదధర్మనిర్వహణము ఇష్టమనఁబడును. వర్ణాశ్రమ ధర్మ నిర్వహణము, సభా, ప్రపా, తటాకాది, ప్రజోపయోగకర కార్యములొనర్చుట పూర్తమనఁ బడును. ఇష్టాపూర్తములం గూర్చి విద్యారణ్యభాష్యమున నిట్లు కలదు.

[2]వర్ణాశ్రమధర్మములను వేదధర్మములను గాపాడుట,

---

(1) "ఇష్టాపూర్తా వపరిజ్యానిః" ఐ. బ్రా.

(2) శ్లో॥ వర్ణాశ్రమ త్రయీధర్మ ఇష్ట పూర్త మథేతరం ।
ప్రపా తటాకాది రూపం తచ్చ సర్వత్ర విద్యతే ॥

ఇష్టము. దానికి వ్యతిరేకమైన 'ప్రపా, తటాకాది' ప్రతిష్ఠారూప మైనది. 'పూర్తము'గూర్చి మఱియొకగ్రంథమున నిట్లు కలదు.

[1] 'తటాక ప్రతిష్ఠలు, సభాభవన నిర్మాణములు, దిగుడుబావులఁ ద్రవ్వించుట, దేవాలయములఁ గట్టించుట, తోటలు వేయించుట' అను కర్మములు 'పూర్తము' అని చెప్పఁబడును.

రాజసూయయాగకర్త పై కార్యము లొనర్చి యుండి 'ఇష్టాపూర్తము' అనుకర్మముఁ జేయవలయును.

'ఇష్టాపూర్త' హోమానంతరము రాజు 'దీక్షణీయేష్టి' అను నొక యిష్టిని జేయును. [2]

రాజు దీక్షణీయేష్టిని జేయగనే బ్రాహ్మ్యము నొంది సోమపానమునకుఁ గాక తక్కిన యంశములలో (కర్మములు చేయుటలో) దీక్షణీయేష్టికి మూఁడవనాఁడు జరుగు 'ఉదవసానీయేష్టి' ముగియునటకు బ్రాహ్మణుఁడుగానె యుండును. చూడుఁడు.

* "ఇష్టాపూర్త హోమ మొనర్చిన పిమ్మట రాజిట్లను

---

(1) పుష్కరిణ్య స్సభా వాపి దేవస్యాయతనానిచ। ఆరామశ్చ విశేషేణ పూర్తంకర్మ వినిర్దిశేత్॥

(2) 'ఇష్టి' అను నొకచిన్న యాగము, లేక, చేయఁబడుమహాయజ్ఞమునకుఁ అంగయజ్ఞము.

* "బ్రహ్మ ప్రపద్యే బ్రాహ్మణోభవామి......బ్రహ్మవా ఏష ప్రపద్యతే యో యజ్ఞం ప్రపద్యతే...యజ్ఞాదుహవా ఏష పునర్జాయతే యో దీక్షతే తం బ్రహ్మప్రసన్నం.—సహోదస్యన్నేవ క్షత్రియతా మా

చున్నాఁడు— ఓ ఋత్విక్కులారా! నేను బ్రాహ్మణుఁడ నగుచున్నాను......అనఁగా అధ్వర్యుఁ డిట్లనును. ఎవఁడు యజ్ఞముఁ జేయుచున్నాఁడో అట్టి యీరాజు బ్రాహ్మణుఁ డగుచున్నాఁడు. ఈరాజు యజ్ఞము వలనఁ బునర్జన్మము నొందియున్నాఁడు. ఎవఁడు దీక్షితుఁ డయ్యెనో వానిని బ్రాహ్మ్యము పొందియున్నది...అతఁడు 'ఉపవసానీయేష్టి' నొనర్చి క్షత్రియత్వము నొందును.

పిమ్మట రా జిట్లనుచున్నాఁడు:—

నేను క్షత్రియుఁడ నగుచున్నాను. క్షాత్రము నొందుదును.

పిమ్మట నధ్వర్యుఁ డిట్లనును.

ఈతఁడు క్షత్రియుఁ డగును! క్షత్రమన రాష్ట్రమేకదా! ఎవఁడు రాష్ట్రము నొందుచున్నాఁడో ఆతఁడు క్షాత్రము నొందినవాఁ డగును.

దీక్షణీయేష్టి యైనపిమ్మట 'అనుబంధ్యము' అను మఱియొకయిష్టి చేయఁబడును. ఇందు గోవె బంధింపఁబడి విశసింపఁబడును. ఆగోవు సాధారణముగా గొడ్డావైన (వశ) మంచిది. ఆగోవు చూలింతగ నుండినయెడలఁ జేయఁబడు ప్రాయశ్చిత్త కర్మకలాపమును గలదు. గర్భస్థపిండమును వేఱుగఁదీసి, కొంత

పోన్నతి; "క్షత్రం ప్రపద్యే క్షత్రియో భవామి"..."క్షత్రం వా ఏష ప్రపద్యతే యో రాష్ట్రం ప్రపద్యతే క్షత్రం హి రాష్ట్రం.— ఐ. బ్రా.

హోమ మొనర్చి తక్కినదానిని బొగ్గులతోఁ గప్పియుంచెదరు.

'అనుబంధ్యేష్టి' యైన మఱునాఁడు ఏకాహికసోమయాగము జరుగును. అనఁగా ఒక్క నాఁటితో ముగియు యజ్ఞము జరుగును. అది 'జ్యోతిష్టోమము' అనుపేరు కల దనియు' క్షత్రియుఁడు జ్యోతిష్టోమ మొనర్చినచో బ్రాహ్మణుఁ డొనర్చు 'అగ్నిష్టోమ' యజ్ఞమనవచ్చు ననియు, ఐతరేయబ్రాహ్మణము చెప్పుచున్నది. ఈజ్యోతిష్టోమ యాగమునందలి 'సవన, సామ, స్తోమ, శస్త్రాదుల' ప్రశంసతో మనకు నిమిత్తము లేదు.

సోమయాగమైన మఱునాఁడు పునరభిషేకమునకుఁ బూర్వము 'పశువిశసనము'— అందు క్షత్రియపశువు, లేక బ్రాహ్మణపశువు బంధింపఁబడుటతోఁ గూడిన 'ఉదవసానీయము' అను నొకయిష్టి జరుగును. ఐతరేయబ్రాహ్మణమునందలి శునశ్శేపుని యితిహాసము 'ఉదవసానీయేష్టి' కాలమునఁ గలిగినదియే. ఋగ్వేదముయొక్క ప్రథమమండలమునందలి శునశ్శేపసంబంధములగు (24 మొదలు 30 వఱకు) సూక్తములు ఉదవసానీయేష్టిలోఁ బశువుగానున్న శునశ్శేపునిచే ద్రష్టము లైనవియే. ధర్మజుని రాజసూయమునందును సోమయాగమైన మఱునాఁడె పునరభిషేక మిఁక జరుగు ననఁగాఁ జేయఁబడిన 'ఉదవసానీయేష్టి' కాలముననే శిశుపాలుఁడు వధింపఁబడె నని స్పష్టమగుచున్నది. ఉదవసానీయేష్టిలో శునశ్శేపుఁ డెట్లు బంధింపఁబడెనో యాగాథల నిట సంగ్రహముగా వ్రాయుచున్నాను.

హరిశ్చంద్రుని కథ.

ఇక్ష్వాకువంశంబున 'వేధసుఁడు' (పురాణములలో త్రిశంకుఁడు) అనురాజునకు హరిశ్చంద్రుఁ డనుపుత్రుఁడు కలఁడు. ఆ హరిశ్చంద్రునకు నూర్వురు భార్యలుండినను పుత్రసంతతి లేకుండెను.

ఆ హరిశ్చంద్రుని గృహమున కొకప్పుడు 'పర్వతుఁడు, నారదుఁడు' అను మహర్షు లతిథులుగా రాఁగా, హరిశ్చంద్రుఁడామునులను గౌరవించి, నారదునిఁ బుత్రోత్పత్తి వలనఁ గల్గు లాభముల నడుగ, నారదుఁడు పుత్రోత్పత్తి వలనఁ గల్గు లాభములను జెప్ప' హరిశ్చంద్రుఁడు తన కెట్లు పుత్రోత్పత్తి కల్గునో చెప్పు మనెను. అందులకు నారదుఁడు, ఓ రాజా! నీవు 'వరుణ' దేవుని నాకుఁ బుత్రు నొసఁగిన నే నాపుత్రుని బశువుగాఁ జేసి నిన్నుఁగూర్చి యజ్ఞముఁ జేయుదు నని ప్రార్థింపుము. నీకు వరుణుఁడు పుత్రు నొసంగు ననియెను.

పిమ్మట హరిశ్చంద్రుఁడు వరుణుఁగూర్చి నాకొక పుత్రు నొసంగిన నే నాపుత్రుని బశువుగాఁ జేసి, యజ్ఞముఁ జేయుదు నని ప్రార్థింప వరుణుఁడు ప్రత్యక్షమై పుత్రప్రాప్తి కలుగ వర మిచ్చెను.

పిమ్మట హరిశ్చంద్రునకు 'రోహితుఁడు' అను పుత్రుఁ డుద్భవింప వరుణుఁడు వచ్చి, ఈబాలునిచే నాకు యజ్ఞముఁ జేయు మన హరిశ్చంద్రుఁడు:—

(1) "జాతాశౌచదినములు వెళ్లినగాని బాలపశువునకు యజ్ఞార్హత లేదు." అనఁగా వరుణుఁడు వల్లె యని వెడలిపోయెను.

జాతాశౌచదినములు వెళ్లినపిమ్మట వరుణుఁ డేతెంచి నీవు చెప్పిన గడువు ముగిసినదిగాన వీనిచే నాకై యజ్ఞము నొనర్పు మనఁగా హరిశ్చంద్రుఁడు:—

(2) 'పశువునకు దంతములు వచ్చినఁగాని మేధ్యమగుట కర్హత లేదు.' అనఁగా వరుణుఁ డంగీకరించి వెళ్లిపోయెను.

పిమ్మట రోహితునకు దంతములు రాఁగా వరుణుఁడు వచ్చి, బాలునకు దంతములు వచ్చినవిగాన వీనిని యాగము పశువుం జేసి యజనము నొనర్పు మనెను.

(3) ఈబాలున కిపుడు వచ్చిన దంతములు స్థిరములై

---

(1) "యదా వై పశుర్నిర్దశో భవ త్యథ స మేధ్యో భవతి నిర్దశోఽన్వ స్త్వథ త్వా యజా ఇతి."

(2) "యదా వై పశోర్దంతా జాయంతేఽథ స మేధ్యో భవతి దంతాన్వస్య జాయంతా మథ త్వా యజా ఇతి."

(3) "యదా వై పశోర్దంతాః పద్యంతేఽథ స మేధ్యో భవతి దంతాన్వస్య పద్యంతా మథ త్వా యజా ఇతి".

నని కావున నివి యూడినఁగాని యాగార్హుఁడై యీబాలుఁ డుండడు. అని హరిశ్చంద్రుఁ డన 'తథాస్తు' అని వరుణుఁడు వెడలిపోయెను.

తరువాత పాలపండ్లూడగా వరుణుఁ డెప్పటియట్ల వచ్చి పల్లూడినవిగాన, వీనిచే జన్నము నొనర్పు మనఁగా:—

(4) 'రెండవసారి దంతములు రానిదే పశువు సర్వావయవ సంపూర్ణత నొందదు.'

అని హరిశ్చంద్రుఁ డన వరుణుఁ డంగీకరించెను.

రెండవసారి దంతములు రాఁగా, వరుణుఁ డెప్పటియట్ల వచ్చి అవయవసంపూర్ణత కలిగెనుగాన వీనితో యజ్ఞముఁ జేయు మనెను.

(5) 'పశువుకాఁగల క్షత్రియుఁడు స్వకులోచితమగు సన్నాహశీలి (యుద్ధమున కర్హతగల కవచ ధనుర్బాణాది ధారి) కాకుండిన, యజ్ఞమునందు వినియోగింప నర్హుఁడు కాఁడు.'

అని హరిశ్చంద్రుఁ డనఁ బూర్వమువలెనె వరుణుఁ డంగీకరించి వెడలిపోయెను.

పిమ్మట 'రోహితుఁడు' సన్నాహశీలి కాఁగా వరుణుఁ

---

(4) "యదావై పశోర్దంతాః పునర్జాయంతేఽథ సమేధ్యో భవతి. దంతాన్వస్య పునర్జాయంతాం మథత్వా యజా ఇతి."

(5) "యదావై క్షత్రియః సాన్నాహుకోఽథ త్యథ స మేధ్యో భవతి. సన్నాహన్ను ప్రాప్నోత్యథ త్వా యజా ఇతి"

డేతెంచి, సన్నాహశీలి యగు నీకుమారునిచే యజనం బొనర్తు మనెను.

(6) "దానికి హరిశ్చంద్రుఁ డట్లే చేయుదునని యంగీకరించి కుమారుఁ డగు రోహితుని బిలిచి యిట్లు చెప్పెను.

నాయనా! నాకొఱకు నిన్నీవరుణుఁ డిచ్చెను. అయ్యో! నీచే నే నీ వరుణుని గూర్చి యజ్ఞముం జేయుచున్నాననఁ, నా రోహితుఁ డంగీకరింపక ధనుర్ధరుఁడై యరణ్యమునకుఁ బోయి యట నుండెను.

హరిశ్చంద్రుఁ డనినరీతిని యజ్ఞమును జేయనందున వరుణుఁడు హరిశ్చంద్రుని బట్టుకొనఁగా, హరిశ్చంద్రునకు 'జలోదర' రోగము కలిగి, బాధపడుచుండెను.

రోహితుని ప్రవర్తనము

తండ్రికి జలోదరరోగము కలిగెనని యరణ్యమందు సంవత్సర మున్నతరువాత 'రోహితునకు' దెలిసి గ్రామమునకు తిరిగి పురమునకు వచ్చుచుండఁగా 'ఇంద్రుఁడు' బ్రాహ్మణవేషధారియై మార్గమధ్యమున నొక సాకు చెప్పి రోహితుని మరల వనమునఁ దిరుగునట్లు చేసెను. ఇట్లొకపర్యాయము కాదు; అయిదు పర్యాయము లింద్రుఁ డట్లు రోహితుని వెనుక కరణ్యము

---

(6) "సతథేత్యు క్త్వా పుత్రమా మంత్రయా మాస. తతా! యంవై మహ్యం త్వా మదదా ద్ధంత! త్వయాహ మిమం యజా ఇతి. సహ నేత్యు క్త్వా ధనురాదా యా రణ్య ముపాతస్థౌ.

నకుఁ బంపుటచే రోహితుఁ డరణ్యమున నాఱేండ్లు తిరిగెను. (ఇంద్రుఁడు రోహితునకుఁ జెప్పిన సాకు లిట నప్రస్తుతమని వివరింపలేదు.)

ఎట్లయినను హరిశ్చంద్రుఁడు మనుష్యపశువుచే యజ్ఞముఁ జేయనియెడల నాతనికి రోగనివృత్తి కాదని, రోహితుఁడు తలఁచి తనకు మారుగా నొకనిని హరిశ్చంద్రు యాగముకై యరణ్యమున వెదుకఁ బ్రారంభింప, నాయడవియం దొక పర్వతపు చరియలో దరిద్రముచే భుక్తికి లేక బాధ నొందుచున్న 'సూయవసుని' పుత్రుఁడగు 'అజీగర్తుఁడు' అను నొక బ్రాహ్మణుని జూచెను. అయ్యజీగర్తునకు (1) 'శునఃపుచ్ఛుఁడు (2) శునశ్శేపుఁడు (3) శునఃలాంగూలుఁడు' అను ముగ్గురు కుమారులు కలరు. అట్టి యాబీదబాపని జూచి, రోహితుఁడు "ఓఋషీ ! నీకుమారులలో నొకనిని నాకిమ్ము. నీకు నూఱుగోవులనిచ్చెదను. నాకుఁ బ్రతినిధిగా వానిని జేసికొని యజ్ఞము చేయింతు" ననెను.

దానికి నజీగర్తుఁ డంగీకరించెను. కాని,

గీ. పెద్దవాఁడు నాకెంతయుఁ ♦ బ్రియతనూజుఁ
డతని నే నీకు నీఁజాల ♦ ననియెఁ దండ్రి;
పిన్నవాఁడు నాకెంతయుఁ ♦ బ్రియుఁడుగాన
యాకుమారుని నీఁజాల ♦ ననియెఁ దల్లి ॥

శునశ్శేపుని గాథలు

తలిదండ్రుల మాటలను విని మధ్యముఁ డగు శునశ్శేపుఁడిట్లనియెను.

గీ. పెద్దవాఁడు తండ్రికిఁ జాలఁ ♦ బ్రియసుతుండు
పిన్నవాఁడు తల్లికి ముద్దు ♦ ప్రియసుతుండు
వారలిరువురు నొల్లని ♦ వాఁడ నైన
మధ్యముఁడ నేను వచ్చెద ♦ మానవేంద్ర!

నీవిచ్చెదననిన గోవులను వీనికిమ్ము. నీవెనుక నేవచ్చెద ననిన నతఁడు నూఱుగోవులను 'అజీగర్తున'కిచ్చి, శునశ్శేపుని వెంట నిడుకొని, పురప్రవేశంబు చేసి, తండ్రియగు హరిశ్చంద్రు నితో, తండ్రీ! నాకు మారుగ వీనిని యజ్ఞపశువుగాఁ దెచ్చితి ననెను.

(1) అందులకు హరిశ్చంద్రుఁడు సంతసించి, వరుణునితో నీ'శునశ్శేపుని'ఁ బశువుగాఁ జేసి నీకుయజ్ఞము నొనర్తునన, వరుణుఁడు, క్షత్రియునికంటె బ్రాహ్మణుఁడె శ్రేష్ఠుఁడుగదా! వీనిం బశువుగాఁ జేసి 'రాజసూయ' యాగముంజేయు మని చెప్పగా, హరిశ్చంద్రుఁడు 'అభిషేచన' సంబంధమగుదానియందు (సోమ

---

(1) "సవరుణం రాజాన ముపససా దానేన త్వా యజా ఇతి. తథేతి. భూయాన్వై బ్రాహ్మణః క్షత్రియాదితి. వరుణఉవాచ॥- తస్మై ఏతం రాజసూయం యజ్ఞక్రతుం ప్రోవాచ. తమేత మభిషేచనీయే పురుషం పశుమాలేభే॥—

యూ గాంగమగు 'ఉదవసానీయేష్టియందు) శునశ్శేపుని బలువు గాఁ బొందెను.

(2) ఆయజ్ఞమున హరిశ్చంద్రునకు 'విశ్వామిత్రుఁడు హోత, జమదగ్ని అధ్వర్యుఁడు' వసిష్ఠుఁడు బ్రహ్మ, ఆయాస్యుఁడు 'ఉద్గాత' అను ఋత్విక్కులైరి."

పురాణవాఙ్మయమునందు హరిశ్చంద్రుఁడు సత్యమునకుఁ బుట్టినిల్లు, వసిష్ఠవిశ్వామిత్రులు- అందువిశ్వామిత్రుఁడు- నీచాతినీచమైన కలహములకు— వసిష్ఠునిగాని, తత్సంబంధులను గాని, అసహ్యించుకొని వారిని బలుబాధల నొందించుటకే పుట్టిన మూలకందము.

వైదికవాఙ్మయమునందో— హరిశ్చంద్రుఁ డొకసారి కాదు, అయిదుసారులు వరుణదేవునంతటివానితో సాకులు కల్పించి యాడితప్పిన మృషావాది.

వేదమునకు- అందు ప్రధానమైన ఋగ్వేదమునకు-మూఁడువంతులు దాను,తనపుత్ర, శిష్య ప్రశిష్యులు, ద్రష్టత్వమొందినట్టియు బ్రాహ్మ్యమొసఁగు గాయత్రికిఁగర్తయునగు విశ్వామిత్రుఁడును బ్రహ్మర్షిశ్రేష్ఠుఁ డై యన్ని వేదములలోను జాలభాగములకు ద్రష్టత్వ మొందిన వసిష్ఠ, మహర్షియు, పురాణవాఙ్మయమునందు కల్లుదాగినవారివలె, కాటికుక్కలవలె కలహించువా

---

(2) తస్యహ విశ్వామిత్రో హోతాసీ జ్జమదగ్ని రధ్వర్యు ర్వసిష్ఠో బ్రహమా౽ యాస్య ఉద్గాతా॥

రెరి. వైదికవాఙ్మయమునందు, బ్రహ్మర్షులుగాని పరిఢవిల్లుట యు, అందును 'వసిష్ఠ, విశ్వామిత్రులకు, ముఖ్యవిరోధకారణ ముగాఁ దలంపఁబడు హరిశ్చంద్రుని విషయముననే—ఆతనియ జ్ఞమునందే—ప్రధాన బుత్విక్కులగుటయు నాశ్చర్యకరము కాదా?

దాని నటుండనిచ్చి శునశ్శేపుని గుఱించి చూతము. పై నల్వురు మహర్షులు రాజసూయముఁ జేయింపుచుండఁగా మనుష్యపశువును బంధింప ననువగు కర్మమేతెంచినది. శునశ్శే పుని బశువుగా బంధింపుసమయ మాసన్నమైనది. విశసింపఁబ డు పశువును 'ఉపాకృతము' అను సంస్కారముఁ జేసినవెంటనే (1) రెండుపేటలు వేయబడి రెండుబారలు పొడవుగల, రెండు కుశనిర్మితములగు త్రాళ్లతో, కాళ్లను తలను గట్టిగాబంధించి, మూఁడుపేటలు గలిగి మూఁడుబారలుపొడువుగల త్రాటిచే మధ్యభాగమును యూపస్తంభమున కంటఁ గట్టవలయును.

ఇపుడు విశసింపఁబడు పశువో, సాధారణపశువా? కాదు, యువకుఁడు—మహర్షిగోత్రోత్పన్నుఁడు—మహాకవి—వేదవేత్త—బ్రహ్మవర్చస్వి—మహాభక్తుఁడు—అట్టివానిని, బై విధమున బంధింప నెవనికి చేతులు వచ్చును? ఎవఁడును బంధిం ప నంగీకరింప లేదుగాని, నూఱుగోవులకుఁ బుత్రు నమ్మిన శున శ్శేపుని తండ్రియగు 'అజీగర్తుఁడే' నాకింకొక నూఱుగోవుల

(1) కాత్యాయనశ్రౌతసూత్రమున నియంశములు గలవు.

నిచ్చినయెడల నేను శునశ్శేపుని బంధింతునని పలుక, హరిశ్చంద్రుఁ డర్ప నూఱుగోవుల నీయ 'అజీగర్తుఁడు' దారుహృదయము—కాదు. శిలాహృదయముతో, పుత్రుని విశసింపఁ యూపస్తంభమునకుఁ బైరీతి నంటఁ గట్టెను,

(1) అపు డధ్వర్యుఁ డేతెంచి, బంధితుఁ డగు శునశ్శేపునకు "ఉపాకృత, నియుక్త, అప్రీణన, పర్యగ్నికరణములు" అను కర్మములఁ జేసెను.

(పై కర్మములు వధ్యపశువునకుఁ బ్రతియజ్ఞమునను జేతురు. అవి పశువు నుద్దేశించి చెప్పు కొన్ని మంత్రములతోఁ గూడిన క్రియలై యుండును. (పర్యగ్నికరణము అను కర్మము దర్భలకు నిప్పు నంటించి మంట యారినపిమ్మటఁ బశువునకు జుట్టును ద్రిప్పుదురు.)

పిమ్మటఁ బశువును ఖడ్గముతో విశసించుసమయ మేతేర బ్రహ్మతేజస్వియగు శునశ్శేపుని బంధించుటకే సిద్ధపడకుండిన నపుడు ఖడ్గముతో ఖండింప నెవఁ డాయత్తపడును? ఆమహాక్రూరుఁడగు 'అజీగర్తుఁడే' తనకుమారుని మఱినూఱు గోవుల నిచ్చిన యెడల నేను ఖండింతు నని వజ్రహృదయముతో బల్కెను. నూఱుగోవులను హరిశ్చంద్రుఁడీయ నజీగర్తుఁడు కుమారుని విశసింప ఖడ్గము వహించెను,

హా! ఎంతక్రూరకర్మము! "బాలున్, హాఁపదచింతా

(1) చూ॥ ఐతరేయబ్రాహ్మణము. 7, 3, 4.

శీలున్, సుగుణాలవాలు, శ్రీమన్మేధావాలున్" అజీగర్తుఁడు ఖండింపఁ దలంచెను. క్రూరత్వమునందు, అజీగర్తుఁ డధికుఁడా? మతభేదముచేఁ గుమారుని ఖండింప నెంచిన హిరణ్యకశిపుఁ డధికుఁడా? బైబిలునందుఁ జెప్పఁబడిన గురుద్రోహి యగు (ఏసుక్రీస్తును రోమనుల కప్పగించిన) పేతు రధికుఁడా? లౌభ్యముచేఁ గన్నకొడుకును మూఁడువందల గోవులకు విక్రయించి, తానె కట్టుకట్టి, తానె విశసింప ఖడ్గమునెత్తిన అజీగర్తుఁ డందఱికంటెను మహాక్రూరుఁడు కాఁడో?

శునశ్శేపుఁడు, తొలుతఁ దన్ను బంధించి, పర్యగ్నికరణానంతరము (1) "ఇతరయాగములలో పర్యగ్నికృతములగు మనుష్యుల నరణ్యమున విడువఁగలరు" అని కలదుగాన అట్లే దానెచటనైన విడువఁబడిన నెటులనో జీవింపవచ్చునని తలఁచెను. కాని, రాజసూయమునఁ దప్పక విశసింపఁ బడవలయు ననుసంశ మాతనికిఁ దెలియను. అందువలనఁ దండ్రి ఖడ్గముఁ జేఁబూనఁగానె యిట్లనుకొనెను.

(2) పిమ్మట శునశ్శేపుఁడు చూచి, హా! నన్ను మనుష్యేతర పశువులనె వధింతురా? నే నిపుడు దేవునే శరణు వేఁడెదను.

---

(1) "పర్యగ్నికృతం పురుషమారణ్యాం శ్చోత్సృజం త్యహింసయా"

(2) "అథహా శునశ్శేప ఈక్షాంచక్రేఽమానుషమివ వై మా విశసి ష్యంతి హంతాహం దేవతా ఉపధావామితి."

వధింపఁబడుటకు సిద్ధముగానుండి, కట్లచే బంధింపఁబడుచుఁ బ్రాణముపై నాస నదలక, పరమేశ్వరుని, పరమేశ్వరుని యొక్క వివిధగుణరూపులగు 'ఇంద్రాగ్ని వరుణాది' దేవతలను బలువిధములఁ బ్రార్థించెను. ఆతఁ డపుడు ప్రార్థించిన ప్రార్థనా రూపకములగు మంత్రములలో గొన్ని, ఆసేతు హిమాచలము నడుమనుండు విప్రోత్తము లిప్పటికిని, సాయంసంధ్యాసమయమునఁ బఠింపుచుండుటయే విశేషాంశము. ప్రస్తుతాంశమున కవి యంతగా నవసరము లేకుండినను హృద్యములు, పూజ్యములు నగుటచేఁ గొన్ని మంత్రార్థములనిట వ్రాయుచున్నాను.

(1) ఏవేల్పుఁ జింతును? శుభకరుఁ డగు నేదేవుని బ్రార్థింతును? తిరిగి నన్నే దేవత భూమిపై నుండనిచ్చును? నిజముఁగనేను మాతాపితరులతోఁ గూడుకొని యుండుస్థితి కలుగునా?

(2) ఓ వరుణా! నామొఱ్ఱ నాలకింపుము. రక్షణేచ్ఛచే నీ కెదురుగఁ జేయు నాస్తోత్రముల నాలకించి నన్ను సుఖవంతునిగాఁ జేయుము.

---

(1) ఋ॥ కస్యనూనం కతమస్యామృతానాం మనామహే చారు దేవస్యనామ। కోనో మహ్యా అదితయే పునర్దా త్పితరంచ దృశేయం మాతరంచ॥ ఋ. 1—24—1.

(2) ఇమం మే వరుణ శ్రుధీహవ మద్యాచ మృడయ। త్వా మవస్యురాచకే॥ ఋ. 1—25—19.

(3) బహుజనులచే స్తుతింపఁ బడు నో వరుణదేవా! స మీపమునందే మరణము గల నేను వేదవాక్కుచే నిన్ను నుతిం పుచు నాయువు నిమ్మని కోరుచున్నాను. యజమానుఁడు గూడ (హరిశ్చంద్రుఁడు) హవిస్సులచే ని న్నాయువునే కోరుచున్నాఁ డు, నీవు మాయిరువుర కోర్కెల ననాదరముతో హేళనము చేయక తెలిసికొని మాయిరువురయొక్క యాయుర్దాయము లను వృద్ధిఁ జేయుము.

ఇట్లు పెక్కువిధముల వరుణాది దేవతలను స్తోత్రము చేసి చేసి, యింకను నిట్లనుచున్నాఁడు.

(4) గొప్పవారలకు నమస్కారము, పిల్లలకు వందనము, యువకుల కభివాదనము, వృద్ధులకు జోహారు. ఓ దేవతలారా! నాకు శక్తి గలిగినయెడల (జీవించినయెడల) మిమ్ము లెన్నటికిని పరమేశ్వరుని స్తోత్రముచేయుటలో లోపము గలిగింపను.

కట్టకడకు 'ఉషస్సు' ను స్తోత్రము చేయుచుండఁ గా, పటాలునుని ఆపాదమస్తకముఁ గట్టిన కట్లు తెగిపోగా శునశ్శే

---

(3) తత్త్వాయామి బ్రహ్మణా వందమాన స్తదాశాస్తే
యజమానో హవిర్భిః। అహేళమానో వరుణేహ
బో ధ్యురుశంస మాన ఆయుః ప్రమోషీః॥ ఋ. 1-26.

(4) నమో మహద్భ్యో నమో అర్భకేభ్యో నమోయువభ్యో నమ ఆశి
నేభ్యః। యజామదేవా న్యది శక్నవామ మాజ్యాయసః శంస
మావృక్షి దేవాః॥ ఋ-1—27—13.

పుడు ప్రాణభీతిచే నెదుటనుండిన విశ్వామిత్రుని యొడిలోఁ బడి రక్షింపు మని వేడుకొనెను.

(1) శునశ్శేపుఁడు విశ్వామిత్రుని సంకతలముఁ జేరగనే శునశ్శేపుని తండ్రియగు అజీగర్తుఁడు విశ్వామిత్రునికడ కేఁగి నాపుత్రుని నాకిమ్మన,విశ్వామిత్రుఁడు నేనీయను వీనిని దేవతలే నాకిచ్చిరనెను. అప్పటినుండియే శునశ్శేపునకు దేవరాతుఁడను పేరుకలిగెను.

పిదప 'అజీగర్త, శునశ్శేపులకును;' 'శునశ్శేప, విశ్వామిత్రులకు' నైన సంవాదములును, శునశ్శేపుని విశ్వామిత్రుఁడు పుత్రునిగా నంగీకరించుటయు, విశ్వామిత్ర పుత్రు లంగీకరింపనందున, విశ్వామిత్రుఁ డట్లంగీకరింపని పుత్రులను భ్రష్టులగుఁడని శపింప, శప్తులగు వారలలోని వారె మనయాంధ్రులోకరగుటయు మొదలగు నంశము లిట నవసరములే దని వివరింపలేదు. కాని, విశసితపశువుచేఁ జేయుఁదగు కర్మకలాపము పూర్తి కాకుండుటచే హరిశ్చంద్రుని రాజసూయయాగము పూర్తి కాలేదను సందియ ముద్భవించుచున్నది.

---

(1) "అథహ శునశ్శేపో విశ్వామిత్రస్యాంకమాస సాద. సహోవాచా జీగర్తః సౌయవసిర్ ఋషే! పునర్మే పుత్రందేహీతి. నేతి హోవాచ విశ్వామిత్రో దేవావా ఇమం మహ్యామదాసతేతి. సహదేవరాతో వైశ్వామిత్ర ఆస॥

కొన్నియెడలఁ గొన్నిపశువులకు యూపస్తంభమునకు బంధించినపిమ్మట 'పర్యగ్నికరణము' అను కర్మముఁ జేసి విడుచుటయే విధియై యున్నది. ఆయంశములు ముందు వ్రాయఁబడును. రాజసూయయాగవిషయమున నట్టిపరిస్థితి (పర్యగ్నికరణానంతరము విడువవలయు నని) యెచటను లేదు. విశసింపఁబడవలయు ననియే యింతకుఁ బూర్వము వ్రాయఁబడిన యంశములచే స్పష్టపడుచున్నదిగాని, విశ్వామిత్రాదు లెట్లో యాగపూర్తిని జేసి, 'అంజస్సవము' అను నొకకర్మముఁ జేయించి, శునశ్శేప హరిశ్చంద్రు లన్యోన్యము స్పృశించునటులఁ జేయుటచే యాగము పూర్తియగుటయు, హరిశ్చంద్రునకు రోగవిముక్తియగుటయు, కలిగె నని 'ఐతరేయ బ్రాహ్మణము'న జెప్పఁబడి యున్నది. ఆయంశములు గ్రంథవిస్తరభీతిచే వ్రాయలేదు.

(1) "అజీగర్తపుత్రుఁ డగు శునశ్శేపుని వరుణుఁడు పట్టుకొనఁగా, శునశ్శేపుఁడు వరుణదేవతాకఋక్కును జూచి (ద్రష్టయై) తాను గ్రహింపఁబడిన వరుణపాశమునుండి విడుదల నొందెను."

అని కొంతభేదముతో, 'తైత్తరీయ' సంహితలో స్వల్పముగాఁ జెప్పఁబడి యుండుటమాత్ర ముదాహరింపఁ దగియున్నది.

---

(1) "శునశ్శేప మాజీగర్తిం వరుణో గృహ్ణాత్స ఏతాం వారుణీ
మపశ్యత్తయాత్మానం వరుణపాశాద ముంచత్ ॥

తైత్తిరీయ సంహిత. 5—2—1.

హరిశ్చంద్ర శునశ్శేపులఁగూర్చిన గాథలు పునరభిషేక కాలమునందు (1) బంగరుజరీతో నేసినబట్టపై 'హోత' కూర్చుండి చెప్పుచుండఁగా నట్టిబట్టమీఁదనే కూర్చుండిన యధ్వర్యుఁ డూఁకొట్టుచుండఁగా రాజసూయయాగకర్త వినవలయు ననియు, అట్లాగాధలు చెప్పినందులకు హోతకు వేయియు, అధ్వర్యునకు నూఱును, గోవులను దక్షిణగా నిచ్చుటయేగాక పై బంగరుజరీబట్టలను, రెండు వేసడములతోఁ బూన్పఁబడి రజితాలంకారములుగల రెండురథములఁగూడ పై యిరువురకు దక్షిణగా నీయవలయు ననియుఁ గొన్నివిధులు ఐతరేయబ్రాహ్మణమునఁ గలవు. ఆయంశము లిట నంతగాఁ బ్రసక్తి లేనందున వ్రాయలేదు.

పురుషమేధము

ఇట పురుషుని వధించి యజ్ఞము చేయుదురా? అను నంశముఁగూర్చి కొంచెము చర్చింపవలసియున్నది.

ప్రాచీనకాలమునందు 'పురుషమేధమె' మహోత్కృష్ట యాగమై యుండెనని వేదమువలనఁ దెలియవచ్చుటయేకాక,

---

(1) బంగరుసూత్రములతోఁ గూడిన వస్త్రమునకు 'హిరణ్యకశిపుశబ్దము' బ్రాహ్మణమున వాడఁబడెను.

అశ్వమేధయాగము పొందింపలేని మహాఫలమునుగూడ నరమేధము పొందించునని వేదము చెప్పియున్నది. (1)

మఱియు 'విధ్యర్థవాదములు' కూడ నరమేధమును బ్రోత్సాహపఱచుచున్నవి. అందుఁ గొన్ని యీక్రింద వ్రాయఁబడుచున్నవి.

(2) 'దేవతలు పురుషుని బంధించి యజ్ఞముం జేసిరి.'

(3) 'ప్రజాపతి తనయొక్క వపను దీసి యాహుతి నొనర్చెను.'

(4) 'బ్రహ్మకొఱకు బ్రాహ్మణుని విశసించుచున్నాఁడు.'

(ఇట్లిట నూటయెనుబదియార్వురను విశసించి నరమేధము నొనర్పవలయు ననుసంశము చెప్పఁబడెను.)

(5) 'దేవతలు పురుషునే పశువుగాఁ జేసి విశసించిరి.'

(6) 'బ్రాహ్మణుఁడు బ్రాహ్మణుని ఆలంభించుచున్నాఁడు.'

---

(1) చూ. శుక్లయజుస్సంహిత.

(2) "దేవా యజ్ఞ మతన్వాత. అబధ్నన్ పురుషం పశుం"

ఋగ్వేదము.

(3) "ప్రజాపతి రాత్మనో వపా ముత్ఖిదత్" తైత్తిరీయసంహిత.

(4) బ్రహ్మణే బ్రాహ్మణ మాలభతే" ఇత్యాది.

తైత్తిరీయబ్రాహ్మణము.

(5) "పురుషంవై దేవాః పశుమాలభంత" ఐతరేయబ్రాహ్మణ.

(6) "బ్రాహ్మణో బ్రాహ్మణమాలభతే" ఆప.శ్రౌ.

ఇట్టి విధ్యర్థవాద వాక్యము లనేకములు గలవు. కాని క్రమముగా నరమేధము తగ్గిపోయినది.

కలియుగమున మనకుఁ దెలిసినంతవఱకు క్రైస్తవశకము ఆఱవ శతాబ్దములనడుమ నుండిన (580_611) విష్ణుకుండిన వంశస్థుఁ డగు మాధవవర్మ పదునొకం డశ్వమేధయాగములఁ జేసి యంతటితోఁ దృప్తినందక నరమేధయాగముఁ గూడఁ జేసె నఁట !

(ఈయంశము మాధవవర్మవంశజుల శాసనములవలనఁ దెలియనగుచున్నది.)

అట్టి దారుణకార్యము చేయుటచే నచిరకాలములోనె విష్ణుకుండినరాజ్య మంతరించి తూర్పుచాళుక్యరాజ్యము స్థాపింపఁబడుటకు హేతువయ్యె నేమొ ? దాని నటుండనిచ్చి ప్రకృతాంశముఁ జూతము.

పై యంశములఁ జూడ 'రాజసూయ' యాగమునఁ బురుషపశువును విశసించుట సాధారణ మనియే స్పష్టమగుచున్నది. "నరమేధయాగమున నూటయెనుబదియార్వురు పురుషులను 'యూపస్తంభము'లకు బంధించినను [1] పర్యగ్నికృతుఁ డగు పురుష నరణ్యమున హింసింపకుండఁగ విడిచెదరు." అను శ్రుతివాక్యముచే నొక్కనిమాత్రమె విశసించి తక్కినవారి నందఱను

(1) "పర్యగ్నికృతం పురుషం మారణ్యాం శ్చోత్సృజం త్యహింసయా"

నరణ్యమున విడిచెద రనియే తెలియనగుచున్నది. మనుష్యులనే కాదు, అశ్వమేధయాగమునఁ దేఁబడిన వివిధములగు మూఁడువందలు మితిగల 'వనచర, ఖచర, జలచరా'దులలో వనచరములగు 'సింహ వ్యాఘ్రాదులను'గూడ (1) "పర్యగ్నికృతములగు నారణ్యకజంతువులను హింసింపక వనములోనె విడిచిపెట్టెదరు." అనువేదవాక్యముచేఁ గొన్నిటిని బర్యగ్నికరణా నంతరమునవిడిచిపుచ్చుటకలదు. కాని, రాజసూయ పశువగువానినిమాత్రము విశసించుటయే విధియైనట్లు శునశ్శేపుని పరిదేవన వాక్యమగు(2) "అయ్యో! మనుష్యేతరమగు పశువునువలెనె నన్ను విశసింపఁగలరు." అనుదానిచే స్పష్టము కాఁగలదు.

పర్యగ్నికరణానంతరము (అగ్నినిజుట్టునుత్రిప్పినపిమ్మట) యూప స్తంభమునకుఁ గట్టఁబడిన జంతువు నరణ్యమున విడువఁబడు శ్రౌత సాంప్రదాయమె, రానురాను, 'పిశాచ, బాలగ్రహాదులు' సోఁకినవారికి జంతువులను, మనుష్యాకారములగు పిష్టాదివిగ్రహములను, దీపాదులచే దిగఁదుడిచి, గ్రామసీమాంతమున విడుచు నాచారముగా మారినట్లు తోఁచుచున్నది.

'శాక్తేయాది' మతములలో నింకను రహస్యకృత నరపశు విశసనము నామమాత్రముగనున్న దనియే చెప్పవలసియున్నది.

---

(1) "పర్యగ్నికృతా నారణ్యా నుత్సృజంత్యహింసయా" తై-బ్రా.

(2) "అమానుషమివ మా విశసిష్యంతి; హంత" ఐ. బ్రా.

ప్రసక్తానుప్రసక్తమగు శునశ్శేపుని గాథచే, రాజసూయాంగమైన సోమయాగము ముగింపఁబడినపుడు చేయఁబడినట్టిదియు 'సరపశువిశసనముతోఁ గూడినట్టిదియు నగు 'ఉదవసానీయము' అనునిష్టి జరుగునని తెలియఁగలదు. అది ముగియగనె 'పునరభిషేచనము' అనుకర్మము జరుగును. 'ఉదవసానీయేష్టి' ముగియగనే రాజునకు బ్రాహ్మ్యముపోయి రాజత్వప్రాప్తి కల్గును. పునరభిషేచనకర్మము రాజశ్రీవితోఁ గూడుకొనిన యుత్కృష్ట కార్యము, అది యెట్టిదో చూతము.

పునరభిషేచనము

'ఉదవసానీయేష్టి' ముగియునప్పటి కిక్రిందివస్తువుల నధ్వర్యుఁడు సిద్ధపఱచి యుంచవలెను.

" [1]మేడికఱ్ఱతో లోడితేఁడు, ఎత్తుగల నాలుగుకోళ్లును, అడుగుయెత్తుగల పైభాగములు గలిగి, నలుచదరమై, ముంజిగడ్డి (ఒకవిధమగు పేము) తో నల్లఁబడిన సింహాసనమును (ఆసందిని) (1) వ్యాఘ్రచర్మమును (2) మేడికఱ్ఱతోఁజేయఁబడిన పాత్రములలో [2] పెరుఁగు, తేనె, నేయి, ఎండలో కురిసిన

---

(1) శుక్లయజుస్సంహితలో 'చంద్రకఱ్ఱతో నాసందిని జేయవలయు నని కలదు.

(2) శుక్లయజుస్సంహితలో 'మోదుగ, మేడి, మఱ్ఱి, రావి, కఱ్ఱలతో జేయఁబడిన పాత్రములలో వివిధనదులనుండియుఁ గొనిరాఁబడిన జల

వాననీరు, లేఁబచ్చిక, లేఁత మొక్కలు, సుర, దూర్వములు, అనువస్తువుల నుంచి 'స్ఫ్యము' అనుకఱ్ఱతోఁ జేయఁబడిన పనిముట్టుతోఁ గొన్ని రేఖలు గీసి, ఆగీతలపైని ఆసింహాసనముయొక్క వెనుకకాళ్లు రెండును, 'అంతర్వేది' యందును, ముందుకాళ్లు రెండును బహిర్వేదియందును నిలుచునట్లమర్చి (అంతర్వేది, బహిర్వేదులనునవి యజ్ఞశాలలోఁ గొన్నివిధుల కేర్పఱచిన నలుచదరములై యలంకృతములగు స్థలములకుఁ బేరు.) ఆసింహాసనముపై వ్యాఘ్రచర్మముఁ బఱువవలెను. ఆచర్మముపై బంగరుకూడ నుండవలెనని 'కాత్యాయనుఁడు' చెప్పుచున్నాఁడు.

పిమ్మట మహారాజు కొన్నిహోమాదిక్రియల నొనర్ప ఋత్విక్కులు కూడఁ గొన్నిక్రియలను నడిపినపిమ్మట రాజు సింహాసనముపై నెక్కుచు నీక్రింది మంత్రార్థముఁ జెప్పును. (1)"నేను దేశపాలనముకొఱకు, ధర్మపాలనముకొఱకు, దేశమున భోజ్యపదార్థాభివృద్ధికొఱకు, ఇతరులకు నారాజ్యము లోఁబడ కుండుట కొఱకు, ఇతరరాజులకంటె నధికుఁడనుగా నుండుటకొఱకు, పరమేశ్వరలోక ప్రాప్తికొఱకు, పరలోకమునందును నిత

ముల నుంపవలయుననియు మోదుగకఱ్ఱతోఁ జేయఁబడిన పాత్రమునందు 'సరస్వతీనదీ' జలమును ప్రత్యేక ముంపవలయు ననియుఁగలదు.

(1) రాజ్యాయ సామ్రాజ్యాయ భౌజ్యాయ స్వారాజ్యాయ వైరాజ్యాయ పారమేష్ఠ్యాయ రాజ్యాయ మహారాజ్యాయాధిపత్యాయ స్వావశ్యాయ ఆతిష్ఠా యారోహామి"

రులకంటె నధికుఁడనుగా నుండుటకొఱకు, నన్ను నేనె వశము చేసికొనుటకొఱకు (ఇంద్రియజయముకొఱకు) సింహాసనము నెక్కుచున్నాను."

ఇట్లని ప్రజల హర్షధ్వనులు చెలరేఁగ రాజు సింహాసనము నధిష్ఠించి యెడమకాలి తొడపైఁ గుడికాలి పిక్కను జేర్చి కూర్చుండును.

రాజు సింహాసనము నధిష్ఠించి కొన్ని దేవతాప్రార్థనామంత్రములను బఠించినపిమ్మట, పునరభిషేకముఁ జేయు ఋత్విక్కు 'ఆతపవర్షోదకము' గల మేడికఱ్ఱగిన్నెను జేతఁబూని, కొన్ని యుదకశాంతిమంత్రములఁ జెప్పి, కొన్నిటిని మహారాజుచేఁ జెప్పించి, మేడిరెమ్మను రాజుశిరస్సున కడ్డుగ నుంచి క్రిందిమంత్రముఁ జెప్పుచు నభిషేకించును. (1)

(2) "ఓరాజా! ప్రజాపతి యేయుదకములచే 'ఇంద్రుని, సోముని, వరుణుని, మనువును' అభిషేకించెనో, ఆయుదక

---

(1) శుక్లయజుస్సంహితలో 'ఆతపవర్షోదకము' నకు మారు 'సరస్వతీజలము' చెప్పఁబడెనని కలదు. అధ్వర్యుపురోహితులు పలాశపాత్రములోని సరస్వతీజలముతోను, ఉదుంబరపాత్రములోని జలముతో నధ్వర్యువ్యతిరిక్తులగు నితర ఋత్విక్కులును, న్యగ్రోధపాత్రోదకముతో రాజబంధువును, అశ్వత్థపాత్రోదకముతో మఱియొక క్షత్రియుఁడును ఒకవైశ్యుఁడును రాజునభిషేకింతురని కలదు.

(2) యాభిరింద్ర మభిషించ త్ప్రజాపతిః సోమం రాజానంవరుణం మనుం తాభిరద్భి రభిషించామి త్వామహం రాజ్ఞాం త్వమధిరాజో భవేహ"

ములచే నిన్నభిషేకించుచున్నాను గాన నీవు రాజులలో నధిరాజువు కమ్ము"

పిమ్మట 'దధి, మధు, ఘృతాదులం' గొన్ని మంత్రములం జెప్పుచు రాజుపై ప్రోక్షించును, దూర్వాదులతోం గూడం గొన్ని విధులం జేయుదురు.

తరువాత సింహాసనస్థుండగు రాజు నుద్దేశించియుం బ్రజల నుద్దేశించియు నధ్వర్యుండు కొన్ని యంశములం జెప్పును.

(ఋగ్వేద, శుక్లయజుర్వేద, అథర్వవేదములలో సింహాసనము నెక్కినరాజును గూర్చి చెప్పిన యంశము లింపుగ నుండునుగాన, కొన్నిటి నిట వ్రాయుచున్నాను.

ఋగ్వేదము

(1) ఓరాజా! నీమాతృదేవత నిన్ను గొప్పవారికంటె గొప్పవానినిగాను, ప్రజలను ధర్మముగాం బాలించువానినిగాను, కనుటచే నామె ధన్యురాలు సుమా!

శుక్లయజుస్సంహిత

(2) ఓదేవతలారా! మీ రీరాజును శత్రువులు వైచు

(1) ఋ. మహాస్త్వం త్వా మహీనాం సమ్రాజం చర్షణీనాం
దేవీజని త్ర్యజీజన ద్భద్రాజని త్ర్యజీజనత్॥

(2) ఇమందేవా అసపత్నం సువధ్వం మహతేక్షత్రాయ మహతేజ్యేష్ఠ్యాయ ఇమమము మముష్యపుత్రమస్యైవిశే॥ 11—3—2.

బాణములను సహించి శత్రువులను నశింపఁజేయువానినిగాను, క్షత్రియులలో నధికునిగాను, ప్రజలనందఱిని బాలించు వానిని గాను జేయుఁడు. ఈరాజుయొక్క తలిదండ్రులు ప్రజాపాలన దక్షుఁడగు నీతనిఁ గనిన ట్లీతఁడును తనవలె సమర్థుఁడగు పుత్రుని గనున ట్లాశీర్వదింపుఁడు.

(1) ఓ కురుదేశీయులారా! ఈతఁడు మీరాజు; ఓ పాంచాలదేశీయులారా! ఈతఁడు మీరాజు; బ్రాహ్మణుల మగు మాకు సోముఁడు రాజు.

(2) ఓ రాజా! నాగులు నశించి యున్నారుగాన, ప్రాగ్దిక్కు నధిరోహింపుము. గాయత్రి నిన్ను రక్షించుఁగాక.

ఈ మంత్రములలో మొదటిదానియందు కురు, పాంచాల దేశపుప్రజల నుద్దేశించి యధ్వర్యుఁడు చెప్పు వాక్యముచేతను రెండవ మంత్రములో 'దందశూకములు' నశించినవి గాన ప్రాగ్దిక్కు నధిరోహింపుమని రాజు నుద్దేశించి యధ్వర్యుఁడు చెప్పుటచేతను, ఈ మంత్రములు ధర్మజుని రాజసూయ యాగమునఁ గాని, జనమేజయుని రాజసూయయాగమునఁ గాని యావిర్భవించినవా? యని తోఁచును.

---

(1) ఏష వః కురవో రాజైష వః పాంచాలా రాజా;
సోమోస్మాకం బ్రాహ్మణానాగ్ం రాజా. 11—6—3.

(2) ఆవేష్టా దందశూకాః ప్రాచీమారోహ।
గాయత్రీ త్వాఽవతు. 11—5.

(ధర్మజుని రాజసూయయాగమునకుఁ బూర్వమె 'ఖాండవవన'దహన మగుటయు, అం దర్జునునిచే 'అశ్వసేనాది'నాగులలోఁ గొంద ఱోడి యన్యస్థలముల కేఁగుటయు మఱికొందఱు నశించుటయుఁ గల్గినది.

జనమేజయుని రాజసూయయాగమునకుఁ బూర్వమునను, 'సర్పయాగము' అనుపేరితో ననేకులగు నాగులు జనమేజయునిచే హతముచేయఁబడుటయుఁ బ్రసిద్ధాంశము.

మఱియుఁ బై మంత్రములుగల 'శుక్లయజుస్సులు' 'ఉద్దాలకుని' చే యాజ్ఞవల్క్యున కుపదేశింపఁ బడెనని 'శతపథ బ్రాహ్మణ, బృహదారణ్యకోపనిషత్తుల'లోని 'వంశ' బ్రాహ్మణములు చెప్పుచున్నవి. యాజ్ఞవల్క్యుని గురువగు 'ఉద్దాలకుఁడు' పాండవపురోహితుఁడగు ధౌమ్యుని శిష్యుఁడని మహాభారతముననే కలదు. యాజ్ఞవల్క్యుఁడు జనమేజయుని యజ్ఞములలో 'బ్రహ్మత్వము'ను వహించె నని 'మత్స్యపురాణమునఁ' గలదు. పై కారణములచేఁ బై మంత్రము లాకాలముననే యావిర్భవించెనని చెప్పవలసియున్నది. ముందీయంశమింకను జర్చింపఁబడును.

అథర్వవేదము

(1) (అధ్వర్యుఁడిట్లు చెప్పుచున్నాఁడు) "ఏవఁడు భూ

(1) భూతో భూతేషు పయ ఆదధాతి. స భూతానా మధిపతి ర్బభూవ. తస్యమృత్యుశ్చరతి రాజసూయం. స రాజా రాజ్య మనుమన్యతా మిదమ్. 4—8—1.

తములయందు భూతమై, వానిసారమును గ్రహించెనో, ఆరాజే భూతముల కధిపతియై యున్నాఁడు. అట్టిరాజు యొక్క రాజసూయమునుగూర్చి మృత్యువుకూడ వచ్చును.ఆరా జీరాజ్యము నంగీకరించుఁ గాక!

(1) ఓ శత్రుహంతకా! బలవంతుఁడా! మిత్రవర్ధనా! రాజా! దేవతలు నీకు బలమును గలిగించి నిన్నాశీర్వదించిరి. నీవీరాజ్యము నేలుటకు వెనుదీయక మాయెదుటికి రమ్ము.

(2) "పులిచర్మముపై నెక్కిన యోపులీ! భూమియందన్ని దిక్కులను విక్రమింపుము. నీవరిపాలనమును సర్వజనులు గోరుచున్నారు. స్వర్గమునందలి యుదకముతో భూమిని దడుపుము. (జనులకు స్వర్గసుఖముల నొసగూర్చుము.)

(3) పులియందుండిన (పులిచర్మముపై నున్న) సింహమును, (రాజసింహమును) జనులు చుట్టుకొని సౌభాగ్యముతో ఉత్సాహమును గల్గించుచున్నారు. మంచినీటి ప్రవాహము

---

(1) అభిప్రేహి మాపవేన ఉగ్రశ్చేత్తా సపత్నహా! ఆతిష్ఠ మిత్రవర్ధన! తుభ్యందేవా అధి బృవన్॥ 4—8—4.

(2) వ్యాఘ్రో అధివై యాఘ్రే విక్రమస్వ దిశోమహీః విశస్త్వా సర్వా వాంఛంత్వాపోదివ్యాః పయస్వతీః. 4—8—4.

(3) ఏనా వ్యాఘ్రం పరిషస్వజానాః సింహం హిన్వంతి మహతే సౌభగాయ సముద్రంన సుభువ స్తస్థివాంసం, మర్మృజ్యంతే ద్వీపిన మప్స్వంతః॥ 4—8—7.

సముద్రమును బొందినయెడల నాసముద్రమును పెద్దపులి నీరి లోఁ బ్రవేశించినయెడల నాపులిని, జనులు నుతింతురుగదా.

ఐతరేయబ్రాహ్మణమునందు, 'జాబాలుఁడు, ఉద్దాలకుఁడు' అను మహర్షులు పునరభిషిక్తుఁడగు రాజునుగూర్చి కొన్నియంశములఁ జెప్పిరని కలదు. అం దుద్దాలకుఁడు మహారాజు సాక్షాత్తు పరమేశ్వరుఁడే యనినాఁడు. ఆయంశము లిట నప్రస్తుతమని విడువఁబడెను.

రాజసూయ యాగకర్త సురాపానముఁ జేయుట.

పునరభిషేక సమయమునకు సిద్ధపఱచిన ద్రవ్యములలో 'సుర' యొకటి యని చెప్పఁబడెను. ఆమద్యము యొక్క ప్రాశస్త్య మెట్టిదో, దాని నెట్లుపయోగింపవలెనో, ఇట్లు వ్రాయఁబడుచున్నది,

(1) సుర (మదముఁ గలిగించునదిగాన) క్షత్రరూపమును, (వ్రీహ్యాద్యంకురములవలనఁ గలిగినది గాన) అన్నరసము నై యున్నది. ఈకర్మమునందు క్షాత్రమునే ధరింపుచున్నది.

(2) "పిమ్మట (అధ్వర్యుఁడు) రాజసూయయాగకర్త కొఱకాతని హస్తములందు సురాయుక్తమగు కంచుపాత్రము నుంచవలెను."

---

(1) "అథ యత్సురాధనతి. క్షత్రరూపం.
తదథో అన్నరసః క్షత్రరూప వేవాస్మిం స్తద్దధాతి"

(2) అథాస్మై సురా కంసం హస్త ఆదధాతి"

మహారాజు చేతికి సురాపాత్రము నిచ్చి యిట్లధ్వర్యుఁడు చెప్పును.

(3) "సోమముతో సమానమగు నో సురా! రుచికరమైన ట్టియు, మదకరమైనట్టియు, నీధారచే నీయజమానుని శోధింపుము. నీవింద్రునిపానముకొఱకు సోమముచే నభిషేకము నొందితివి గదా!"

అధ్వర్యుఁ డిట్లు చెప్పి క్రిందియంశములతోఁ దాను శాంతిని జెప్పుచు మహారాజుచేఁ గూడఁ జెప్పించును.

(4) "ఓ సురాసోమములారా! దేవతలు హృదయాకాశమందు మీకు వేర్వేఱు స్థానముల నేర్పఱచియున్నారు. కాన, మీరు హృదయమునంగలసియుండక, వేఱుగా నియుండుఁడు. (అట్లు కలిసిన సోమమునకు హానికలుగును) ఓసురా! నీవు బలవంతురాలవు. ఈసోముఁడు రాజు. కాన మీరుభయులును హృదయమునందలి మీమీస్థానములఁ బ్రవేశింపుఁడు. ఈపానముఁ జేయువానిని హింసింపకుఁడు.

---

(3) స్వాదిష్ఠయా మదిష్ఠయా పవస్వ సోమధారయా! ఇంద్రాయ పాతవే సుతః"

(4) "నానాహి వాం దేవహితం సదస్కృతం! మాసం సృక్షాథాం పరమే వ్యోమని, సురా త్వమసి శుష్మిణీ, సోమ ఏష రాజా, మైనం హింసిష్టం స్వాం యోని మావిశన్తా ఇతి"

(1) “ రాజు కాంస్యపాత్రములోని సురను గొంతభాగముఁ ద్రావి మిగిలినదానిని దనకు ముఖ్యమిత్రునకుఁ ద్రావనిచ్చును. ఏకపాత్రములోని సురను ద్రాగుటయే మిత్రత్వలక్షణము. అట్లు త్రాగినయెడల వారికన్యోన్యమైత్రియు, వారియందు సురకు మైత్రియు నుండును. ”

సురాపానానంతరము రాజు సింహాసనమునుండి దిగి ‘నమో బ్రహ్మణే’ అను వాక్యమును మూఁడుసారులు చెప్పి ‘బ్రహ్మ’ అనుఋత్విక్కునకు స్వజయముఁ గోరుచు గొప్పనీయవలయును. (అప్పుడే ప్రజలకే వేని బహుమానముల నిచ్చు సూచనయుఁ గలదు.)

పిమ్మట రాజు శత్రుజయమును తన కారోగ్యమును గోరుచు యాగశాలనుండి స్వగృహమున కేఁగి ‘గృహ్యాగ్ని’లో గూడ ‘శత్రు, రోగాది’ పరిహారములకై కొన్ని యాహుతులను వేల్చును.

ఆకర్మాంతమునందు ఋత్విక్కు లాశీర్వదింతురు. ఇది ‘ఆశ్వలాయనసూత్రము’ ననుసరించిన రాజసూయయాగపద్ధతి.

---

(1) పీత్వా యం రాతిం మన్యేత తస్మా ఏనాం ప్రయచ్ఛేత్ తద్ధి మిత్రస్వరూపం. మిత్ర ఏవైనాం తదంతతః ప్రతిష్ఠాపయతి. తథాహి మిత్రే ప్రతితిష్ఠతి ”

రాజసూయయాగకర్త జూదమాడుట.

శుక్లయజుర్వేదీయులగు రాజులకు (కాత్యాయన సూత్రికులకు- వీరే కురు పాంచాల దేశీయులు) పునరభిషేకానంతరము రథారోహణవిధి చెప్పఁబడియున్నది.

(1) 'అగ్నిచయనమునందును, వాజపేయమునందును' ఎట్లు యజమాని రథము నెక్కవలయునో, అట్లే రథము నెక్కవలయును." (రాజరథారోహణాదివిధు లిట నప్రస్తుతమని విడువఁబడెను.)

రాజకీవితో రథముపైఁ గూర్చుండి ధనుర్ధరుఁడై కొంచెముమేర మిత్రామాత్యులచేఁ బొగడఁబడుచు నేఁగి యొప్పటిస్థలమునకు వచ్చి రథమునుండి దిగి నూటికి మించిన బంగరునాణెములను స్పృశించవలెను.

(2) "పిమ్మట రాజు సింహాసనమునఁ గూర్చుండఁగా 'అధ్వర్యుఁడు' బంగరునగిషీగల యైదు 'పాచికలు' తెచ్చి రాజు చేతికీయవలయును."

రాజుదూత స్థానమునఁ గొన్ని బంగరు నాణెముల నుంచి యొక హోమముఁ జేసినతరువాతను ప్రధాన ఋత్విక్కులు నల్వురును (అధ్వర్యుఁడు, మొదలగువారును) రాజు

---

(1) "అగ్నిచయనే వాజపేయే యథా రథారోహణం కృతం తద్వ దత్రాపి రథమారోహేత్"

(2) "అభిభూ రిత్యస్మై పంచాక్షా న్ప్రణిధాయేత్"

యొక్క పురోహిత పుత్రుఁడును, ఆయాస్థానముల నీక్రింది పేరులు రాజుచేఁ బెట్టించుకొని తిరిగి రాజునకే యాగుణముల నారోపించి చెప్పుచుఁ గూర్చుందురు.

(1) నీవు బ్రహ్మవు; నీవు సవితవు; నీవు వరుణుఁడవు; నీ వింద్రుఁడవు; నీవు రుద్రుఁడవు; నీవు ప్రియంకరుఁడవు; అని రాజు ప్రధాన ఋత్విక్కులును, పురోహిత పుత్రునకును, (ప్రియంకరుఁడ ననునది పురోహిత పుత్రున కిడిన నామము) నామములు నుంచఁగా, వారు రాజా! నీవు యజ్ఞదీక్ష నొందితివి గాన నీవే బ్రహ్మ వైతివి. నీ వమోఘానుశాసకుఁడవుగాన నీవే సవితవు. అనిష్టవారకుఁడవుగాన నీవే వరుణుఁడవు. ప్రజాబలము గలవాఁడవుగాన నీవే యింద్రుఁడవు. సుఖవంతుఁడవుగాన నీవే రుద్రుఁడవు. విస్తారమగు శ్రేయస్సుల నిచ్చువాఁడవుగాన నీవే ప్రియంకరుఁడవు. అని ఋత్విక్పురోహితపుత్రులు రాజును నుతింతురు. (పిమ్మట సుహృద్ద్యూతము జరుగును.)

సౌ త్రా మ ణీ య జ్ఞ ము

ఆశ్వలాయన సూత్రికులు రాజసూయయాగానంతరము సౌత్రామణీయజ్ఞముఁ జేయవలయునని చెప్పఁబడలేదుగాని "ఆపస్తంబ, కాత్యాయన, సత్యాషాఢ" సూత్రికులు 'రాజసూయ

(1) "బ్రహ్మన్త్వం బ్రహ్మాసి. సవితాసి సత్యప్రసవో వరుణోసి సత్యౌజాః ఇంద్రోసి విశౌజాః రుద్రోసి సుశేవః ప్రియకర శ్రేయస్కర భూయస్కరేతి."

యాగమునకు' అంగయజ్ఞముగా "సౌత్రామణీయజ్ఞమును" జేయవలయు ననిరి. సౌత్రామణినిగురించి తైత్తరీయసంహిత లో నిట్లు కలదు.

(1) "రాజసూయయాగమునందును, అగ్నిచయనము నందును, లతాత్మకసోముఁడు బహువిధములుగా ఖండింపఁబడునుగాన, తద్దోషపరిహారముకొఱకు 'సౌత్రామణి' అను యజ్ఞముఁ జేయవలయును."

'సౌత్రామణీ, బృహస్పతి' సవములు కాలవిధాయక యజ్ఞములుగాను, అగ్నిచయన, రాజసూయములకు, సౌత్రామణియు, వాజపేయమునకు బృహస్పతిసవనమును అంగయజ్ఞములుగానుగూడ నుండును. ఆచర్చ యిట నప్రస్తుతము గాని, సౌత్రామణీయజ్ఞమునందు 'అన్నముతో' బియ్యపుపిండిని గలిపి నిలవయుంచి పిండగా వచ్చు ద్రవ్యము (దానిని 'పైష్టి' యందురు.) హోమముచేయఁబడుటయు, హుతశేషమును యజమానుఁడు, కొందఱుఋత్విక్కులు, భక్షించుటయు, ఆమదకర

---

(1) (వీతత్) వై రాజసూయస్వరూపం......యశ్చరాజసూయేనే జానస్య యశ్చాగ్నిచిత ఇన్ద్రియస్యసుషువాణస్య దశధేంద్రియం వీర్యం పరాప తత్తద్దేవా స్సౌత్రామణ్యా సమభరం త్సౌయతేవా ఏషయోగ్నించినుతే. గ్నించిత్వా సౌత్రామణ్యా యజే తేంద్రియమేవ వీర్యగ్ సంభృత్యాత్మం ధత్తే" తై. సం॥ 5-6-3-14.

ద్రవ్యమునందు బదరీ ఫలములనూరవేయుటయుఁ గలదని 'కాత్యాయన' శ్రౌతసూత్రములవలనఁ దెలియనగుచున్నది.

పైనుదువఁ బడిన 'పైష్టి' సురావిశేషమె! మఱియు ఐతరేయబ్రాహ్మణమునఁ జెప్పఁ బడిన 'సుర' వరిధాన్యము మొదలగువానిని మొలకఁగట్టి తీయఁబడినదని 'సాయణాచార్యులవారు' వ్రాసియున్నారు. ఎట్లయినను రాజసూయానంతరము మహారాజు మద్యపానమును మతముపేరితో జేయుట విధ్యుక్తమనియుఁ గొందఱిమహర్షులమతమున మద్యపానమేగాక, ద్యూతముకూడ విధియనియు స్పష్టమగుచున్నది. ద్యూతమెట్లుండిన ను, మద్యము 'శ్రౌతకర్మములందు, తాంత్రికకర్మములందు, వైద్యక్రియలయందు; విధిగావాడుకొనఁబడినది. అందువలననే మనుస్మృతి—(1) 'మాంసభక్షణమునందును, మద్యపానమునం దును, మిథునకర్మమునందును దోషములేదు. అది జంతుసాధారణధర్మమే; కాని మానుటమాత్రము మహాఫలము.' అని చెప్పెను.

మద్యపానమున కమితత్వముకూడ తాంత్రికగ్రంథములు చెప్పినవి.

---

(1) న మాంసభక్షణే దోషో నమద్యే నచ మైథునే।
ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలం॥ మనుస్మృతి.

(1) త్రాగితాగి, భూమిపైఁ బడువఱకుఁ దాగి, తిరిగిలేచి త్రాగినవానికి జన్మరాహిత్యము కలుగును.

'చరక, బాహటాది' గ్రంథములు వ్యక్తిభేదము ననుసరించి మద్యపానార్హతానర్హతలను నిరూపించినవి. పై వ్రాయఁబడిన మద్యములు 'తాడి, ఈఁదు' చెట్లనుండి తీయఁబడిన మద్యములు కావు. 'మదిరార్ణవము' అను గ్రంథమునఁ బదునాలువిధము లగుమద్యములఁ గూర్చి చెప్పఁబడియున్నది. కాని, పరిస్కృతమునందమితముగాఁ బ్రభుత్వమున కాదాయముఁ గల్గించునదియు, బీదవారే హెచ్చుగ నుపయోగించునదియు నగు 'మద్యము' 'తాడి, ఈఁత' చెట్లనుండి వచ్చు మద్యమే యైయున్నది. దీనిని మూఁడేండ్లలో నరికట్ట ప్రభుత్వము (కాంగ్రెసు) ప్రతిజ్ఞ నూనినది. మూఁడు కాదు—ముప్పదియేండ్లకు సురాపానమును నివారించినను మిగుల సంతసమేకాని, ఇంతకుఁ ముందు వ్రాయఁబడిన 'పైష్టి' మొదలగు మద్యము లిప్పటి కల్లుయొక్క స్థానము నాక్రమించునేమో యనియు, విదేశీయులచేనేర్పఁబడి పాశ్చాత్య వర్తకసంఘములకు లాభముఁ గల్గించు 'టీ, కాఫీ' పానము లతిశయించునేమో యనియు భీతి కలుగుచున్నది.

---

(1)శ్లో॥ పీత్వాపీత్వా పునఃపీత్వా యావత్పతతి భూతలే।
పునరుత్థాయ వై పీత్వా పునర్జన్మ నవిద్యతే॥ కులార్ణవతంత్ర.

భగ్నమైన మద్యపాన నిషేధశాసనకథ

మహాభారతమునందలి మౌసలపర్వమున, సురాపానము చేసినవారిని శూలారోపణముఁ జేయ 'ఉగ్రసేనమహారాజు' ద్వారకాపురిలో శాసించుటయేగాక, శ్రీకృష్ణ, బలరాముల యిండ్లయందైనను నాశాసనము వర్తించు నని చెప్పినను, స్వల్పకాలములోనె 'బలరామ, సాత్యకి, కృతవర్మాదులు' శ్రీకృష్ణునెదుటనె ద్వారకాపురి బహిఃప్రదేశమునఁ దెగఁద్రావి నట్లును, ఆమధుపానమత్తతచేతనె సాత్యకి కృతవర్మం దెగవ్రేయ యాదవు లన్యోన్యకలహమున హతులైనట్లును గలదు.

ఈశ్వరానుగ్రహమునఁ బ్రస్తుత ప్రభుత్వపు మధుపాన నిషేధశాసనము పైరీతిని వ్యర్థము గాకుండుఁగాక !

మఱియు దేశీయులగు కల్లుగీఁతగాండ్రకు నష్టమును గల్గించి విదేశీయులకు లాభముఁగల్గించు 'కాఫీ, టీ' పానముల కీ శాసనము ప్రోత్సాహ మొసఁగకుండుఁగాక !

ప్రసక్తాను ప్రసక్తముగ వచ్చు నితరాంశములను విడిచి, ప్రస్తుతమగు రాజసూయ యాగాంశములఁజూతము. రాజసూయ యాగమును విద్వాంసులైన ఋత్విక్కులు చేయించకపోయిన యెడల యజమానుఁడు నష్టపడు ననియు, అట్లుకాక మంచి విద్వాంసులు చేయించినయెడల మహారాజునకు మహావిజయములు లభించుననియుఁ జెప్పఁబడెను. ఇందులకు 'పరిక్షిత్తు' పుత్రుఁడగు జనమేజయునివాక్యములు 'ఐతరేయబ్రాహ్మణమున' నిట్లుకలదు.

(1) అవిద్వాంసులైన ఋత్విజులు రాజసూయయాగ
ముఁజేయించినయెడల 'కిరాతులు, దొంగలు, పాపాత్ములు'
ధనికుని గ్రహించి యరణ్యమునందు గోతిలోఁ బడద్రోసి ధన
ము నపహరించినట్లు రాజున కపజయముఁ గలుగురీతిఁ జేయించి
యపకారముఁ జేసి ధనము నపహరింతురు. విద్వాంసులైన
ఋత్విక్కులే నాచే యజ్ఞముఁ జేయించుటచే నేను ద్వంద్వయు
ద్ధమునందును, సేనతోఁ గూడిన యుద్ధమునందును, భయము
లేకుండగ శత్రువులతోఁ బోరి శత్రువులను జయించుచున్నాను.
శత్రువులు ప్రయోగించిన దివ్యాస్త్రములుగాని, మనుష్యకృత
ములగు నస్త్రములుగాని, నన్ను బాధింపలేవు. నేను సర్వభూ
మండలము నేలుచు సంపూర్ణాయుర్దాయము నొందఁగలను.
అని విద్వాంసుఁడైన పరిక్షిత్పుత్రుఁడగు జనమేజయుఁడు
చెప్పెను—

(1) అథహ తంవ్యేవ కర్షంతే. యథాహవా ఇదం నిషాదావా, సేలగా
వా, పాపకృతోవా, విత్తవంతంపురుష మరణ్యే గృహీత్వా కర్త
మన్వస్య విత్తమాదాయ ద్రవం త్యేవమేవ తమృత్విజో యజమానం
కర్తమన్వస్యవిత్తమాదాయ ద్రవంతి. యమనేవంవిదో యాజయం
త్యేతద్ధ స్మవై తద్విద్వానాహ జనమేజయః పరిక్షిత ఏవంవిదం
హివై మామేవం విదో యాజయంతి. తస్మాదహం జయామ్యభీత్వా
రీం సేనాం. జయామ్యభీత్వర్యా సేనయా నమా దివ్యా నమానుష్య
ఇషవ ఋచ్ఛం త్యేష్యామి సర్వమాయుః సర్వభూమి ర్భవిష్యా
మీతి. ఐతరేయబ్రాహ్మణ.

ఇంతకుఁ బూర్వము 'మహాభారతము' నకుఁ బంచమవేదత్వమెట్లు కలిగెనో యాయంశమును, రాజసూయయాగమున నేయేయంశము లెట్లు జరుగునో యాయంశములను, నాతివిపులముగాఁ జర్చింపఁబడెను.

ఇఁక మహాభారతమున రాజసూయ యాగాంశములెట్లు విపులముగా వివరింపఁబడెనో యది వ్రాయఁబడును.

ఇది
శ్రీ కౌండిన్యగోత్రపవిత్రుఁడును పెండ్యాలవంశజుఁడును,
రామాంబా వేంకయాహ్వయుల ప్రథమపుత్రుఁడును,
'వ్యవసాయ, మహాభారత, పరిక్షిచ్చరిత్రాది'
బహుగ్రంథకర్తయు నగు వేంకట సుబ్ర
హ్మణ్యశాస్త్రిచే రచింపఁబడిన
'రాజసూయ రహస్యము'
నందు ప్రథమభాగము.

శ్రీ శ్రీ శ్రీ

ధర్మజరాజసూయము.

ద్వితీయభాగము.

—:0:—

దృశ్యమాన మహాభారతము 'జయ, భారత' గ్రంథరూపముల నొంది, తుదకు మహాభారత గ్రంథరూపముగాఁ బరిణమించిన దనియు, తుదిగ్రంథమునకే పంచమవేదత్వము కలిగినదనియు నిదివఱకు వ్రాసియున్నాను. పై మూఁడు గ్రంథరూపములకును మూఁడు కథానుక్రమణికలు ఆదిపర్వముననె మూఁడు విధములుగాఁ గలవు. అందు 'జయ'మను నితిహాసరూపమునకు అఱువది యొక్కవ యధ్యాయమున నేఁబది శ్లోకములును, భారతమనుదానికి మొదటి యధ్యాయములో నూటపదునేడవ (117) శ్లోకము మొదలు రెండువందల యిరువది మూఁడవ (223) శ్లోకాంతమువఱకునుగల నూటయాఱు (106) శ్లోకములును మహాభారతమను తుది గ్రంథమునకు రెండవ యధ్యాయమున నెనుబది తొమ్మిదవ (89) శ్లోకము మొదలు మూఁడువందల యఱువది తొమ్మిది (369) శ్లోకము వఱకును గల రెండువందల యెనుబది శ్లోకములును (280) అనుక్రమణికలై యున్నవి. అనఁగా, ఏకోత్తరాభివృద్ధిగా గాథలు పెరిగియున్నవనుట! ఇందు ధర్మజుని రాజసూయయాగపు గాథలును, దానికి సంబంధించి పూర్వోత్తరములఁ గలిగిన గాథలును

(ఇంద్రప్రస్థ నిర్మాణము మొదలు సుహృద్ద్యూతాంతమువఱకు) నెట్లు వృద్ధి నొందెనో చూతుము.

—మొదటి రూపము.—

(1) పాండవు లంతటను రత్నములను సంపాదించి, ఇంద్రప్రస్థమును నిర్మించి యనేక సంవత్సరము లట నివసించిరి. ధర్మప్రధానులు సత్యవ్రతపరాయణులు నగుచు, వారు శస్త్ర ప్రతాపముచే శత్రురాజులను స్వాధీనపఱచుకొనిరి... ఆ కాలమున భీముఁడు ప్రాగ్దిక్కును, బీభత్సుఁ డుత్తరదిశను, నకులుఁడు

---

(1) శ్లో॥ నగరం ఖాండవప్రస్థం రత్నాన్యాదాయ సర్వశః।
తత్ర తేన్యవసన్ పార్థాః సంవత్సరగణాన్ బహూన్॥
వశే శస్త్రప్రతాపేన కుర్వంతో న్యాన్మహీభృతః।
ఏవం ధర్మప్రధానాస్తే సత్యవ్రతపరాయణాః॥
...... అజయద్భీమ సేనస్తు దిశం ప్రాచీం మహాయశాః।
ఉదీచీ మర్జునో వీరః ప్రతీచీం నకులస్తథా।
దక్షిణాం సహదేవస్తు విజిగ్యే పరవీరహా॥
ఏవంచక్రు రిమాంసర్వే వశే కృత్స్నాం వసుంధరాం।
...... తతో నిమిత్తే కస్మింశ్చి ద్ధర్మరాజో యుధిష్ఠిరః।
వనం ప్రస్థాపయామాస తేజస్వీ సత్యవిక్రమః।
ప్రాణేభ్యోపి ప్రియతరం భ్రాతరం సవ్యసాచినం॥
...... సవై సంవత్సరం పూర్ణం మాసంచైకం వనే వసత్॥
తతో గచ్ఛ ద్ధృషీకేశం ద్వారవత్యాం కదాచన।
లబ్ధవాం స్తత్ర బీభత్సు ర్భార్యాం రాజీవలోచనాం।
అనుజాం వాసుదేవస్య సుభద్రాం భద్రభాషిణీం॥

పశ్చిమాశను, సహదేవుఁడు దక్షిణదిశను జయించిరి. ఈరీతిని వారు భూమిని స్వాధీనపఱచుకొనిరి. పిమ్మట నొకకారణముచే ధర్మజుఁడు ప్రాణములకంటెను ప్రియుఁడైన యర్జునుని వనమున కంపవలసివచ్చెను......ఆయర్జునుఁడు పదమూఁడు మాసములు వనమున నివసించి, పిమ్మట నొకప్పుడు ద్వారకాపురి కేఁగి యట శ్రీకృష్ణుని గలిసికొనెను. ద్వారకయందు శ్రీకృష్ణసోదరియు సుగుణయు, సౌందర్యవతియు నగుసుభద్ర నర్జునుఁడు పెండ్లియాడెను.

......అర్జునుఁడు శ్రీకృష్ణసహాయముతో ఖాండవము నగ్నిపాలు చేసెను....అగ్ని యర్జునునకు గాండీవమును, అక్షయతూణీరములను, కపిధ్వజముగల దివ్యరథము నిచ్చెను. ఖాండవవనమునందే యర్జునుఁడు మయాసురుని రక్షించెను. ఆమయుఁడు సర్వ

... ... అతర్పయచ్చ కౌంతేయః ఖాండవే హవ్యవాహనం।
బీభత్సు ర్వాసుదేవేన సహితో నృపసత్తమ.

... ... పార్థాయాగ్ని ర్దదౌ చాపి గాండీవం ధనురుత్తమం॥
ఇషుధీ చాక్షయౌ బాణై రథంచ కపిలక్షణం।
మోక్షయామాస బీభత్సు ర్మయం యత్ర మహాసురం॥
సచకార సభాం దివ్యాం సర్వరత్నసమన్వితాం।
తస్యాం దుర్యోధనో మందో లోభంచక్రే సుదుర్మతిః॥
తతో ఽక్షైర్వంచయిత్వాచ సౌబలేన యుధిష్ఠిరం।
వనం ప్రస్థాపయామాస సప్తవర్షాణి పంచచ॥—
ఆదిపర్వ॥ 61 అధ్యా॥

రత్నమయమగు సభను నిర్మించి పాండవులకిచ్చెను. ఆసభను జూచి మందుడగు దుర్యోధనుడు లోభించి, పాచికలచే శకుని ధర్మరాజును వంచించునట్లుచేసి, పండ్రెండేడులు పాండవులను వనమున కంపెను.

రెండవసారి వృద్ధినొందిన భాగములు.

(1)...అర్జునుడు యుద్ధములయందు సూర్యునివలెఁ జూడశక్యముకానివాఁ డయ్యెను. ఆతఁడు రాజుల నందఱిని, పార్వతీయాదిగణములను, ఒక్కొక్కసారిగా జయించెను. అర్జునుడు, అన్నప్రదానబహుళము, భూరిదక్షిణాయుతము నగు రాజసూయయాగమును ధర్మజునికొఱకు తెచ్చెను. శ్రీకృష్ణుని

---

(1) శ్లో॥ ....ఆదిత్య ఇవదుష్ప్రేక్ష్య స్సమరే ష్వర్జునో౽భవత్ ॥
సపర్వాన్ పార్థివాన జిత్వా గణా నేకైకశోబలీ।
ఆజహారార్జునో రాజ్ఞే రాజసూయం మహాక్రతుం॥
అన్నవాన్ దక్షిణావాంశ్చ సర్వై స్సముదితో గుణైః।
యుధిష్ఠిరేణ సంప్రాప్తో రాజసూయోమహాక్రతుః॥
సునయాద్వాసుదేవస్య భీమార్జునబలేనచ।
• ఘాతయిత్వా జరాసంధం చైద్యంచ బలదర్పితం॥
దుర్యోధనం వినాగచ్ఛ న్నర్హణాని తతస్తతః।
మణికాంచనరత్నాని గో హస్త్యశ్వ రథానిచ॥
, ... సమృద్ధాం తాం తథాదృష్ట్వా పాండవానాం తదాశ్రియం।
ఈర్ష్యాసముత్థ స్సుమహాం స్తస్యమన్యు రజాయత॥
విమానప్రతిమాంచాపి మయేనసుకృతాం సభాం।
పాండవానా ముపహృతాం సదృష్ట్వా పర్యాపన్యత

నైపుణ్యముచేతను, భీమార్జునులబలముచేతను, 'జరాసంధుని, శిశుపాలుని' జంపించి ధర్మరాజు రాజసూయయాగము నొనర్చెను. దుర్యోధనుఁడు వినాగా నక్కడక్కడి రాజులయొక్క మణికాంచన గోహస్త్యశ్వ రథాదులగు కానుకలు ధర్మజు నొందెను. అపుడు సమృద్ధమైన యాయైశ్వర్యమును జూచి, దుర్యోధనున కీర్ష్యాకోపములు జనించెను. విమానతుల్యమై, మయునిచే నిర్మింపఁబడి పాండవుల కీయఁబడిన సభను జూచి పరితపించుటయేగాక, యచటనే కాలుజారి తొట్రుపడుచు దుర్యోధనుఁడు, శ్రీకృష్ణుఁడు చూచుచుండఁగనే భీమునిచే నీచునిమాడ్కి పరిహాసింపఁబడెను—పిమ్మట దుర్యోధనుఁడు వివర్ణుఁడై నీరసించి పాలిపోయి తనబాధను ధృతరాష్ట్రునకుఁ జెప్ప నాతఁడు దుర్యోధనునందు ప్రేమకలవాఁడై ద్యూతమున కనుజ్ఞ నిచ్చెను.

—మూఁడవపటడప పెంపొందినది—

(1) "రాజ్యార్థలాభంబును, ఖాండవప్రస్థనివాసంబును

యత్రాపహసిత శ్చాసీత్ ప్రస్ఖలన్నివ సంభ్రమాత్ ॥
ప్రత్యక్షం వాసుదేవస్య భీమేనానభిజాతవత్ ॥
... ... కథితో ధృతరాష్ట్రస్య వివర్ణో హరిణః కృశః ॥
అన్వజానాత్తతో ద్యూతం ధృతరాష్ట్రః సుతప్రియః ॥
ఆదిపర్వ॥ 1 అధ్యాయ॥

(1) మూఁడవసారి రూపొందిన మహాభారతమే, దృశ్యమానమహాభారతము; దీనికి నాదిపర్వము రెండవయధ్యాయమున ననుక్రమణిక కలదు. దానిని సంపూర్తిగ నన్నయమహాకవియే యాంధ్రీకరించెను గాన దానినె యిట వ్రాయుచున్నాను.

సుందోపసుందోపాఖ్యానంబును, నారదవచనంబున ద్రౌపది యందు సమయక్రియయును, నర్జునుతీర్థాభిగమనంబును, నులూపీసమాగమంబును, చిత్రాంగదయందు బభ్రువాహను జన్మంబును, ద్వారకాగమనంబును, వాసుదేవానుమతంబున నర్జునుండు సుభద్రను వివాహంబగుటయు, సుభద్రాహరణంబును, హరణహారికయు, నభిమన్యుసంభవంబును, గాండీవ దేవదత్త దివ్యరథాశ్వలాభంబును, ఖాండవదహనంబును, నగ్నిభయంబువలన మయభుజంగమోక్షణంబును, మందపాలోపాఖ్యానంబును, ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ, గింకరదర్శనంబును, నారదువలన లోకపాలసభాశ్రవణంబును, రాజసూయమహాధ్వరారంభంబును, జరాసంధవధయును, గిరివ్రజనిరుద్ధులైన రాజులఁ గృష్ణుండు విడిపించుటయును, దిగ్విజయంబును, రాజసూయంబును, నర్ఘ్యాభిహరణంబును, శిశుపాలవధయును, రాజసూయవిభూతికి దుఃఖితుండై సభాస్ఖలితుండై యున్న దుర్యోధనుం జూచి ద్రౌపదీభీమసేనులు నగుటయును, దత్కారణంబున జూదంబాడుటయు, నందు శకునికైతవంబున ధర్మరాజపరాజయంబును" అనునవి కలవు.

—కథా వివరణము—

పై వ్రాయఁబడిన మూఁడువిధములగు గాథలలోను, మొదటిగాథలుగల గ్రంథము కురుక్షేత్రయుద్ధానంతరము కృష్ణద్వైపాయనుఁడు మూఁడేండ్లకు వ్రాసియున్నాఁడు. ఆగ్రంథము

'ఎనిమిదివేల యెనిమిదివందల' (8800) శ్లోకములుకలది. రెండవ సారి వృద్ధిచేయఁబడి, మొదటిగ్రంథభాగముల నడుమనిమిడింపఁబడి పెంపఁబడినగ్రంథము, కురుక్షేత్రయుద్ధానంతరము రమారమి నూతేండ్లకు 'ఇరువదినాలుగువేల (24000) శ్లోకములు కలదై వైశంపాయనునిచేఁ జెప్పఁబడినది.

మూఁడవసారి పెంపఁబడిన గ్రంథము వైశంపాయనునకుఁ బిమ్మటఁ గొంతకాలమునకు 'సౌతి' చేఁ బై రెండుగ్రంథముల నడుమను శ్రుతిస్మృతిపురాణేతిహాసాదులు స్వేచ్ఛగ నిముడ్చి లక్షశ్లోక (100000) రూపకగ్రంథముగాఁ జెప్పఁబడినది.

పిమ్మటనింకను ననామధేయకవులు పై మూఁడింటను, దమగ్రంథములఁ జేర్చియు, పూర్వగాథలను గొన్నిటిఁదీసివేసియు కలగలుపుచేసియున్నారు. పై మూఁడువిధములగు గ్రంథములకు ను వరుసగా 'జయ, భారత, మహాభారతములు' అని నామము లేర్పడినవి. (1)ఆమూఁడు గ్రంథములలోను మొదటిదగు 'జయ' మునందు "ఇంద్రప్రస్థరాజ్యము నొందినతరువాతను'భీమార్జున నకుల సహదేవులు' వరుసగా 'ప్రాగుత్తర పశ్చిమ దక్షిణ దిక్కు-లను' జయించుటయు, అర్జునుఁ డొకకారణమునఁ బదుమూఁడుమాసములు వనమున నివసించుటయు సుభద్రాపరిణయమును ఖాండవవనదహనమును, అర్జునునకు గాండీవాద్యాయుధ ప్రాప్తి

(1) 'జయ, భారత, మహాభారతములఁ' గూర్చి నామహాభారత చరిత్రమున విపులముగాఁ జర్చింపఁబడెను.

యు మయుని రక్షింప, నాతఁడు వివిధరత్నశోభితమగు సభను నిర్మించి ధర్మజునకిచ్చుటయు, సభనుఁజూచి, దాని నపహరింపు తలంపుతో దుర్యోధనుఁడు మాయాద్యూతముచే, శకుని కైతవమున ధర్మజునోడించి పాండవులను బదిరెండేడులు వనమున కంపుటయుఁ" గలవు.

ఇంక దృశ్యమానమహాభారతమునందలి 'సుందోపసుందోపాఖ్యానము, ఉలూపీ చిత్రాంగదా పరిణయములు, శ్వేతకిగాథ, మందపాలోపాఖ్యానము, లోకపాలసభావృత్తాంతము, జరాసంధచరిత్రము, తద్వధము, పాండవదిగ్విజయము, రాజసూయయాగము, అనుద్యూతము' అనునవి లేవు. పాండవుల దిగ్విజయము అర్జునవనవాస గమనమునకుఁ బూర్వముననే చెప్పఁబడినది.

రెండవదగు భారతమున, "మహాబలవంతుఁడగునర్జునుఁడనేకగణములను (నాగ రాక్షస గణములు లేక, చోర, పార్వతీయగణములు) జయించి ధర్మజునకు రాజసూయముఁ దెచ్చెను. వాసుదేవుని నీతిచేతను, భీమార్జునుల బలముచేతను, జరాసంధుని, శిశుపాలుని, చంపించి ధర్మజునిచే రాజసూయము పొందఁబడెను. దుర్యోధనుఁడు గాక తక్కినరాజు లిచ్చు మణికాంచనాదులగు కానుకలు పాండవుల నొందెను. అప్పటి పాండవుల యైశ్వర్యమును జూచి, దుర్యోధనునకీర్ష్యకలిగెను. గొప్పదగు మయసభనుగూడ దుర్యోధనుఁడు చూచి పరితపించెను. సభలో కాలు

జారి పడగా వాసుదేవునిసన్నిధినే భీముఁడు దుర్యోధనుని నీచ మగు హేళనముఁ జేసెను. దుర్యోధనుఁడు ధృతరాష్ట్రునకుఁ దనపరివేదనముఁ జెప్పగా నాతఁడు ద్యూతమున కనుజ్ఞ నిచ్చెను, అనునవి చేర్పఁబడెను.

ఈరెండవమార్పునందు, అర్జునుఁడె దిగ్విజయయాత్ర చేసి రాజసూయముఁ జేయించెననుటయు, దుర్యోధనుఁడు మయసభ లో జారిపడగా కృష్ణునిసన్నిధినే నీచముగా భీముఁడు పరిహసించె ననుటయు, దృశ్యమాన మహాభారతమున లేవు. దుర్యోధనుని ద్రౌపదీభీములు పరిహసించినట్లున్నది. కృష్ణసాన్నిధ్యమని లేదు. మొదటిగ్రంథమునకు 'జరాసంధ, శిశుపాలుర' హత్యలు రాజ సూయమును ధర్మజుఁ డొనర్పుసందర్భమునఁ జేయఁబడినవను నంశములును, దుర్యోధనహితైషియై ధృతరాష్ట్రుఁడు ద్యూత మున కనుజ్ఞ నిచ్చుటయుఁ జేర్పఁబడెను.

మూఁడవదగు మార్పునందు 'సుందోపసుందోపాఖ్యాన ము, ద్రౌపదీవిషయకపాండవసమయనిష్ఠ, అర్జునకృత గోబ్రా హ్మణరక్షణక్రియ, సమయభంగము, తీర్థయాత్ర, ఉలూపీసమా గమము, చిత్రాంగదాపరిణయము, శ్వేతకి మందపాలోపాఖ్యా నములు, ఇంద్రార్జునయుద్ధము, లోకపాలసభావర్ణనము, జరా సంధచరిత్రము, పాండవకృతదిగ్విజయము, శిశుపాలచరిత్రము' మొదలగువిశేషాంశములు మొదటిరెండుగ్రంథములకంటె ననేక

మడుగులు పెంపఁబడి మొదటిరెండింటిగాథలనడుమ నిముడ్పఁబడినది.

ఇందు చారిత్రకాంశము లెంతవఱకు? ధృతరాష్ట్రునిచే ఖాండవప్రస్థరాజ్య మీయఁబడెనేకాని, అది బహు కూరరమృగాకీర్ణమును, వివిధానాగరిక చోరగణపరివృతము నైన భయంకరప్రదేశము. అందువలననే ధృతరాష్ట్రుఁ డింద్రప్రస్థరాజ్యము నిచ్చునపుడే యిట్లనియున్నాఁడు.

(1) "ఓ ధర్మరాజా! మీరు ఖాండవప్రస్థమున నివసించునపుడు, దేవతలనింద్రుఁడు రక్షించునటుల మిమ్ము నర్జునుఁడు రక్షించుటచే నెవఁడును మిమ్ము బాధింపలేఁడు." అనిచెప్పెను. మఱియు,పురాణాంతరమున నిట్లుకలదు.

క. ఇంద్ర విభవమున నీగతి
నింద్రప్రస్థంబు చేర ♦ నేఁగఁగ నదియుఁ
రుంద్రమృగాకీర్ణంబై
సాంద్రలతా గుల్మ సాల ♦ సంవృతమగుటన్.

* * * * *

మ. ధృతరాష్ట్రుం డతిరోషదూషితుఁడు ధా
త్రీభాగదానోప ధి

శ్లో॥ నచవో వసతస్తత్ర కశ్చిచ్ఛక్తః ప్రబాధతుం।
సంరక్ష్యమాణాన్ పార్థేన త్రిదశానివ వజ్రిణా ॥
ఆదిపర్వ. 207 అధ్యా.

స్థితి నీకానన మిచ్చె జ్ఞాతిజను లి
స్సీ! జ్ఞాతి సద్వైభవో
న్నతి సైరింపఁగ నోపువారె! పలుకుల్
నవ్యామృతాసారముల్
మతి దీప్తాగ్నియ హో! సగోత్రులకుఁ ద
న్మాహాత్మ్యముల్ వింతవే.

ఆ. ఇమ్మహోగ్రవిపిన ♦ మెట్లు పురంబుగాఁ
జేయువాఁడ ననుచుఁ ♦ జింతఁ గలఁగి
యంబుజాయతాక్షు ♦ నడిగిన నమ్మహా
పురుషుఁ డనియె ధర్మ♦పుత్రుతోడ.

(ధర్మఖండము.)

ఖాండవప్రస్థము నంటియే ఖాండవమహావనము ప్రాగ్దక్షిణ భాగములను వ్యాపించి యున్నది. ఆవనమున బలవంతులగు 'తక్షక, అశ్వసేన, శ్రుతసేనాది' నాగగణ ముఖ్యులును (కుండలాపహరణ పర్వమున తక్షకుఁడు చోరముఖ్యుఁడుగా వర్ణింపఁబడెను.) మయాదిరాక్షసులును, మఱికొందఱు భూతగణ జాతిజనులు నివసించియుండిరి. మఱియు నావనము వివిధములగు జలవసతులు గలిగి, బహువిధామూల్యరత్నాకరములకునికిపట్టై, ఇటలీవారిచే నిపుడాక్రమింపఁబడిన 'అబిసీనియా' వలె నుండెడిది. అట్టిఖాండవ వనమును స్వాధీనపఱచుకొనుటయే పాండవుల ముఖ్యాశయము. దానిలోని బలవంతులఁ బారఁదో

లుటయో లేక నిర్జించి స్వాధీనపఱచుకొనుటయో ముఖ్యకర్తవ్యము. ఇంతమాత్రమె కాక, క్రూరమృగములను హతమార్చి వ్యవసాయిక ప్రదేశముగాఁజేసి, భూగర్భస్థములగు వివిధరత్నాదివస్తువులను సంపాదింపవలయును; అందులకు ధర్మజుఁ డేమిచేసెనో చూడుఁడు.

అర్జునుఁడు బ్రాహ్మణుని గోవులను దస్యు లపహరించుచున్నారని విని చోరులఁ బారఁదోలు తొందరచే ద్రౌపదీ ధర్మజులుండిన యాయుధాగారమున కేఁగె ననుకారణమున ధర్మజుఁ డర్జునుని బదిరెండువత్సరములు వనవాసము చేయవలయు నను నియమము ననుసరించి బ్రాహ్మణులు, సేవకులు, భిక్షుకులు, మొదలగువారితో గంగానది నంటిన ప్రాగ్భాగమున సంచరింప నంపెను. కళింగదేశపుసరిహద్దునఁ గొందఱు సేవకులఁ దప్ప తక్కినవారి నట నర్జునుఁడు వదలివేసెను.

బ్రహ్మచర్యముతోఁ బండ్రెండేఁడులు సంచరింపవలయు నని యర్జునుఁడు నియమముతో వెళ్లెనేగాని, తీర్థయాత్రకు వెడలిన స్వల్పకాలములోనె 'ఉలూపి' యను వితంతునాగవనితను గూడి 'ఇరావంతుఁ'డను పుత్రునిగనెను. 'మణిపూరు' పురమున 'చిత్రాంగద' యను ద్రావిడవనితఁగోరి పెండ్లాడి మూఁడేండ్లట నుండి 'బభ్రువాహనుఁ' డనుపుత్రుని బడసెను. తుదకు ద్వారవతి కేఁగి, కృష్ణానుజ యగు 'సుభద్ర' నెత్తికొని వచ్చి 'అభిమన్యుని' గనెను.

ఉలూపియె వలచి కోరుటచే నాపెను గూడుట (1) 'వామదేవ్యము' అను వేదోదిత ధర్మమగునుగాని, 'చిత్రాంగదా, సుభద్రలం' బెండ్లియాడుట నట్టిదికాదుగదా! అదెట్టిబ్రహ్మచర్యమో?

ఆలోచింపఁగా నర్జునుఁడు తీర్థయాత్ర యనునెపముచే ప్రాగ్దక్షిణదేశములయొక్క రాజకీయరహస్యములఁ గనుఁగొనుటకు, ఖాండవవనప్రాంతములఁగల నాగులలో నన్యోన్యకలహములం బెంచుటకే చారాగ్రేసరుఁడుగా బ్రాహ్మణ, భిక్షుకాది, చారులతోఁ గూడి ధర్మజుచేఁ బంపఁబడియుండును.

అర్జునుఁ డులూపీ సంయోగముచే నాగులలో నన్యోన్యకలహములు సంభవించినవి. ఉలూపియం దర్జునునకుఁ బుట్టిన 'ఇరావంతుని' ఉలూపియొక్క ప్రథమభర్తయొక్క సోదరుఁడు పార్థునిపైఁగల పగచే స్వదేశమునుండి తరిమివేయఁగా నాయిరావంతుఁ డర్జునుఁడు దివ్యాస్త్రసంపాదనమునకై స్వర్గలోకమున నుండగా నటకేఁగి స్వవృత్తాంతముఁ జెప్పికొనెను. (2)

(1) తన్ను వలచివచ్చినయాపెను దప్పక పొందవలయును. అది వామదేవ్యవ్రతము; పుణ్యహేతువు. అని 'ఛాందోగ్యోపనిషత్తు'నఁ జెప్పఁబడెను. అర్జునుఁడు పండ్రెండుమాసములే బ్రహ్మచర్యవ్రతముతో వనవాసము సల్పెనని పాఠాంతరము కలదు. కాని యాతఁడు పండ్రెండేడులే దేశాంతరవాసియైనట్లును, అందు మూఁడేండ్లు, 'మణులూరు'పురముననే యుండినట్లును, అన్ని ప్రతులలోను గలదు.

(2) భీష్మపర్వ. 91 అధ్యా.

ఇందువలన నర్జునుఁడు నాగజాతియం దన్యోన్యకలహ ములఁ బెట్టినట్లు స్పష్టముకాఁగలదు. కళింగద్వారమునఁ బె క్కండ్రు బ్రాహ్మణాదుల నర్జునుఁడు విడిచివెళ్లుటకూడ వారు ఖాండవవనప్రాంతమునఁ గల రహస్యములఁ దెలిసికొనుట కేమొ? అర్జునుఁడు 'చిత్రాంగదా, సుభద్ర'లం బెండ్లియాడుటచే స్వప క్షబలాభివృద్ధి కలిగినది.

ఇట్టివి ప్రస్తుతకాలమునందు 'అబిసీనియా' యుద్ధము నకుఁ బూర్వ మాదేశమునందు, 'ఇటలీ' నియంతయగు 'ముస్సొ లోనీ' చేయించిన తంత్రములవంటివిగావా?

శ్రీకృష్ణునితో సంబంధబాంధవ్యములు కలిగిన తరువాత నర్జునుఁడు ఖాండవవన దహనముఁ జేసి యందలి 'నాగ, భూతా ది' గణములను రూపుమాపెను. ఆఖాండవవన దహనకర్మము 'ఇటలీ, జపానులు' ప్రస్తుతకాలమునందు 'అబిసీనియా, చైనా' దేశములలోఁ జేసిన—చేయుచున్న—మారణమహాకర్మములఁ దలఁదన్నిన దనవచ్చును. ఆమహావనమునందలి ప్రాణులలో నాలుగు శార్ఙ్గపక్షిశిశువులును, ఎగిరిపోయిన వానితల్లియు, మా యచే నదృశ్యుఁడగు 'అశ్వసేనుఁడు' అను తక్షకపుత్రుఁడును, పార్థునకు శరణుచొచ్చిన 'మయుఁడును' దప్ప, తక్కిన సమస్త యక్ష రాక్షసగణములును, సమస్తమృగపక్ష్యాదులును, మల మల మాడ్చఁబడినవి.

ఆఖాండవ వన దహనాంశములు, సంస్కృతభారతమున మహాదారుణముగానె వర్ణింపఁబడినను, నన్నయభట్ట మహాకవి కృష్ణార్జున పాత్రములయందు క్రూరత్వమును జూపుట కిష్టము లేకకాఁబోలు మార్దవముగానె యాంధ్రీకరించియున్నాఁడు. ఆ మార్దవ యుక్తాంధ్రీకరణము కూడ నెట్లుండెనో చూడుఁడు.

చ. పెడిలి సువర్ణపర్వతము ♦ పెక్కుదెఱంగుల వ్రయ్యునట్టు ల
 ప్పుడు వివిధప్రకారముల ♦ భూరిశిఖావలి ఖాండవంబు న
 ల్గడఁ గదుఁబర్వగాఁ బెటిగి ♦ కాల్పఁదొడంగెహుతాశనుండు; నే
 డ్పడఁగ వనంబులోని మృగ ♦ పక్షిభుజంగమభూతసంఘముల్.

వ. అంత.

సీ. చక్రధరుండయ్యు ♦ జలరుహనాభుండు
 గాండీవధరుఁ డయ్యుఁ ♦ బాండవుండు
 నుండి రథ్వసమున ♦ నుభయపార్శ్వంబులఁ
 దోల్లింటియట్టుల ♦ పెల్లురేగి
 యనలంబు నార్పంగ ♦ నార్పుచుఁ బఱతెంచి
 వనరక్షకులు పార్థు ♦ సునిశితాస్త్ర
 ధారల నపగత ♦ దర్పులై యరిగిరి
 యమసదనంబున ♦ కమితబలులు

ఆ. శిఖియు నుగ్ర దీర్ఘ ♦ జిహ్వాలు సాచి యు
 ద్ధుర సమీరణంబు ♦ తోడు చేసి

గొని యుగాంతకాల ♦ కుపితానలాకారుఁ
డయ్యె ఖాండవమున ♦ నద్భుతముగ.

* * * * *

చ. జ్వలనశిఖాళియున్ విజయు♦సద్విశిఖాళియు జుట్టుముట్టి నం
దలరి భయాకులంబులగు ♦ తద్వనజీవుల యార్తనాద మం
దులియుచు నొక్కపెట్ట దివి♦నుద్గతమయ్యె నమందమందరా
చల పరివర్తనప్రసభ ♦ సంక్షుభితార్ణవఘోష ఘోరమై.

క. నెగయుచు నెగసి పిఱుందం
దగిలెడు మిడుగురులచేత ♦ దగ్ధచ్ఛదమై
గగనమునఁ బఱవనోపక
ఖగనివహము వహ్నియందఁ ♦ గడువడిఁ బడియెన్.

క. తన తేజోజాలము ప
ర్విన దగ్ధములగు ననేక♦విధదేహులు దే
హానికాయంబుల బహువిధ
తనువులు గలవాఁడపోలె ♦ దహనుం డొప్పెన్.

చ. అమితకృశాను దగ్ధమగు ♦ నయ్యమరేంద్రవనంబులోనియు
త్తమసలిలాశయావళుల ♦ తప్తజలంబులయందు దపేతజీ
వములయి తేలుచుండె నర♦వారిచరంబులు వారిపక్షులుం
గమఠ నశేషకోకనద♦కైరవపంక్తులు శైవలంబులున్.

క. అలుగులవడి ఖాండవమునఁ
గలయాశీవిషమహోర♦గము లెల్ల విషా

గ్నులు గ్రుక్కుచు నత్యుగ్ర
నలబహుళజ్వాలలందు ♦ నాశము నొందెన్.

* * * * *

తే. దాని వెల్వడ నేరక ♦ తద్వనంబు
జీవు లెల్లను బావక♦శిఖలఁ జేసి
దగ్ధులగుచున్నఁ దక్షక♦తనయుఁ డశ్వ
సేనుఁ డను భుజంగము మగ్ని♦శిఖల కవుడు.

ఆ. వెఱచి తల్లి తోఁక ♦ గఱపించుకొని దివిఁ
బఱచువానిఁ జూచి ♦ పార్థుఁ డలిగి
వానితల్లిశిరము♦తోన తత్పుచ్ఛంబు
దునిసి యగ్నిశిఖలఁ ♦ దొరఁగ నేసె.

వ. వెండియు నశ్వసేనునేయ సమకట్టిన యప్పార్థునకుఁ దత్తఱంబ మోహిని యను మాయ గావించి యమరేంద్రుఁ డశ్వసేను విడిపించె—

పై ఖాండవదహనమున, 'తక్షకునిభార్య' నాగవనిత పార్థునిచే వధింపఁబడెను. కాని ఖాండవదహనము అగ్నిదేవతా ప్రీతికై చేయఁబడిన కర్మమగుటచేతను, అది 'ఇష్టము' అను శ్రౌతకర్మముగా నెన్నఁబడుటచేతను, స్త్రీహత్యాది పాపకర్మముగా భారతీయులచేఁ బరిగణింపఁబడలేదు. కాని 'ఇటలీ, జపాను'ల మారణకర్మములు భారతీయుల మతమునందు 'ఇ

ష్టము’లు కానందున నింద్యకర్మములుగాఁ బరిగణింపఁబడుచున్నవి.

కృష్ణార్జునుల ప్రతాపాగ్ని ఖాండవమును దహించినట్లే ‘కృష్ణదేవరాయ బాహుప్రతాప జాగ్రన్మహాగ్ని’ మన కళింగ దేశముపై దండెత్తినపు డేమిచేసెనో చూడుఁడు.

సీ. తొలు దొల్త నుదయాద్రి ♦ శిలదాఁకి తీండ్రించు
నసిలోహమున వెచ్చ ♦ నయిజనించె
మఱికొండవీడెక్కి ♦ మార్కొని నలిఁగిన
యలకసవాపాత్రు ♦ నంటెరాఁజె
అట సాఁగి జమ్మిలో ♦ యఁబడి వేఁగి దహించెఁ
గోన బిట్టేర్చెఁ గొ ♦ ట్టానఁ దగిలె
కనకగిరిస్ఫూర్తిఁ ♦ గరఁచె గౌతమిఁ గ్రాఁచె
నవుల నాపొట్నూర ♦ రవులకొనియె
గీ. మాడుగులవ్రెల్చె నొడ్డాది ♦ మసియొనర్చె
కటకపురిఁగాల్చె గజరాజు ♦ కలఁగిపరవఁ
దోఁకచిచ్చననౌరయు ♦ ద్ధురతఁ గృష్ణ
రాయబాహుప్రతాపజా ♦ గ్రన్మహాగ్ని.

పైపనులఁ గృష్ణదేవరాయలు చేసినట్లు అలసాని పెద్దన మహాకవి సాక్ష్య మిచ్చుటయేకాక (మనుచరిత్ర) శ్రీకృష్ణదేవరాయచక్రవర్తియు నొప్పుదలమై (ఆముక్తమాల్యద) యున్నాఁడు. ఇదియు ‘ఇష్ట’ కర్మమేనా?

శౌర్యప్రతాపాగ్ని లుండినపుడు శత్రుదేశదహనము తప్పకాక యుత్తమకర్మమే యగును. కొన్ని శతాబ్దములకుఁ బూర్వమె సంపూర్ణముగ శౌర్యప్రతాపాగ్నులు చల్లారిన మన కిపు డట్టి దతిదారుణమును కఠినము నగు కర్మముగాఁ గాన్పించుట యుక్తమె. బలవత్ప్రతాపములుగల పాశ్చాత్యులు'ఇటలీ జపానుల'కర్మములను నిందించుటలో భావభేదము కలదు.

ఖాండవదహనమున శరణాగతుఁ డగు మయునివలన నాతఁ డొక సరోవరతీరమున 'వృషపర్వుఁడు' అను నసుర రాజునకు సభను నిర్మించుటకై సేకరించి గుప్తపఱచిన యమూల్యమణికాంచన వస్తువితతి పాండవులకు లభించినది. ఆమణి కాంచనములు 'ఎనిమిదివేలమంది' (8000) బలవంతులగు రాక్షసులచే మోయించుకొని తేఁబడియుండెనఁట!

మయశిల్పము.

'మయ'శబ్దము జాతివాచకముగాఁ గాన్పించును. మన గ్రంథములలో 'విశ్వకర్మ' దేవశిల్పి యని చెప్పఁబడినను, మన దేశమునందలి 'బంగరు పనివాండ్రు, వడ్రంగులు, కంచరులు' మొదలగువారిని 'విశ్వకర్మ' శబ్దముతోనె సంబోధించుట కలదు. అట్లే మయుఁడునని తలంపవలసి యున్నది.

'జందవేస్త' అను పారశీకుల వేదమున 'మజ్దవహు' అను నసుర శిల్పాచార్యుఁడును, అతనిగూర్చిన స్తోత్రములును

గలవు. 'మజ్దనహాు' శబ్దము 'మయశబ్దమునకుఁ బ్రకృతి యని కొందఱిమతము. శ్రీమద్రామాయణమున బహురత్నశోభితమును, విచిత్రమును నగు'స్వయంప్రభాగుహా' (1) మయనిర్మితమనియు, శ్రీరామునకును నభేద్యమై లక్ష్మణుని గాఢమూర్ఛలో ముంచిన రావణప్రయుక్త శక్తి రావణునకు మయునిచే నీయఁబడిన దనియు వర్ణింపఁ బడినవి. మహాభారత మయుఁడు విచిత్ర ధర్మజ సభానిర్మాతయై, భీమునకు భీమకర్మసాధనమగు గదను, అర్జునునకు దేవదత్తమను శంఖమును, నిచ్చియున్నాఁడు. భీముని గద, నేఁటికాలమునందలి పాశ్చాత్యుల 'లూాయీా, హావిజర్' శతఘ్నులవంటిదిగా నెన్నఁదగి యున్నది.

మయజాతివారు మనదేశమునుండి 'అమెరికా' ఖండమునకు వలసవెళ్లిరను నైతిహ్యము కలదు. 'మెక్సికో'దేశమునందును, బ్రిటీషు హాండురాసు' నందును, మయశిల్పములను గత శతాబ్దమునఁ బాశ్చాత్య పరిశోధకులు కనుగొనిరి. మెక్సికోదేశమునందుగల మయశిల్పములను 'బిషపులాండా'అను స్పెయిను దేశీయుఁడు క్రూరత్వముతో నాశముఁజేసెను. యునైటెడ్ స్టేట్సులోని 'హార్వర్డు' యూనివర్సిటీయందలి పండితుఁడగు 'డాక్టర్ స్పెండన్'గారు 'బ్రిటిషు హాండురాసు' మండలము

---

(1) స్వయంప్రభాగుహ వింధ్యపర్వతప్రాంతమున నున్నదని రామాయణమునఁగలదు. అది 'ఎల్లోరా, అజంత' గుహాలలో నొకటిగ నుండవచ్చును.

లోని 'లుబాండం' అను ప్రదేశమును దర్శించి యందలి కట్టడములఁ బరిశోధించిరి. అం దేఁబది యడుగుల యెత్తుగలిగి యెనిమిది యెకరముల ప్రదేశమున వ్యాపించి స్ఫటికపురాలతో నిర్మింపఁబడిన మహాసభ వారికిఁ గాన్పించి దిగ్భ్రమం గొల్పినదఁట! అది మయశిల్పమని వారు వ్రాసియున్నారు. దానివర్ణనములు ధర్మజు మయసభావర్ణనములఁ బోలియున్నవి. 'మెక్సికో, మధ్యమమెరికా, పెరూ' దేశములలోఁ దొలుత నొకకోటి నలువది లక్షలమంది మయజాతివారుండిరనియు, స్పెయిన్ దేశీయు లామయజాతిజులను ఘోరముగా సంహరించిరనియు, పాశ్చాత్యుల గ్రంథములవలననె తెలియనగుచున్నది. ఇప్పటి కామయజాతిజులు హతశేషులై నలువది వేలమంది మాత్రమే కలరఁట ! మనదేశమునందలివారు, 'ఆర్యానార్య ద్రావిడ'జాతి వారలలో సంకరులై యుందురు.

మయుఁడు ధర్మజున కిచ్చిన సభావర్ణనము భారతపాఠకులకుఁ దెలియఁగలదు. (1)

ధర్మజుఁడు పార్థముఖమున ఖాండవవనము నగ్నికర్పించి 'ఇష్టము' అనుకర్మముఁ జేసియు అర్జునునివలననే చోరుల నణఁపించి బ్రాహ్మణుని గోవులఁ గాపాడుటచేతను, మయునిచే నపూర్వసభానిర్మాణముఁ జేయించుటచేతను, 'పూర్తము'అను

(1) ఇంకను మయసభావిశేషములను నాకృతమగు మహాభారత చరిత్రమునఁ జూడనగును.

కర్మమును జేసియు, రాజసూయమునకుఁ బ్రాక్కాలీనములగు 'ఇష్టాపూర్తములను' జేసినవాఁడయ్యెను.అందువలననే రాజసూయ యాగమును జేయుట కుద్యుక్తుఁడయ్యెనని తలంపవలసి యున్నది.

జరాసంధవధము.

(1) జరాసంధుఁడు పాండవప్రపితామహియగు 'సత్యవతికి' సవతియన్నయగు 'బృహద్రధుని' పుత్రుఁడు. శ్రీకృష్ణుని మేనమామయగు 'కంసునకు' మామ. కాన, భీమునిచేఁ జంపఁబడునాఁటికి శతాధికవృద్ధుఁడై భీష్మునితో సమానవయస్సుకలవాఁడో యంతకంటెఁ బెద్దవాఁడో యై యుండెను. ఆతఁడు మొగలాయి చక్రవర్తులలో 'ఔరంగజీబు'వలె భరతఖండస్థరాజులపైఁ బెక్కులు దండయాత్రలు చేసి యందఱకు భయంకరుఁడుగాఁ బ్రవర్తింపుచుండెను. అందు శ్రీకృష్ణుఁడు తన యల్లుఁడగు కంసుని వధించుటచే స్వపుత్రికల ప్రోత్సాహమువలన శ్రీకృష్ణుపై మిగుల నలిగి యాతనిపైఁ బెక్కుదండయాత్రలను జేసెను. జరాసంధుని దండయాత్రలకు భీతినొంది శ్రీకృష్ణాది యాదవులు పదునెనిమిదివేలమంది మధురాపురిని విడిచి దానికిఁ గొన్నివందలక్రోశముల దూరమునం దుండిన పశ్చిమ సముద్రతీరమున ద్వారకాపురిని నిర్మించుకొని యట నివసించిరి. నాఁటి

(1) మహాభారతచరిత్రమున జరాసంధునిగూర్చి విశేషాంశములు వ్రాయఁబడెను.

కాలమున, ప్రాగ్భారత దేశమునందలి మహావీరులగు 'రుక్మి, శిశుపాల, పౌండ్రకవాసుదేవ, భగదత్తులును, కళింగాధీశుఁడు, కాశిరాజు' మొదలగువారును, జరాసంధునకు లోఁబడి యాతనిని సమ్రాట్టునుగా నంగీకరించిరి. ఆతని నెదిరించిన కొందఱిరాజుల నాతఁడు బంధించి వారిని బళువులనుగాఁ జేసి, పౌరుషసూచకమగు నేదియొ యొక యాగముఁ జేయఁదలఁచి యుండెను.

జరాసంధునియొక్క దీర్ఘకాల రాజ్యపాలనము చేతను, అందాతని తెరపిలేని యుద్ధయాత్రలచేతను, రాజవంశజులకును బ్రజలకును విసుగు కలిగి యుండినట్లు కాన్పించును. అందువలననే జరాసంధ వధానంతర మాత్రపదగు 'గిరివ్రజ' పురిలోనివారెవ్వరును విచారింపలేదు. ఆతనిపుత్రుఁడగు సహదేవుఁడును బాండవుల కిష్టుఁడే యయ్యెను. జరాసంధునిచేఁ జెరసాలలలో నుంపఁబడి శ్రీకృష్ణునిచే ముక్తినొందినరాజులును, పాండవపక్షులైరి. కాని యెంతటివృద్ధుఁడైనను, ఎంతగా నన్యులగు రాజులకును, స్వరాజ్యమునందలి జనులకును నహితుఁడైనను, పరిపాలనానైపుణ్యముచేతను, అభేద్యములగు సైన్యములు కలవాఁడగుటచేతనుఁ జరాసంధుని శ్రీకృష్ణుఁడు, భీమార్జునులుగూడఁ బ్రత్యక్షముగ మార్గాని జయింపనేరక మారువేసములతో, పెడదారుల నాతని గృహముఁ బ్రవేశించి, యర్ధరాత్రమునఁ జంపిరి. ఇందు స్వదేశస్థుల రహస్యపు తోడ్పాటుకూడ నుండిన నుండును.

జరాసంధుఁడు వ్యూహనిర్మాణములచేఁ బరసైన్యముల నోడింప సమర్థుఁడైనను శతాధికవృద్ధుఁడగుటచేతను, ఇంతకుఁ బూర్వమె కొన్నియేండ్లనాఁడు 'రాజపురి'లోఁ గర్ణునితోనైన ద్వంద్వయుద్ధములో నెముక విరిగినవాఁడగుటచేతను (1) యువకుఁడు, మల్లయుద్ధ విశారదుఁడు, నగు భీమునిచేఁ జచ్చుట యొక విశేషములోనిది కాదు. అందువలననే కృష్ణద్వైపాయన విరచితమగు 'జయము' అను నితిహాసమున నీయంశము చెప్పఁబడలేదేమో! వైశంపాయనుఁడు నిజచరిత్రాంశమునె జనమేజయునకుఁ జెప్పిన భారతమును దానిలోఁ జేర్చియుండును.

భీమార్జున నకుల సహదేవుల దిగ్విజయము.

ఇది సభాపర్వమునం దస్థానమునఁ జెప్పఁబడెను. ఐతరేయబ్రాహ్మణాది వైదికగ్రంథములలో రాజసూయమునకుఁ బూర్వము (అశ్వమేధమునకువలె) దిగ్విజయము చేయవలయునని యెచ్చటను జెప్పఁబడలేదు. రాజసూయమున భవిష్యద్దిగ్విజయముఁ గోరుచు నందు శత్రుకృతానర్థములు రాకుండుటకు, రాజును, అధ్వర్యుఁడు నొనర్చు హోమాదులు కలవు. యుక్తముగ రాజసూయమున ఋత్విక్కులు కర్మములఁ జేయించిన రాజునకు భవిష్యత్తునందు విజయములు కలుగుననియు, అట్లు తనకుఁ గలిగిననియు జనమేజయుఁడు చెప్పిన ఐతరేయ

(1) ఈయంశము శాంతిపర్వమునఁ గర్ణచరిత్రమునఁ జెప్పఁబడెను.

బ్రాహ్మణమునఁ గలదు. అయంత మింతకుఁ బూర్వమె వ్రాయఁబడెను. నారదుఁడు రాజసూయముఁ జేయుమని ధర్మజునకుఁ జెప్పుటలోఁగూడ—

"అదియును నిర్విఘ్నంబుగ సమాప్తం బయ్యేనేని నిఖిల ప్రజాప్రళయకారణంబైన రణం బగును"

అని చెప్పియున్నాఁడు. అంతియెకాని, తొలుత దిగ్విజయము కావలెనని యెచ్చటను లేదు. రాజసూయము భవిష్య ద్దిగ్విజయమునకుఁ బూర్వమున నొనర్పఁ దగిన యజ్ఞమె. అందులకు మనుష్య (క్షత్రియ) పశువిశసనమె దృష్టాంతము. ఈ యజ్ఞమొనర్చినరాజు తనుతమ దేశములపైఁ బడునను భయముచేతను, అన్యోన్యత్కర్షాసహిష్ణుతచేతను, పరరాజులు యజ్ఞమునకు విఘ్నము గలుగఁ బ్రవర్తింపుచుందురు. ధర్మజుని విషయమున దుర్యోధనున కట్టి యీర్ష్యయే కలిగినది. కాని, రాజసూయమును నిర్వర్తించుటకుఁ దగిన ధనమును, అధికారమును దొలుత సంపాదింప వలసియున్నది. విఘ్న మొనరించువారి నణఁచి యుంచవలెను. అట్టిపరిస్థితులు ధర్మజునకుఁ గలిగినవి. ఖాండవ వనదహనముచే నందలి యమూల్యమణికాంచనాదులు లభించినవి. అధికారము కూడ వృద్ధియైనది. ఇష్టాపూర్త సిద్ధియైనది. ప్రబలుఁడగు జరాసంధుఁడు చచ్చుటచేఁ బ్రబల విఘ్నకరులు లేరు. ఇఁక ధర్మజునకు రాజసూయముఁ జేయుట కే యభ్యంతరములు గలవు? దిగ్విజయ మెందులకు?

సభాపర్వమునందలి దిగ్విజయాంశములు భూగోళశాస్త్రజ్ఞునిచే నందిరికింపఁబడినవి. ఇందులకుఁ గొన్ని నిదర్శనములఁ జూపెదను. అర్జునున కుత్తరదిగ్విజయయాత్రలో (1) త్రిగర్త (2) సుహ్మ (3) చోళ (4) బాహ్లిక దేశములు తగిలినవి. ఇవి కురుదేశమున కుత్తరమునయుండు దేశములు కావు.

(1) త్రిగర్తము కురురాజ్యమునకు దక్షిణపశ్చిమభాగమునయుండునది (2) సుహ్మము గంగానది నంటి కురుదేశమునకుఁ బ్రాగ్భాగమున నుండునది. (3) చోళదేశము, దక్షిణ భారతమునయుండు దేశము.

ఇట్లే భీముని ప్రాగ్దిగ్విజయ యాత్రలో, కురుదేశమునకు దక్షిణమునఁగల 'దశార్ణ'దేశమును కృష్ణానదీపరిసరమున నుండిన (1) 'మల్లక'దేశమును వర్ణింపఁబడినవి.

సహదేవుని దక్షిణదిగ్విజయమున 'నర్మదానదీ'తీరమున 'భగదత్తుఁడు' అర్జునునిచే నోడింపఁబడి, కరము నిచ్చినట్లు విని, సహదేవుఁడు భగదత్తునితో యుద్ధముఁ జేయక వెడలిపోయెనఁట! హిమాలయమునంటి భరతఖండమున కీశాన్యమున నుండిన ప్రా

(1) 'మల్లక'దేశము 'ములక'నామకదేశమై తుదకు ములికినాఁడైనది. ములికినాఁడు 'కడప, కర్నూలు'మండలములలోను, నిజాము రాజ్యాంధ్రమండలమునఁ గొంతవఱకును వ్యాపించినట్లు శాసననిదర్శనము లున్నవి. పైప్రదేశములలో ములికినాఁటి బ్రాహ్మణులు నేఁడును విస్తారముగాఁ గలరు.

గ్జ్యోతిష మెక్కడ ? నర్మదానదీసమీపమునందలి సహదేవుని దక్షిణమార్గమునం దదితగులుట యెక్కడ ?

నకులుని పశ్చిమదిగ్విజయయాత్రయందును, అర్జునుని తో నుత్తరదిక్కున యుద్ధము నొనర్చిన త్రిగర్తము, (1) ఉత్సవసంకేతనగణము, భీమునిచేఁ దూర్పుదిక్కున జయింపఁబడిన దశార్ణదేశము కాన్పించినవి.

ప్రయసందర్భములఁ జూచినచో మహాభారతమున నిటీవల భీమార్జున నకుల సహదేవుల దిగ్విజయము లెవరిచేతనో చేర్పఁబడినవిగాని, మొదటిభారతములోనివిగాఁ గాన్పింపవు. కాని, భీమాదులు, ఇంద్రప్రస్థరాజ్యము నొందినపిమ్మట ఖాండవవనదహనమునకుం బూర్వమున నె కొన్నియుద్ధములను భీష్మధృతరాష్ట్రుల యనుమతితో నొనర్చినట్లు కలదు. చూడుఁడు.

(2) ఆపాండవు లింద్రప్రస్థమున నివసించుచున్నవారై రాజైన ధృతరాష్ట్రునియొక్కయు, భీష్మునియొక్కయు శాసనము ననుసరించి శత్రురాజులను జయించిరి.

---

(1) ఉత్సవసంకేతగణము హిమాలయమున నుత్తరమున నుండెనని కాళిదాస మహాకవి రఘువంశమున (4-78) వర్ణించియున్నాఁడు. సుహ్మదేశము వంగదేశమునకుఁ బశ్చిమభాగమునందుండినట్లును (4-35) వర్ణించియున్నాఁడు.

(2) శ్లో॥ ఇంద్రప్రస్థే వసంతస్తే జఘ్ను రన్యాన్ నరాధిపాన్।
శాసనా ధృతరాష్ట్రస్య రాజ్ఞః శాంతనవస్యచ॥
ఆదిపర్వ. 222 అధ్యా.

ఈయంశము పాండవులకు రాజ్యమునందుఁ బూర్ణమగు నధికారము లేదనియు, ధృతరాష్ట్రునకు లోఁబడి యుమ్మడిగ రాజ్యము నేలుచుండినవారే యనియు స్పష్టపఱచుచున్నది. ఆయంశమును వ్రాయుటకుఁ బూర్వమునాఁటి భరతఖండస్థరాజ్యములఁగూర్చి స్వల్పముగాఁ బ్రస్తావింతును.

భారతకాలమున భరతఖండము, రష్యాకాక తక్కిన నేఁటి యూరపుఖండమంత ప్రదేశము కలదైనను, నేఁడు యూరపుఖండమందలి రాజ్యవిభాగములకంటె నాలుగైదురెట్లు హెచ్చగురాజ్యవిభాగములు కలిగియున్నది. అందుఁ గొన్ని స్వల్పప్రదేశవ్యాప్తములై 'బెల్జియము, హాలండు, డెన్మార్కుల' వలె రాజన్వంతములు. మఱికొన్ని 'స్విట్జర్లండు, లిథూనియా, ఫిన్లండు'లవలె విరాజములును, అధినాయకములును. మఱికొన్ని ఆయుధజీవికగణపాలితములు. (1) మఱికొన్ని బలవంతములు, రాజన్యపాలితములునై ప్రసిద్ధి నడసిన 'ఇంగ్లాండు, ఇటలీల' వంటివి, ఇట్లు నాఁటిభరతఖండస్థరాజ్యములు పలువిధములుగాఁ బాలింపఁబడినట్లు కాన్పించును. భారతమునఁ బ్రసిద్ధి నొందిన 'కురు, పాంచాల, మగధాది'దేశములు కడపటితరగతిలోని 'ఇంగ్లాండు, ఇటలీల' వంటివి. భారతకాలమునాఁటి దేశవ్యవ

---

(1) భరతఖండమునందలి పశ్చిమోత్తరసరిహద్దులోని 'జక్కాఖేలు, అఫ్రిడీలు, మొహమండులు' మొదలగువారు నేఁటికిని ఆయుధజీవికగణములలోనివారే.

స్థలఁ గూర్చిన సాధారణాంశములు గల పట మిందుఁ జూపు చున్నాను.

త్రిగర్త లాఱు తెగలవారనియు, ఆ తెగలాయుధజీవికగణ ములనియుఁ బ్రసిద్ధికెక్కిన 'పాణిన్యాచార్యులవారు' అష్టా ధ్యాయియందు వ్రాసియున్నారు. (1)

త్రిగర్తలతో సంబంధించిన 'దామన్యాది' గణములలోని వారె మనయాంధ్రదేశము నేలిన 'కాకతీయులు' ఇందును గూర్చి నామహాభారతచరిత్రమున వివరించియున్నాను.

భీమార్జున నకుల సహదేవులు తమరాజ్యపుసరిహద్దులం దుండిన సైయాయుధజీవిక గణములనె జయించియున్నారు. ఈ యంశమును ధర్మజుఁడు రాయబారమునకు వచ్చిన సంజయు నితో నిట్లు వెల్లడించియున్నాఁడు.

(2) కురుదేశీయులు, కూడుకొనిన చోరసంఘములం

---

(1) సూ. దామన్యాది త్రిగర్తషష్ఠాచ్ఛః॥ 5-3-116.

(2) శ్లో॥ కచ్చిద్రాజానం ధృతరాష్ట్రం సపుత్రం సమేత్యాహుః కురవ స్సర్వఏవ। కచ్చిద్దృష్ట్వా దస్యుసంఘాన్ సమేతాన్ స్మరంతిపార్థస్య యుధాం ప్రణేతుః। గదా పాణి ర్భీమసేన స్తరస్వీ ప్రవేపయన్ శత్రుసంఘా ననీకే నాగః ప్రభిన్న ఇవ నడ్వలేషు చంక్రమ్యతే కచ్చిదేనం స్మరంతి? మాద్రీపుత్ర స్సహదేవః కళింగాన్ సమాగతానజయ ద్దంతకూరే। వామేనాస్యన్ దక్షి ణేనైవ యాతే మహాబలం కచ్చిదేనం స్మరంతి? పురాజేతుం నకులః ప్రేషి తోయం శిబింస్త్రిగర్తాన్ సంజయ పశ్యతస్తే। దిశం ప్రతీచీం వశమానయ న్మై మాద్రీసుతం కచ్చిదేనం స్మరంతి? ఉద్యోగపర్వ. అధ్యా 22.

జూచినపుడు సపుత్రుఁడగు ధృతరాష్ట్రుం జేరి యుద్ధవీరుఁడగు నర్జునుని స్మరించుచున్నారా ?

చుఱుకుఁదనము గలిగి గదాపాణియై 'కిక్కి సపుగడ్డ' గల బీటిపై విడివడిన యేనుఁగువలె విజృంభించి శత్రుసంఘము లను భీకించు భీముని స్మరించుచుందురా ?

'దంతపూరము' అనుస్థలమునఁ గూడికొనిన కళింగసంఘ ములను సహదేవుఁడు జయించెను. ఆయంశమును స్మరించుచుం దురా?

పూర్వము నకులుఁడు 'శిబిని, త్రిగర్తలను' జయించుట కంపఁబడఁగా, సంజయా! నీవు చూచుచుండఁగనే నకులుఁడు వారిని జయించి పశ్చిమదిక్కును వశపఱచుకొన్నాఁడు. ఆయంశ మును (మీవారు) స్మరించుదురా?''

భీమాదులచేజయింపఁబడినపై వారిలో నొక్క 'శిబి'తప్ప తక్కినవారు 'వీరసంఘములు' ఆయుధజీవికగణములే, యై యున్నవి. 'శిబి' అనానామతరువగు నొకరాజు, అందువలననే పాం డవులలోఁ దక్కువ బలవంతుఁడగు నకులునిచే జయింపఁ బడియు న్నాఁడు. ఈజయములే ఇంద్రప్రస్థరాజ్యము నొందిన తరువాతను ఖాండవవనదహన రాజసూయములకుఁ బూర్వమునను పాండవు లొనర్చిన నిజమగు దిగ్విజయములు.

ఖాండవవనదహనమునకుఁ బూర్వముననే పాండవులు దిగ్విజయమొనర్చినట్లు 'జయము' యొక్క అనుక్రమణికలోఁ

జెప్పఁబడియుండెను. అర్జునుఁడు చోరసంఘముల జయించుట సాధారణాంశము కాదు. ఆతఁడు కట్టకడపటిదశలోఁగూడ, కిరాతులనఁబడుచోర సంఘములతోనె పోరాడి శ్రీకృష్ణభార్యలను యాదవుల యపారధనమునుగోల్పోవ వలసివచ్చినది. కాన నాఁటి చోరసంఘము లపారబలవత్తరము లనఁదగి యున్నవి. కురుక్షేత్ర సంగ్రామమునఁ గూడ ఆయుధ జీవికలగు త్రిగర్త గణములతోనె యాతఁడు పోరియున్నాఁడు. ఆతనికృత్యములలో ఖాండవదహన కార్యమె గొప్పదిగా 'జయ, భారత, మహాభారత' భాగములలో ననేకస్థలములలోఁ జెప్పఁబడియున్నది. "స సర్వాన్ పార్థివాన్ జిత్వాగణా న్కైకశో బలీ" అనుభారతానుక్రమణికలోఁ జెప్పఁబడిన యంశముకూడ నర్జునుఁ డనేకగణములను (ఆయుధజీవికగణములను) జయించినట్లు సుస్పష్టము చేయుచున్నది.

పై కారణములచే నన్నివిధముల జరాసంధవధానంతరము వర్ణింపఁబడిన దిగ్విజయవర్ణనము 'అప్రాప్త' మగుచున్నది.

—రాజసూయగాథ—

ఇది భవిష్యత్తునందు సమ్రాట్టగుటకు సూచకముగాఁ జేయఁబడునదియే కాని సమ్రాట్టయినపిమ్మట నొనర్పఁబడునది కాదని యింతకుఁ బూర్వమె వ్రాసియున్నాను.

సమ్రాట్టయి 'మహాభిషేకము' నొందినపిమ్మట అశ్వమేధము నొనర్పవలయును. ధర్మరాజుఁడు కురుక్షేత్రయుద్ధానంతర

ము సమ్రాట్టగుటచే (1)మహాభిషేకమునొంది పిమ్మట నశ్వమేధము నొనర్చియున్నాఁడు. హరిశ్చంద్రుని రాజసూయము కంటె ధర్మజుని రాజసూయము సాంగోపాంగమై సంపూర్ణత నొందినట్లు మహాభారతమునందలి వర్ణనములవలనఁ దెలియుచున్నది. ఇందులకు ముఖ్యమైనకొన్ని యంశములఁ జూపెదను.

(1) ఋత్విక్కులు సమర్థులు కావలెను. కృష్ణద్వైపాయనాదులు హరిశ్చంద్రుని యాగమునందలి ఋత్విక్కులతో సములై సమర్థులై నవారె, కాని హరిశ్చంద్రునియాగము కంటె నిందు భీమార్జునాదివీరులు సంపాదించి తెచ్చిన యపారధనము విస్తారముగా దక్షిణాదికమునకై వినియోగింపఁబడి యుండుటయు, అన్నదానాదికము విశేషముగా జేయఁబడుటయుఁగలిగియుండుటయతిశయము. హరిశ్చంద్రుని రాజసూయమునం దట్టివిశేషవర్ణనములు కాన్పింపవు.

(2) అన్నిటికంటె ముఖ్యాంగమైనది (క్షత్రియ)పశువిశసనము.

హరిశ్చంద్రుని రాజసూయమునఁ దొలుతఁ బశువుగా నిర్ణయింపఁబడిన క్షత్రియుఁడగు 'రోహితుఁడు' తప్పించుకొనెను. వానికిమారుగా నిర్ణయింపఁబడిన శునశ్శేపుఁడైనను విశసింపఁబ

(1) శాంతిపర్వము ధర్మజుఁడు పట్టాభిషిక్తుఁడైన ఘట్టమునందలి వర్ణనములు 'ఐతరేయబ్రాహ్మణము' నందలి మహాభిషేక విధులకు సరిపోయి యున్నవి. కాన నది ధర్మజుఁడొందిన మహాభిషేకమే.

డక తప్పించుకొన నట్లా విశ్వామిత్రాదు లారాజసూయముఁ బూర్తి చేసిరి. ధర్మజుని రాజసూయమున ధర్మజునియుక్తే విధి యందున్నరీతిని యువకుఁడును యుద్ధసన్నాహశీలియుఁ నగు 'శిశుపాలుఁడు' అంతర్వేదికిఁ దేఁబడి హఠాత్తుగ శ్రీకృష్ణుని చక్రముచేఁ గొట్టఁబడుటచే 'విధ్యుక్తమగు' క్షత్రియపశువిశసనమె ధర్మజుని రాజసూయమునందు జరిగియున్నది. అన్నిటికంటె నిది రాజసూయమునకు ముఖ్యాంశము. ఆయంశముఁ జర్చించుటకుఁ బూర్వము "శిశుపాలుని' చరిత్రము క్లుప్తముగాఁ జెప్పవలసి యున్నది.

శిశుపాలుఁడు

శిశుపాలుఁడు 'చేది' దేశాధిపతి. చేదిదేశము నేఁటి మధ్యరాష్ట్రములయందలి 'బిలాసపూరు, జబ్బలూపురు' మండలములలోఁ గొంతవఱకు వ్యాపించిన మితప్రదేశము. శిశుపాలుని తండ్రి దమఘోషుఁడు. తల్లి సాత్వతి. ఆమె కుంతీదేవికిఁ జెలియలు. అనఁగా శిశుపాలుఁడు పాండవులకుఁ బినతల్లి కుమారుఁడు. శ్రీకృష్ణునికి మేనత్తకొడుకు. శ్రీకృష్ణునికంటెఁ జాల చిన్నవాఁడు. చిన్నతనమున శిశుపాలుని శ్రీకృష్ణుఁ డెత్తికొనుచుండినట్లు భారతమునఁ గలదు. 'శిశుపాలుఁడు' స్వల్పమగు రాజ్యమున కధిపతి యనియు, బాలుఁడనియు, తెలివితక్కువ వాఁడ

నియు, ధర్మజునితో భీష్ముఁడు చెప్పిన క్రింది యంశములవలనఁ దెలియ నగుచున్నది.

ఉ. పాలితదుర్గ యుండు శిశు◆పాలుఁడు బాలుఁడు వీనినేల భూ
పాలక నీకుఁ బట్టునఁబు◆పన్ మఱి ధర్మ వెఱుంగ వీనికిం
బోలున రాగకోప పరి◆భూత మనస్కున కల్పరాజ్యల
క్ష్మీ లలనాంధబుద్ధి కని◆మిత్త మహా త్పరివాదశీలికిన్॥

రాజసూయ కాలమున కాతనికి 'ధృష్టకేతువు, శరభుఁడు' అను నిరువురు పుత్రులు గలరు. విదర్భాధిపతియగు 'భీష్మకుఁడు' శిశుపాలునకుఁ దనకూఁతురగు 'రుక్మిణి' నీయఁ దలంపఁగా శ్రీకృష్ణుఁడు రాక్షసవివాహ విధిచే రుక్మిణి నపహరించి పెండ్లియాడెను. (1) ఈ యీర్ష్యను మనస్సునం దుంచుకొని శిశుపాలుఁడు

(1) శ్రీకృష్ణాదులు ప్రాగ్జ్యోతిషపురముపైకి దండయాత్రకుఁ బోఁగా ద్వారకాపురిని గాల్చెను.

(2) ఉగ్రసేనుఁడు రైవతకాద్రియందు స్త్రీలతో విహరింపఁబోఁగా వారలను బాధించెను.

---

(1) మేనత్తకుమారునకు వాగ్దత్తయైన రుక్మిణిని శ్రీకృష్ణుఁడు పెండ్లియాడుట 'ధర్మవ్యతిరిక్తసాహసకార్యమని' తంత్రవార్తిక మహాభాష్యమున 'కుమారిలభట్టాచార్యుఁడు' వ్రాసియున్నాఁడు.

I (3) వసుదేవుఁ డశ్వమేధముఁ జేయ నశ్వమును విడువఁగా దాని నపహరించి యాగమునకు విఘ్నముఁ జేసెను.

(4) 'బభ్రువు' అను యాదవునిభార్య ద్వారకనుండి 'సౌవీర' దేశమునకుఁ బోయినపు డామెను కామమోహితుఁడై యపహరించెను.

II (5) వసుదేవుఁడు వరించినదియు, విశాలుఁడు అనువాని కుమార్తెయు నగు 'భద్ర' అనునామెను పొంచి పట్టుకొని యామెబంధువులగు 'కుకురులు, అంధకులు' అనువారిం జంపి, యా 'భద్ర'ను గొనిపోయి 'కరూశ' దేశపు రాజునకు నిచ్చెను.

పై యపకారములఁ దముకొనరించినట్లు శ్రీకృష్ణుఁడే వానిఁ జంపుటకుఁ బూర్వము సభలోఁ జెప్పియున్నాఁడు.

శిశుపాలుఁ డొనర్చిన యపకార్యములు 'అశక్తత, దుర్జ

I వసుదేవుఁ డేదేశమునకును రాజు కాఁడు. అట్టివానికి నశ్వమేధము కొనర్చు నర్హత యెట్లుకలిగినది? సార్వభౌముఁడే యశ్వమేధము నొనర్పవలయునని 'తైత్తిరీయబ్రాహ్మణము' విధించుచున్నది. ఎట్లో కలదనినను అశ్వసంరక్షణముకై బలవంతులగు శ్రీకృష్ణాది పుత్రులుగాని, ప్రద్యుమ్నాది పౌత్రులుగాని యేల యశ్వసంరక్షణమున కేఁగలేదు? కాన వసుదేవుని యశ్వమేధయాగ గాథ మృషయనియే చెప్పవలసియున్నది —

II ఈయంశము కొన్ని సంస్కృత భారతపు ప్రతులలో లేదు.

సత్వములతోఁ జేయఁబడినవియె కాని వీరకృత్యములు కావు.

కాని, 'భాగవతాది' పురాణములలోను, 'శిశుపాలవధాది' కావ్యములలోను, 'సనకాది మహర్షుల'చే శప్తులైన విష్ణుద్వారపాలకులగు 'జయ, విజయులు' తొలిజన్మమున 'హిరణ్యాక్ష, హిరణ్యకశిపులును, రెండవజన్మమున 'రావణ, కుంభకర్ణులు'ను నైరనియు, మూఁడవజన్మమున 'శిశుపాల, దంతవక్త్రు' లైరనియుఁ జెప్పఁబడియున్నది.

లోకోపద్రవకర కార్యములను 'హిరణ్యకశిపు, రావణా'దు లొనర్చినట్లు శిశుపాల దంతవక్త్రులే మహాకార్యములఁ జేసిరి? శిశుపాలుఁడైనను దనకుఁ బగవారగు యాదవులకె యపకృతిఁ జేసెను గాని యితరుల కేవిధమైన యపకారములను జేయలేదు. కరూశ దేశాధిపతియగు 'దంతవక్త్రుఁడు' శ్రీకృష్ణునకుఁ గూడ నేవిధమగు నపకృతియుఁ జేసినటులు లేదు. అట్టివారు రావణాదుల యవతారులనుట యెట్టిది? హిరణ్యకశిపు రావణు లెక్కడ? శిశుపాలుఁడెక్కడ? శిశుపాలుఁ డేవిధముగను రావణాదుల కీడుగాఁడు. రావణాదుల యపరావతారుఁడును గాఁడు. ఇది మిథ్యాకల్పనమె యనవలసియున్నది.

పెద్దతల్లి కుమారుఁడు చేయు రాజసూయముఁ జూడ వచ్చిన శిశుపాలుని భీష్మ శ్రీకృష్ణుల ప్రోత్సాహముచే ధర్మజుఁడు 'ఉపవసానీయేష్టి' యందుఁ బశువుగాఁ జేయ నియ్యకొని యుండును. ఇది శ్రీకృష్ణునకు శత్రునిశ్శేష హేతువును, భీష్మున

కుఁ దనమనుమని రాజసూయము విధ్యుక్తధర్మముగా జరిగి యుండుటచేఁ దృష్టి హేతువును నైనది. ధర్మజునకును నట్టిదియే.

అందువలన 'పునరభిషేచన' దినమున (1) 'అంతర్వేది' యం దందఱును జేరినపుడు భీష్ముఁడు పూజ్యుఁడగు నెవనికైన 'అర్ఘ్యము' నీయ ధర్మజుఁ బ్రోత్సహించి, పిమ్మట (ఉదవసానీయేష్టికిఁ బూర్వమున) శ్రీకృష్ణుని యౌన్నత్యము నెంతమాత్రము సహింపని శిశుపాలునకుఁ గోపము రేఁగునట్లు అర్ఘ్యము నీయఁ బ్రోత్సహించిన తానె శ్రీకృష్ణుని మిగులఁ బొగడి, యాతనికె యర్ఘ్యము నీయుమని చెప్పగాఁ గోపోద్రిక్తుఁడగు శిశుపాలుఁడు శ్రీకృష్ణ భీష్ములను నిందింపుచు సభనుండి వెడలిపోవుచుండఁగా ధర్మరాజు శిశుపాలుని వెంబడించి వానిని అనునయింపుమాటలతో సభకుఁ దిరిగి తెచ్చెను.

సభకు రాఁగానె తిరిగి భీష్ముఁడు సులభకోపుఁడగు శిశుపాలునకుఁ గ్రోధాతిరేకము కలుగఁ బలుకఁగా శిశుపాలుఁడును వెనుదీయక భీష్మ శ్రీకృష్ణులను దూషింపుచుండఁగ నంతకుముందేమియు ననని శ్రీకృష్ణుఁడును దాను శిశుపాలుని తప్పుల నె

(1) రాజసూయాంగమగు సోమయాగమైన మఱునాఁడు క్షత్రియపశువిశసనముతోఁ గూడిన 'ఉదవసానీయేష్టి'తో సోమయాగము పూర్తియగుననియుఁ బిమ్మట 'పునరభిషేచనము' అనుకర్మము జరుగుననియు నింతకుఁ బూర్వమె వ్రాసిన యంశములను నిట జ్ఞాపకమునందుంచుకొనవలయును. శిశుపాలవధము పునరభిషేకమునకుఁ బూర్వమె యైనట్లు భారతమునఁ గలదు.

న్నుచుఁ దటాలునఁ జక్రాయుధముఁ బ్రయోగించి శిశుపాలుని బడఁగొట్టెను.

శిశుపాలుఁడు తన్నట్లు కపటముగాఁ గొట్టుదురని యెఱుఁగఁడు. శ్రీకృష్ణునిచేఁ దన్నట్లు చేయింతురని యెఱిఁగియుండినఁ దిరిగి సభకు రాకుండఁగనైన నుండును; లేక మార్గాంతరమున యుద్ధమునైనఁజేసి యుండును. ఇది యజ్ఞవేదికయందు జరిగిన దగుటచే క్షత్రియపశువిశసనమె యైనది.

ఇంతమాత్రమె కాదు. జరాసంధుని భీముఁడు వధింపఁగా జరాసంధుని దేహమునకు నాతని పుత్రుఁడగు సహదేవుఁ డంత్యక్రియలఁ జేయ శ్రీకృష్ణుఁ డనుజ్ఞ నిచ్చెను. కాని, శిశుపాలుని దేహమును వేగముగా సంస్కరింపుఁడని ధర్మజుఁడు దగ్గఱనుండిన పుత్రుని నియోగింపక తన తమ్ములను నియోగించిన ట్లున్నది.

మఱియు శిశుపాలుని పుత్రుఁడు సన్నిధి నుండుటచేతనే ధర్మజుఁడు, అప్పుడె శిశుపాలపుత్త్రుఁ జేదిదేశమునకుఁ బట్టాభిషిక్తుం జేసెను. శిశుపాలుని వేగముగా సంస్కరింపుఁ డనుటలో 'ఉష్ట్రక్రమ' కాలస్యము లేకుండఁగఁ జేయుటకై యుండును.

పై యంశము లెట్లుండెనో మూలము ననుసరించి వ్రాయుచున్నాను. (శ్రీకృష్ణుఁడు శిశుపాలునిపై నేరములఁ జెప్పుచు)

(1) "ఓ రాజులారా! మీరు చూచుచుండఁగ నిప్పుడే వీనిఁ బడఁగొట్టెదను. అని చెప్పి తత్‌క్షణమె శత్రుభయంకరుఁడగు కృష్ణుఁడు చక్రముచే శిశుపాలుని శిరమును గొట్టెను. ఆ శిశుపాలుఁడు వజ్రాహతమగు పర్వతమువలెఁ బడెను...... అందఱును సంతోషింపుచు శ్రీకృష్ణుని విక్రమమును బ్రశంసించిరి.

అపుడు ధర్మజుఁడు తమ్ములతో వేగముగా శిశుపాలుని సత్కారముతో సంస్కరింపుఁడు అనెను. ధర్మజుని శాసనము ననుసరించి యాతని తమ్ములట్లుచేసిరి. అప్పుడే చేదిదేశమున కాతని పుత్రుని 'పార్థుఁడు' రాజులతోఁ గూడి పట్టాభిషిక్తుం

(1) శ్లో॥ అధునా వధయిష్యామి పశ్యంతాం వో మహీక్షితాం। ఏవముక్త్వా యదుశ్రేష్ఠ శ్చేదిరాజస్య తత్‌క్షణాత్। వ్యపాహర చ్ఛిరః క్రుద్ధ శ్చక్రేణా మిత్ర కర్షణః। సపపాత మహాబాహు ర్వజ్రాహత ఇవాచలః॥......................................
శశంసు ర్నిర్వృతా స్సర్వే దృష్ట్వా కృష్ణస్య విక్రమం। పాండవ స్త్వబ్రవీ ద్భ్రాతౄన్ సత్కారేణ మహీపతిం॥ దమఘోషాత్మజం వీరం సంస్కారయత మాచిరం। తథాచ కృతవంతస్తే భ్రాతుర్వై శాసనం తదా॥ చేదీనా మాధిపత్యేచ పుత్రమస్య మహీపతేః। అభ్యషించ త్తదా పార్థ స్సహతై ర్వసుధాధిపైః॥
తత స్సకురురాజస్య క్రతు స్సర్వసమృద్ధిమాన్।
యూనాం ప్రీతికరో రాజన్ సంబభౌ విపులౌజసః॥

సభాపర్వ॥

జేసెను. పిమ్మట పశ్చాత్తాపవంతుఁడగు ధర్మజునియొక్క రాజసూయము సమృద్ధిమంతమై యువకులకుఁ బ్రీతికరమై ప్రకాశించెను."

(క్రింద గీఁతలుగల యంశములఁ బరిశీలించినయెడల పుత్రుఁడు సన్నిధి నుండినను శిశుపాలుఁడు వానిచే సంస్కరింపఁబడక ధర్మజుని సోదరులచే యజ్ఞయపశువుగా సంస్కరింపఁబడినట్లు స్పష్టమగుచున్నది. మఱియు శిశుపాలుని సంస్కరించుటచేతనె రాజసూయము బాగుగ నయ్యెను. అనికూడఁ జెప్పఁబడెను.)

శిశుపాలుఁడు యుద్ధముచేసి మృతి నొందెనని కొన్ని భారతపు ప్రతులలోను, శిశుపాల వధాది కావ్యములలోను గలదుకాని, యుద్ధభూమిలో లేక సభలోన నిమ్మికతో నుండినపుడే ప్రమాదమునొంది శ్రీకృష్ణునిచేఁ గొట్టఁబడెనని 'సాల్వని' యీక్రింది వాక్యములు స్పష్టపఱచుచున్నవి.

(1) "నేనిపుడా పాపకర్ముఁడు, క్షుద్రుఁడు, విశ్వాసఘాతకుఁడు, నగుకృష్ణుని శిశుపాలుని జంపెనను కోపమువలన యమ సన్నిధి కంపెదను.

(1) శ్లో॥ అద్య తం పాపకర్మాణం క్షుద్రం విశ్వాస ఘాతినం।
శిశుపాల వధామర్షా ద్గమయిష్యే యమక్షయం॥

(1) "నాకు సోదరుఁడు రాజు నగు శిశుపాలుఁడు పాప స్వభావుఁడగు నెవనిచేఁ జంపఁబడెనో వాని నీభూమిపైఁ జంపఁ గలను.

బాలుఁడు, రాజు, ధీరుఁడు, నగు నాసోదరుఁడు ప్రమాదమునొంది యుద్ధముఖమున లేనపు డెవనిచేఁ జంపఁబడెనో వానిని జంపుదును"

సాల్వుఁ డిట్లనె నని కృష్ణుఁడే వనమునందుండిన ధర్మజుఁ జూడ నేఁగినపుడు చెప్పెను.

పై యంశములచే శిశుపాలుఁడు తన్నట్లు చేయునని తలంపక పరాకుగా నుండినపుడె తటాలున శ్రీకృష్ణుఁడు చక్రముచే శిశుపాలుఁ గొట్టియున్నాఁడనుట స్పష్టమగుచున్నది. ఇంతమాత్రమె కాదు. కృష్ణపాండవు లపుడు మహాద్భుత్యాదశలో నుండుటచే సభలోనివా రెవ్వరును నేమియుఁ జేయనేరక కృష్ణునే నుంతించియున్నారని, దుర్యోధనుఁడు శకునితోఁ జెప్పిన యీక్రింది వాక్యముల వలనఁ దెలియనగుచున్నది.

ఉ. "యాదవుచేతి చక్రము భయంకరమై శిశుపాలమస్తక
చ్ఛేదము సేసినం గడుఁ బ్రసిద్ధులు శూరులు నైనరాజు ల

---

(1) శ్లో॥ మమ పాపస్వభావేన భ్రాతా యేన నిపాతితః।
శిశుపాలో మహీపాల స్తం వధిష్యే మహీతలే॥
భ్రాతా బాలశ్చ రాజాచ నచ సంగ్రామ మూర్ధని।
ప్రమత్తశ్చ హతో వీర స్తం హనిష్యే జనార్దనం॥
అరణ్యపర్వ॥ 14 అధ్యా॥

య్యాదవు ముందటన్ జయుజ • యధ్వను లిచ్చిరిగాని వానిశో
ర్యోదయవృత్తి కట్టెదుర • నోపర మెవ్వరు విక్రమింపఁగన్॥"

పై కారణముల నాలోచింప సర్వవిధముల శిశుపాలుఁడు రాజసూయమునందలి 'ఉదవసానీయేష్టి' యందుఁ బహుగాని విశసింపఁబడినట్లును అది హఠాత్కృతముగాఁ జేయఁబడినట్లును స్పష్టమగుచున్నది. ధర్మజు రాజసూయము సర్వవిధములసంపూర్ణత నొందినదో యనునట్లు మధ్యపాన మొకయజమానుఁడే గాక రాజసూయమునకు వచ్చినవారిలోఁ ద్రాగనివాఁడొక్కఁడును లేఁడని చెప్పఁబడి యున్నది. (1)

మఱియు 'కాత్యాయన'సూత్రానుసారముగా 'పునరభిషేకమున' గావలసిన ద్రవ్యములలో నైదు 'పాచిక' లుండవలెను. దానికిఁ దగినట్లు ధర్మజుని పునరభిషేకమునకు 'విరాటుఁడు' బంగారుతో తాపటము చేయఁబడిన'పాచికలఁ' దెచ్చి యిచ్చినట్లుకూడ వర్ణింపఁబడెను. (2)

ఇట్లే తక్కిన పునరభిషేక పరికర సంపత్తియు, అభిషేకానంతరము రాజు బంధువులచేతను సామంతులచేతను బొగడఁబడుచు రథారోహణమొనర్చి సంచరించుటయు వేదోక్తముగా వర్ణింపఁబడియున్నది. (3)

---

(1) సభాపర్వ॥ 52 అధ్యా. 48 శ్లో॥ (2) సభాపర్వ. 53 అధ్యా. 8 శ్లో॥
(3) సభాపర్వ. 53 అధ్యాయ.

'కాత్యాయన, హిరణ్యకేశి' సూత్రానుసారము పునరభిషేకానంతరము రాజైదుగురితో, సుహృద్ద్యూతము నొనర్పవలెనని యున్నది. ధర్మజుని పునరభిషేకానంతరమును నైదుగురు జూదగాండ్రుండిన సభలోనె సుహృద్ద్యూతము నొనర్చినట్లు కలదు. చూడుడు.

ద్యూతమునకుఁ బిలువవచ్చిన విదురునితో ధర్మజుఁడు సుహృద్ద్యూత సభలోనే 'కితవు' లున్నారన విదురుఁ డిట్లని యున్నాఁడు.

1 "ఓరాజా! ద్యూతమునందు మిక్కిలి నేర్పుగల (1) శకుని (2) వివింశతి (3) చిత్రసేనుఁడు (4) పురుమిత్రుఁడు (5) జయుఁడు, అనువారు కలరు."

అని చెప్పియున్నాఁడు. మఱియు యూపాంగద్యూతమున బంగరు వస్తువులనే యుపయోగింపవలయు నవియుఁ గలదు. ఈ సుహృద్ద్యూతమున రత్నములు పొదిగిన మణిహారమునే ధర్మజుఁడు తొలుతఁ బందెపుసొమ్ముగా నొడ్డియున్నాఁడు.

వేయునేల—

క. ధరణి హరిశ్చంద్రుఁడు భా।
సుర యశుఁడయి చేసె రాజసూయం బదియున్।

1 శ్లో॥ గాంధారరాజ శ్శకుని ర్విశాంపతే। రాజాతిదేవీ కృతహస్తో మితాక్షః వివింశతి శ్చిత్రసేన శ్చ రాజా సత్యవ్రతః పురుమిత్రో జయశ్చ॥ సభా॥ 58. అధ్యా॥

సరిగా దనియే తలఁతును
సురుచిరవిభవమునఁ బొందుచుఁ సుతు యజ్ఞముతో॥

—:O:—

పరిశిష్టము.

రాజసూయయాగమును 'హరిశ్చంద్రుఁడు, ధర్మజుఁడు' మాత్రమే చేసినట్లు భారతపాఠకులు, పౌరాణికులు, తలంతురు. మఱియు రాజసూయమె రాజకృత యాగములలో సర్వోత్కృష్ట యాగమనియు, అది సార్వభౌమత్వ సూచకమని యు వారితలంపు. కాని, అది సరికాదు.

రాజసూయముఁజేసి మహారాజత్వమొంది, పిమ్మట దిగ్విజయమొనర్చి యశ్వమేధముఁజేసి సమ్రాట్టు కాఁగలఁడని 'తైత్తిరీయ, ఐతరేయ' బ్రాహ్మణములవలనఁ దెలియ నగు చున్నవి.

రాజసూయముఁజేసి మహారాజత్వ మొందిన రాజుల నామములును, అశ్వమేధము నొనర్చి సామ్రాట్టులయిన రాజుల నామములును, కొన్ని యైతరేయ బ్రాహ్మణమునఁ జెప్పఁబడి యున్నవి.

ఏఋషి సాంప్రదాయము ననుసరించి వారు రాజసూయ మొనర్చినదియు నందు సూచింపఁబడెను. ఆయంశము నిందుఁ జూపుచున్నాను.

రాజసూయము నొనర్చిన రాజులు, మహారాజులు.	సాంప్రదాయపు ఋషులు
1. సుమద్యుని పుత్రుడగు 'విశ్వంతరుడు'	మార్గవేయుడగు రాముడు.
2. పరిక్షిత్తుని పుత్రుడగు 'జనమేజయుడు'	కవషునిపుత్రుడగు 'తురుడు'
3. సహదేవుని పుత్రుడగు 'సోమకుడు'	పర్వత, నారదులు
4. సర్జయుని పుత్రుడు 'సహదేవుడు'	
5. దేవావృధుని పుత్రుడు 'బభృవు'	
6. విదర్భదేశాధిపతి 'భీముడు'	
7. గాంధారదేశాధిపతి 'నగ్నజిత్తు'	
8. అరిందముని పుత్రుడు 'సనశ్రుతుడు'	అగ్నిఋషి
9. జానకుని పుత్రుడు 'క్రతువిదుడు'	
10. విజవసునిపుత్రుడు 'సుదాసుడు'	వసిష్ఠుడు

(1) "పై వారందఱును పై ఋషుల సాంప్రదాయముల ననుసరించి రాజసూయములఁజేసి మహారాజులైరి"

పై నుడువఁబడినవారిలో 'దమయంతి' తండ్రి 'భీముఁ' డొకఁడు పేర్కొనఁబడెను. ఇది పౌరాణికులకుఁ గ్రొత్త. అట్లే రాజసూయమొనర్చిన ధర్మజుని నామము లేకుండుటయుఁ బౌరాణికులకు వింత.

(1) "సర్వేహైవ మహారాజా ఆసుః" ఐ. బ్రా. 7—5.

మఱికొన్ని విశేషములు,

మహాభారతమున నానావిధ ధర్మములుండుటచే నది ధర్మశాస్త్రమేగాని, చరిత్రముగాదని కొందఱును. మోక్షశాస్త్రమని మఱికొందఱును, వీరకావ్యమని పెక్కండ్రును, వాదించుచుందురు. తత్తదంశములుండుటచే నట్లు భ్రమించుటకుఁ గారణములుండును. కాని యన్నియంశములు నందిమిడియున్న వని వారు తలంపవలెను.

అధునాతనులలోఁ గొందఱు జ్యోతిష్కులు 'కన్యారాశి'యన ద్రౌపది యనియు, వాయుదేవతాకముగాన స్వాతీనక్షత్రమన భీముఁడనియు, ఇంద్రదేవతాకమగు 'జ్యేష్ఠా'నక్షత్రమన 'అర్జునుఁ'డనియు, 'మీనరాశి' యనమత్స్యయంత్రమనియు, నేవేవియో యభూతకల్పనముల నల్లి భూమ్యాకాశములకు ముడివెట్టుచు, భారతపురుషులగు ద్రౌపదీపాండవులు కల్పితపురుషులనుచున్నారు. అది చారిత్రకమె కాదనుచున్నారు. ఖగోళవిషయములే యట్లు కల్పింపఁబడిన వనుచున్నారు.

అట్లయిన 'ఆకాశమునందు' కశ్యపాది ఋషి నామములతోఁ గొన్ని నక్షత్రములున్నవి. మనవాఙ్మయమునఁ గశ్యపాదిఋషుల చరిత్రము లున్నవి. ఇంతమాత్రమెకాదు. 'కశ్యపాది'ఋషిగోత్రజులమని ప్రతిదినము త్రికాలములందును స్వగోత్రఋషిప్రవరములఁ జెప్పు విప్రులున్నారు. పాండవులవలె నీ గోత్ర ప్రవరములుగల కశ్యపాదులుకూడ మిథ్యయనియు,

'గోత్ర,' ప్రవరఖండ'లలోను, వేదములయందు నుడువఁబడిన,వసిష్ఠ, విశ్వామిత్రాదులు, ఖగోళస్థ నక్షత్రముల నూహించి, యే కవిచేతనో కల్పింపఁబడినవారనియుఁ జెప్పవలయునా ?

నక్షత్రములకు 'వాయ్వింద్రాగ్ని దేవతాకములనియు' రాసులకు, కన్యామీనాదికములనియు, భూలోకములోనివారె నామములు పెట్టియున్నారు. అవి ధీమంతుల యూహలే కానివేఱు కాదు. కొన్ని సంబంధములు ఖగోళమునందలి పేరులకును భారత గాథలకును కలిగినంతమాత్రమున భారతగాథలు ఖగోళశాస్త్రము ననుసరించి వ్రాయఁబడెననుట సర్వాబద్ధము. భారతము చరిత్రగ్రంథము. తత్త్వార్థాన్యాంశములం దిటీవల చేర్పఁబడినవి.

ఇంక నొకవిధమగు పరిశోధనము.

మఱికొందఱు పరిశోధకులు 'భారత' గాథలయొక్కయుఁ, తత్రస్థులగు కురుపాండవుల యొక్కయుఁ బ్రశంసలు 'వైదిక వాఙ్మయమున' నెచటను గాన్పింపవుగాన భారతగాథయుఁ దత్రస్థులగు కురుపాండవుల నామములును గల్పితములే యని చెప్పుదురు.

ఇది మిగుల విచారణీయాంశమె. కాని, వైదిక వాఙ్మయమంతయు నింకను బ్రకటితము కాలేదు. 'మైత్రాయణీయ, కఠ, కాలాప' సంహిత లిప్పుడిప్పుడే ముద్రింపఁబడుచున్నవి.

'పైప్పలాదర' సంహితాదు లింకను ఖండాంతరములలో గుప్తప ఱుపఁబడియే యున్నవి. మఱికొన్ని నశించినట్లు కాన్పించుచున్నవి. అట్టి యపరిశోధిత వైదిక వాఙ్మయమున నెచటనైనఁ గురుపాండవుల చరిత్రముండెనేమొ ?

'ఛాందోగ్యోపనిషత్తు' నందును 'తైత్తిరీయ కాఠకములందును' ఇతిహాసములు, పురాణములు వేదమునకు భిన్నములుగా నుండినట్లు చెప్పఁబడి యున్నది.

భారతగాథ 'జయము' అను నితిహాసనామముగా నుండెనని మహాభారతముయొక్క మొదటను, కడపటను, నడుమనుగూడఁ జెప్పఁబడెను. ఆజయేతిహాస మెట్లు పెంపఁబడెనో విపులముగా నింతకుఁబూర్వమె వ్రాసియున్నాను. వేదమునకు భిన్నమైన 'జయము' ఇతిహాసమె. అనఁగా జరిగిన నిజచరితమెకాని, కల్పితము కాదు. వేదకాలమునఁ బ్రత్యేకముగఁ బ్రచారములోనుండినవియు, ఛాందోగ్యాదులలోఁ బేర్కొనఁబడినవియునగు నితిహాస గ్రంథములే మహాభారతమున (పెంపఁబడిన భాగమున) 'సువర్ణ, దుష్యంత, యయాతి, నల, రామ, సావిత్రి, మరుత్తుల' యితిహాసములు. 'సువర్ణోపాఖ్యానము' వేదవాఙ్మయముకంటె వేఱుగనున్నదని 'ఐతరేయబ్రాహ్మణము' నందలి యీక్రింది వాక్యమువలన స్పష్టమగుచున్నది.

1 "ఆఖండదస్సులు సుపర్ణుఁడై యెగిరిన యంశమును సౌప ర్ణాఖ్యానమని, ఆఖ్యానవేత్తలు చెప్పిరి"

మొదటి చరిత్రము కాలాంతరమునఁ బలువిధములుగాఁ బెరిగియుండుట లోకస్వభావమె.

మహాభారతకాలమున వాడుకలో నుండిన రామాయణ గాథ అరణ్యపర్వమునఁ జేర్పఁబడెను. తొలుత వాల్మీకి రచిం చిన దదియే యైయుండును. పిమ్మట ననేకములగుమార్పుల నొం దినది. 'భాస్కర, రంగనాథుల' కాలమున నాంధ్రదేశమున నెట్లు రామాయణగాథలు మార్పుల నొందెనో వాల్మీకి రామాయణ గాథలను, 'భాస్కర, రంగనాథుల' రామాయణములలోని గా థలను బరిశీలనముతోఁ బఠించినవారికి విశదము కాఁగలదు.

మఱియు 'పాణిన్యాచార్యుఁడు' వైదికఋషియే. ఆత నికాలమునకు భారతగాథ ప్రచారములో నుండుటయే గాక 'వాసుదేవార్జునుల'యందు, ఇతర క్షత్రియులకంటె నెక్కుడు భక్తితత్పరులై యున్నారని సూచించి యున్నాఁడు. 2

మఱియు 'యుధిష్ఠిర, నకులాదులు'ను బురాణ పురు షులనుగాఁ బేర్కొనియున్నాఁడు.

ఇంకను గ్రీస్తునకుఁ బూర్వమున నేడవ శతాబ్దమున

---

1 'తేయత్సు పర్ణో భూత్వోదపదం తదేతత్సౌపర్ణమిత్యాఖ్యాన విద ఆచక్షతే॥ ఐ. బ్రా. 3—3—25.

2 సూ॥ మహారాజా ట్ఠఞ్॥ 4—3—97, వాసుదేవార్జు నాభ్యాంవున్॥ 4—3—98. గోత్ర క్షత్రియా ఖ్యేభ్యోబహుళంవున్॥ 4—3—99.

నుండిన ఉదయన మహారాజు పాండవ వంశస్థుడని యిప్పటికి రెండువేల వత్సరములకుఁ బూర్వముననుండిన 'భాసుడు'ను ఇంచుమించుగ నాకాలముననే బయలువెడలిన కథాసరిత్సాగర గ్రంథకర్తయుఁ జెప్పియున్నారు. చాళుక్యులు తాము పాండవ వంశస్థులమని చెప్పుకొని యున్నారు. ఇట్లుండగా భారతగాథ యుఁ దత్ప్రస్తుతకురుపాండవులును నెట్లు కల్పింపఁబడి యుండురని చెప్పవలయును ? దృశ్యమాన వైదిక వాఙ్మయమున షట్చక్ర వర్తులలో హరిశ్చంద్రుఁడుగాక తక్కిన చక్రవర్తులును, షోడశ మహారాజులలోఁ నెక్కండును జెప్పఁబడ లేదు. కాన వారందఱి చరితములును సంపూర్ణముగా మిథ్యలేనా? కొన్నియైన నుండవా ? కాన భారతేతిహాసము సంపూర్ణముగా మిథ్య యనరాదు. కొంతమాత్రము కల్పితమైనది. పాండవులు కల్పి త పురుషులు కారు.

'జయ'మున రాజసూయమునేల చెప్పలేదు ?

ఇతిహాసములలో వైదిక కర్మాంశములుండవు. ఇందుల కు వైదిక వాఙ్మయమునఁ జెప్పఁబడిన 'సువర్ణోపాఖ్యానము, నలునిచరిత్రమునఁ గాన్పించు భీముని చరితము, పురాణముల లోఁ జెప్పఁబడిన హరిశ్చంద్రోపాఖ్యానములే నిదర్శన ములు. పై యితిహాసములలో 'సోమాహరణ, రాజసూయ యాగ' కర్తృత్వము లెట్లు చెప్పఁ బడలేదో, అట్లే తొలి

కురుపాండవ చరితమగు 'జయము' అను నితిహాసమునను జెప్పఁబడలేదు. రెండవసారి పెంపఁబడిన సంపూర్ణ చరితమగు (వైశంపాయనకృతము) భారతమున, శిశుపాలుఁడు పశువుగాఁ జేయఁబడినట్టిదియు, యజ్ఞమున కాటంకము లేకుండగఁ దొలుతనే చేయఁబడిన జరాసంధ వధముతోఁగూడినట్టిదియు, నగు రాజసూయము సృష్టికరింపఁబడెను.

భారతమును పంచమ వేదముగాఁ జేయు తలంపుగల 'సౌతి' రాజసూయమునందలి వైదిక కర్మాంశములఁ బూర్తిగ నా యితిహాసములో నిమిడిచియున్నాఁడు.

పై కారణములచే భారతగాథ సత్యమైన చరిత్రమనియు, ధర్మజుఁడు రాజసూయ మొనర్చుటయు, నందు శిశుపాలుఁడు పశువుగా వధింపఁబడుటయు నిశ్చయములని, దృఢముగా వ్రాయఁ గలుగుచున్నాను.

ఇది శ్రీ కౌండిన్యగోత్రపవిత్రుఁడును, పెండ్యాలవంశజుఁడును,
రామాంబా వేంకయాహ్వయుల ప్రథమపుత్రుఁడును,
'వ్యవసాయ, మహాభారత, పరిక్షిచ్చరిత్రాది'
బహుగ్రంథకర్తయు నగు వేంకట సుబ్ర
హ్మణ్యశాస్త్రిచే రచింపఁబడిన
'రాజసూయ రహస్యము'
నందు ద్వితీయభాగము.
సమాప్తము.

శ్రీ శ్రీ శ్రీ